thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 112 | కరీంనగర్ మంగళవారం, 1 జులై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 100 జిల్లాల్లో పీఎం ధన ధాన్య కృషి

న్యూఢిల్లీ : వ్యవసాయాభివృద్ధికీ, రైతు సంక్షేమానికీ తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. దేశంలో వ్యవసాయ సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అందుకే, దేశంలోని తక్కువ పంట దిగుబడి, ఉత్పాదకత ఉండే వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందించేందుకు పీఎం ధన ధాన్య కృషి యోజన పథకానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. దేశవ్యాప్తంగా తొలుత ఎంపిక చేసిన 100 జిల్లాల్లో అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.

2025-26 బడ్జెట్‌కు సంబంధించి వ్యవసాయం-గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటుచేసిన వెబినార్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ మాట్లాడారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన వ్యవసాయ సంబంధ కార్యక్రమాలను ముందుగా మొదలుపెట్టాలని అధికారులను కోరారు. ప్రస్తుతం దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తి పెరిగిందని, అయినప్పటికీ దేశీయ వినియోగంలో 20% ఇప్పటికీ దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోందని చెప్పారు.




# ఎవరూ ఊహించని విధంగా...

# నాగపూర్ నిర్ణయం మేరకే...

## తెలుగు రాష్ట్రాలకు బీజేపీ కొత్త సారథులు!

## ఆంధ్రాకు మాధవ్ - తెలంగాణకు రామచంద్రరావు

ఉభయ తెలుగు రాష్ట్రాలకు బీజేపీ నూతన అధ్యక్షులు ఎవరో తేలిపోయింది? ఇంతవరకు అనేక కోణాల్లో, అనేక సమీకరణలు ఆధారంగా లెక్కలు కట్టిన కమల దళం చివరకు నాగపూర్ ఎంపిక చేసిన పాత కాపులకే పట్టం కట్టింది.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి మాజీ ఎమ్మెల్సీ పీవీ మాధవ్, తెలంగాణకు మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు పేర్లను, బీజేపీ అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు ఇద్దరు నేతలకు ఆధిస్ఠానం నుంచి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. నిజానికి.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ అధ్యక్ష పదవి కోసం సీనియర్ నాయకులు చాలా మంది పోటీ పడ్డారు. ఆంధ్ర ప్రదేశ్ లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి మొదలు, పాత, కొత్త నాయకులు చాలా మందే రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశించారు. ఇక తెలంగాణలో అయితే.. చెప్పనే అక్కర లేదు. ఎంపీలు ఈటల రాజేందర్ , ధర్మపురి అరవింద్, డీకే అరుణ,మాజీ అధ్యక్షులు లక్ష్మణ్ , బండి సంజయ్ ఇలా చాలా పేర్లు తెరపైకి వచ్చాయి. ఒక దశలో ఈటల పేరు ఖరారు అయినట్లే ప్రచారం జరిగింది.. అయితే.. చివరి క్షణంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ సంఘ్ (ఆర్ఎస్ఎస్) బ్యాక్ గ్రౌండ్ ఉన్న పీ మాధవ్, రామచంద్రరావు పేర్లను ఆదిష్ఠానం ఖరారు చేసింది. దీంతో ఇదరి ఎంపిక నాగపూర్ నిర్ణయంగా భావిస్తునారు. నిజనికి ఇద్దరూ కూడా సంఘ్ సిద్ధాంత పునాదులపై ఎదిగిన నాయకులు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ, పీవీ చలపతి రావు కుమారుడు మాధవ్, బీజేపీలో సాధారణ కార్యకర్త మొదలు అనేక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుత రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. అలాగే, రామచంద్ర రావు బాల్యం నుంచి సంఘ్ సంపర్కంలో పెరిగారు ఏబీవీపీ లో క్రియాశీలంగా పనిచేసిన ఆయన బీజేపీలో లీగల్ సెల్ బాధ్యలతో పాటుగా పార్టీ బాధ్యలు నిర్వహించారు. సోమవారం (జూన్ 30) మధ్యాన్నం 2 గంటల తర్వాత ఏపీలో మాధవ్, తెలంగాణలో రామచంద్ర రావు నామినేషన్ దాఖలు చేశారు.




పాశమైలారం: సంగారెడ్డి జిల్లా పాశమైలారం ఘటనలో మృతుల సంఖ్య 12కి చేరింది. మరో 30 మందికిపైగా గాయాలయ్యాయి. భవనం, శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వెలికితీసిన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రుల్లో 12 మంది పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. సోమవారం పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. సిగాచి రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పలువురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిలో సంఘటన స్థలిలోనే ఐదుగురు మృతి చెందగా.. మరో 7 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వచ్చాయి. సమాచారం అందుకున్న కార్మికుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో అక్కడి పరిస్థితి భీతావహంగా మారింది.

**వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ దుర్మరణం...** సిగాచి రసాయన పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ దుర్మరణం పాలయ్యారు. గోవన్ ప్లాంట్‌లోకి అడుగుపెట్టిన సమయంలోనే పేలుడు సంభవించింది. ప్రమాద ధాటికి ఆయన కారు నుజ్జునుజ్జయింది.

**సంగారెడ్డి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్...** సిగాచి ప్రమాద బాధితుల కోసం సంగారెడ్డి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రమాద బాధితుల వివరాల కోసం 08455276155ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

**పరిశ్రమల భద్రతపై త్వరలో కమిటీ...** పరిశ్రమల్లో భద్రతపై త్వరలోనే ఓ కమిటీ వేస్తామని మంత్రి వివేక్ తెలిపారు. అధిక పని గంటలపై కార్మికులు ఫిర్యాదు చేస్తే లేబర్ కమిషన్ దర్యాప్తు చేస్తుందన్నారు. మరోవైపు సిగాచి పరిశ్రమ ఘటన దురదృష్టకరమని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత అన్ని విభాగాల అధికారులు సత్వరమే స్పందించారని, ప్రమాదానికి గల కారణాలను ఇప్పుడే చెప్పలేమన్నారు. ఈ పరిశ్రమలో మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ అనే పౌడర్ తయారు చేస్తున్నట్లు చెప్పారు. గత 40 ఏళ్లుగా ఈ సంస్థ పని చేస్తోందని తెలిపారు.

## ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సమాచార పౌర సంబంధాల శాఖది కీలక పాత్ర : ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక





హైదరాబాద్, జూన్ 30: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సమాచార పౌర సంబంధాల శాఖ కీలక పాత్ర పోషిస్తుందని I &PR ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక అన్నారు. సమాచార శాఖ ప్రధాన కార్యాలయంలో పౌర సంబంధాల అధికారి గా విధులు నిర్వర్తిస్తున్న ముళ్ళపూడి శ్రీనివాస్ కుమార్ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రాష్ట్ర సమాచార శాఖ కార్యాలయంలో PRO శ్రీనివాస్ కుమార్ ను కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచి ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసేందుకు సమాచార శాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సమాచార శాఖ కార్యాలయంలో PRO ముళ్ళపూడి శ్రీనివాస్ కుమార్ తమ విధులను అంకితభావంతో సమర్ధవంతంగా నిర్వర్తించారని I &PR ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక ప్రశంసించారు. ఉద్యోగ విరమణ మరొక కొత్త జీవితం అని అన్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు వ్యక్తి గత జీవితాన్ని చాలా కోల్పోతామని, ఉద్యోగం విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలన్నారు. అనంతరం శ్రీనివాస్ కుమార్ కుటుంబ సభ్యులను ప్రత్యేక కమిషనర్ పరిచయం చేసుకున్నారు. సమాచారశాఖ PRO ముళ్ళపూడి శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ తన 38 ఏండ్ల ఉద్యోగ జీవితం సంతృప్తిగా సాగిందన్నారు. అనేక పురస్కారాలు లభించాయన్నారు. చిత్తశుద్ధితో పని చేయడం వలన సమాచార శాఖకు తాను చేసిన సేవల కంటే పొందినదే ఎక్కువ అని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, సంయుక్త సంచాలకులు కె.వెంకట రమణ, వెంకటేశ్వరావు, ఉప సంచాలకులు మధుసూధన్, వై వెంకటేశ్వర్లు, ప్రసాద్, హష్మీ , సమాచార శాఖ అధికారులు , ఉద్యోగులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలో రాకుండా అడ్డుకుంటున్నది ఎవరో కాదు బిజెపి కేంద్ర నాయకత్వమే?

# రాజా సింగ్ సంచలన ఆరోపణలు

**గత ఎన్నికల ముందు తెలంగాణలో బిజెపి పోటీ చేసి అధికారం కైవసం చేసుకుంటుందనుకునే సమయంలో బండి సంజయ్ ని మార్చి పార్టీ కార్యకర్తలను ప్రజలను విస్మయానికి గురిచేసింది**

**బిజెపిలో ఎందరో బలమైన నాయకులు ఉండగా పార్టీకి నష్టం కలిగే విధంగా**

**బలహీనమైన నాయకునికి రాష్ట్ర అధ్యక్ష పదవి కట్టబెట్టారని బాధతో రాజాసింగ్ రాజీనామా**

**బిఆర్ఎస్ తో పొత్తు పెట్టుకోవడానికి బలహీనమైన నాయకుడికి రాష్ట్ర అధ్యక్ష పదవి కట్టబెట్టారని కార్యకర్తలు పార్టీ నాయకులు ఆక్రోషంతో ఉన్నారు**

**హిందుత్వ నినాదంతో హిందువులను మోసం చేస్తున్న బిజెపి పార్టీపై ప్రజలు ఆవేశంతో ఉన్నట్టు తెలుస్తుంది**




హైదరాబాద్ జూన్ 30: రాబోయే సాధారణ ఎన్నికల్లో ఎలాగైనా బిజెపి అధికారంలో వస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న ప్రజలకు నాయకులకు కేంద్ర నాయకత్వం నిరాశపరిచిందనే చెప్పాలి. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలో వస్తుందని కార్యకర్తల్లో పార్టీ వర్గాల్లో ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న సమయంలో సత్తా లేని నాయకుడిని రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక చేయడం తెలంగాణ ప్రజలను తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా కేంద్ర నాయకత్వం వ్యవహరిస్తుందని రాజసింగ్ రాజీనామా చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర బిజెపి పార్టీకి ఎంతో నష్టం చేకూరుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. బిఆర్ఎస్ పార్టీ గతంలో ఓడిపోయి పార్టీకి బలం లేకుండా పోయింది అందులో కవిత అరెస్టుతో పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి ఇప్పుడు బిఆర్ఎస్ పార్టీలో కుటుంబ తగాదాలతో కవిత పార్టీలో సరైన ప్రాధాన్యత దొరకట్లేదని అన్నతో తండ్రితో తగువుకి దిగి తన జాగృతి ద్వారా కార్యక్రమాలను ఉదృతం చేసి కొత్త పార్టీ ఏర్పాటు చేసి రాష్ట్రంలో అధికారం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు అందరికీ తెలిసిన విషయమే ఇలా బిఆర్ఎస్ పార్టీ తన బలహీన పడిన సమయంలో అందరూ బిజెపి ఇలాగైనా రాష్ట్రంలో గెలుస్తుందని అభిప్రాయంతో ఉన్న తరుణంలో ఇలాంటి నిర్ణయం రాష్ట్ర ప్రజలకు నిరాశ కల్పించింది. తెలంగాణలో బిజెపి పార్టీ గెలిచే అవకాశాలు ఎన్నో ఉన్నా కేంద్ర నాయకత్వమే కావాలని తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో రాకుండా చేస్తుందని బిజెపి నాయకుల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. నిజానికి తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలో వస్తుందా అని అనుకుంటే ప్రజల నాడి ప్రకారము ప్రజలు కసితో ఈసారి కచ్చితంగా బిజెపికి ఓటు వేసి మన హిందుత్వాన్ని నిలబెట్టుకొని మన సత్తా చాటుదామని కసితో ఉన్న తరుణంలో బలమైన నాయకులు ఎందరో ఉన్న ఒక బలహీన నాయకునికి తెలంగాణ రాష్ట్ర పగ్గాలు అతని చేతిలో పెట్టడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. రాబోయే సాధన ఎన్నికల్లో ప్రజల ఆకాంక్ష ఈసారి కూడా నెరవేరేతట్టు లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బలహీన నాయకుడిని రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నుకునే ప్రక్రియలో బిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీఆర్ పాత్ర కీలకంగా ఉన్నట్టుగా సమాచారం దానికి కారణం రాబోయే సాధారణ ఎన్నికల్లో బిజెపితో బిఆర్ఎస్ పొత్తు ఏర్పరచుకొని ఎలాగైనా కాంగ్రెస్ పార్టీని ఓడించి రెండు పార్టీల కలయికతో తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ విజయం సాధించాలని తపనతో బలహీన నాయకుడికి బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కినట్టయితే మేము నిశ్చింతగా అధిక సీట్లు సాధించగలమనే ధీమాతోనే కెసిఆర్ చక్రం తిప్పినట్టు బిజెపి నాయకులు అనుమానాలను వ్యక్తపరుస్తున్నారు

చురకలు






పాశమైలారం: సంగారెడ్డి జిల్లా పాశమైలారం రసాయన పరిశ్రమ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. రియాక్టర్ పేలడంతో ఇప్పటి వరకు 12 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మరోవైపు పలువురు కార్మికులు ఇంకా పరిశ్రమలోనే చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో పరిశ్రమలోకి చొచ్చుకెళ్లేందుకు కార్మికుల కుటుంబాలు యత్నించాయి. తమవారి ఆచూకీ చెప్పాలంటూ బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలోకి వారిని వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కుటుంబసభ్యులు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఘటనాస్థలిలో కార్మికుల కుటుంబాల రోదనలు మిన్నంటుతున్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రుల్లో 12 మంది పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. సోమవారం పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. సిగాచి రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పలువురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిలో సంఘటన స్థలిలోనే ఐదుగురు మృతి చెందగా.. మరో 8 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనం బీటలు వారింది.

## పాశమైలారం ఘటన.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి: సీఎం రేవంత్ ఆదేశం



హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో పేలుడు ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు సంభవించింది. సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో 12 మంది కార్మికులు మృతి చెందారు. ఘటనాస్థలంలో ఐదుగురు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వచ్చాయి.

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి...** పాశమైలారం ఘటనపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడిన ఘటన వివరాలను తెలుసుకున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. బాధితులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

## పాశమైలారం ఘటనపై మాజీ సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి



హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన పేలుడు ఘటనపై మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిగాచి పరిశ్రమలో 8 మంది కార్మికుల మృతిపట్ల సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. చనిపోయిన వారి కుటుంబాలని ఆదుకోవాలన్నారు. సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో ఇప్పటి వరకు 12 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఘటనాస్థలంలో ఐదుగురు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. గాయపడిన మరికొందరు కార్మికులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వారాయి.




ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా చేసిన దాడుల ప్రభావం కొన్ని నెలలు మాత్రమే ఉంటుందని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) అధిపతి రఫేల్ గ్రాసీ పేర్కొన్నారు. ఇరాన్ అణు కేంద్రాలను నుజ్జునుజ్జు చేశామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనకు ఇది పూర్తి భిన్నంగా ఉండటం గమనార్హం. టెహ్రాన్ మరికొన్ని నెలల్లోనే అణు ఇంధనం శుద్ధి చేయడాన్ని ప్రారంభించగలదని చెప్పారు. ఈ వ్యాఖ్యలు దాడి అనంతరం వెలువడిన పెంటగాన్ ఇంటెలిజెన్స్ నివేదికలో ఇచ్చిన సమాచారానికి మరింత బలం చేకూర్చేలా ఉన్నాయి. "నిజం చెప్పాలంటే.. అంతా మాయమైపోయిందని, అక్కడేమీ మిగల్లేదని ఎవరూ చెప్పలేరు. అమెరికా రెండు అణుకేంద్రాలపై 14 బంకర్ బస్టర్ బాంబులు వేసింది. తీవ్రంగా నష్టం వాటిల్లింది. కానీ, పూర్తిగా నాశనమైపోలేదు" అని రాఫేల్ గ్రాసీ పేర్కొన్నారు. ఆ రెండు కేంద్రాల్లో 18,000 సెంట్రిఫ్యూజ్‌లు ఉండొచ్చని గతంలో ఆయన అంచనా వేశారు. వాస్తవానికి డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ రిపోర్టు పూర్తిగా బంకర్ బస్టర్ బాంబులు ప్రయోగించిన యురేనియం శుద్ధి కేంద్రాల పైనే ఉంది. కానీ, ఇతర గ్రూపుల నుంచి వచ్చిన విశ్లేషణల ప్రకారం ఇరాన్‌కు అతిపెద్ద దెబ్బ ఇస్ఫహాన్‌లో తగిలింది. ఇక్కడ శుద్ధి చేసిన యురేనియంను లోహంగా మార్చేందుకు అవసరమైన ల్యాబ్ అమెరికా దాడిలో ధ్వంసమైంది. ఇది మాత్రం టెహ్రాన్‌కు ఇబ్బందికర విషయమే. అణ్వాయుధం తయారీకి ఈ ప్రక్రియ చాలా కీలకం. మరోవైపు ఇరాన్ ఉన్నతాధికారుల సంభాషణలను ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టి విశ్లేషించాయి. వారు ఊహించినంత నష్టం వాటిల్లలేదని దీనిని బట్టి తెలుస్తోంది. ట్రంప్ మాత్రం ఇంటెలిజెన్స్ నివేదికలు లీక్ చేసిన సీఎన్ఎన్, న్యూయార్క్ టైమ్స్‌ను కోర్టుకు లాగాలని నిర్ణయించుకొన్నారు. ఈ విషయాన్ని ఆయన ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. తాము చట్ట ప్రకారం వెళ్లి.. "జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని వారికి ఎవరు ఇచ్చారో వెల్లడించాలి" అని కోరతామన్నారు. మరోవైపు ఇరాన్ దౌత్యవేత్త అమిర్ సయిదీ ఇరావని కూడా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ యురేనియం శుద్ధి ప్రక్రియ ఎప్పటికీ ఆగదని తేల్చిచెప్పారు. శాంతియుత అణు కార్యక్రమం కోసం ఇలా చేసే హక్కు ఇరాన్‌కు ఉందన్నారు.




హైదరాబాద్: తెలంగాణ భాజపా అధ్యక్షుడిగా ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. ఈ పదవికి మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేరు ఖరారైంది. ఈ మేరకు నామినేషన్ వేయాలని పార్టీ అధిష్ఠానం ఆయన్ను ఆదేశించింది. మధ్యాహ్నం 2 గంటలకు రామచందర్‌రావు నామినేషన్ దాఖలు చేశారు.

రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు ఎవరికి అప్పగించాలన్న విషయంపై భాజపా అగ్రనేతలు తీవ్ర కసరత్తు చేశారు. ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేర్లు బలంగా వినిపించాయి. ఈ క్రమంలో రామచందర్‌రావు పేరును ఖరారు చేశారు. ఆరెస్సెస్‌తో పాటు కొందరు సీనియర్ నేతలు ఆయన పేరును బలంగా ప్రతిపాదించినట్లు తెలిసింది.

అధికార కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం, పార్టీని బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలను కొత్త అధ్యక్షుని ఎంపికలో పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం.

## పథకం ప్రకారమే కేసీఆర్ కుటుంబంపై కక్ష సాధింపు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్: పథకం ప్రకారమే కేసీఆర్ కుటుంబంపై కక్ష సాధింపు జరుగుతోందని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుతో కేసీఆర్, కేటీఆర్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఏ విచారణ అధికారైనా వాళ్ల పేర్లు చెప్పారా? అని ప్రశ్నించారు. "ఫోన్ ట్యాప్ చేశారని ఎవరైనా ఫిర్యాదు చేశారా? ఊహించి రాసి.. ఇదే జర్నలిజం అంటే ఊరుకునేది లేదు. ఆధారాలు లేకుండా రాస్తే మా చర్యలు కఠినంగా ఉంటాయి. దుష్ప్రచారంపై కేసీఆర్ ఊరుకున్నా మేం ఊరుకోం. దేశంలో ఫోన్ ట్యాపింగ్ ఎక్కడా జరగడం లేదా? ఇప్పుడు ట్యాపింగ్ జరగట్లేదని సీఎం చెప్పగలరా?" అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

## తెలంగాణలో భాజపా అధికారంలోకి వస్తే బీసీ సీఎం: బండి సంజయ్



హైదరాబాద్: భాజపా ప్రజాస్వామ్య పార్టీ అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ ఎవరైనా వేసుకోవచ్చని.. అధిష్ఠానం చెప్పిన ప్రకారం నడుచుకోవాలని సూచించారు. నాంపల్లిలోని భాజపా కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. "భాజపా అధిష్ఠానం ఇంకా అధ్యక్షుడిని అధికారికంగా ప్రకటించలేదు.

భాజపా.. ఎవరో చెప్పారని అధ్యక్షుడిని నియమించే పార్టీ కాదు. అధిష్ఠానం చెప్పిన వ్యక్తే అధ్యక్షుడు అవుతారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వస్తుంది.. బీసీని సీఎం చేస్తాం. అధిష్ఠానం నిర్ణయానికి కార్యకర్తలు కట్టుబడి ఉంటారు. దళితులను సీఎం చేస్తామని భారాస మోసం చేసింది. ఆ పార్టీ బీసీలకు సీఎం, పార్టీ అధ్యక్ష పదవులు ఇస్తామని ప్రకటించగలదా?"అని సంజయ్ వ్యాఖ్యానించారు.

## మాదాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు.. అడ్డుకున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



హైదరాబాద్: నగర పరిధి మాదాపూర్‌లోని సున్నం చెరువులో హైడ్రా కూల్చివేతలను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అడ్డుకున్నారు. దీనిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సున్నం చెరువులో కూల్చివేతలను ఆపేయాలని డిమాండ్ చేశారు. సున్నం చెరువులో ఆక్రమణల తొలగింపును సోమవారం హైడ్రా చేపట్టింది. 32 ఎకరాల విస్తీర్ణంలోని సున్నం చెరువులో భారీగా ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన గుడిసెలను కూల్చేశారు. చెరువు సమీపంలో అక్రమంగా వేసిన బోరు మోటార్లను తొలగించారు. చెరువు పరిధిలోని భూగర్భ జలాలను వినియోగించొద్దని హైడ్రా సూచించింది. అక్రమంగా నీటిని తరలిస్తున్న పలు వాటర్ ట్యాంకర్లను సీజ్ చేసింది.




భారత్ నుంచి ఒమన్‌కు వెళ్తున్న ఓ నౌకలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈమేరకు సమాచారం అందుకున్న వెంటనే భారత నౌకాదళ సిబ్బంది రంగంలోకి దిగారు. బోట్లు, హెలికాప్టర్ సాయంతో హుటాహుటిన నౌక వద్దకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

ప్రమాదానికి గురైన నౌకలో భారత సంతతికి చెందిన 14 మంది సిబ్బంది ఉన్నట్లు నేవీ అధికారులు తెలిపారు. "ఎం.టి యీ చెంగ్ 6 అనే నౌక గుజరాత్‌లోని కాండ్లా నుంచి ఒమన్‌కు బయల్దేరింది. అందులో భారత సంతతికి చెందిన 14 మంది సిబ్బంది ఉన్నారు. మార్గమధ్యలో 'గల్ఫ్ ఆఫ్ ఒమన్' నౌకలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఇంజిన్ గదిలో మంటలు చెలరేగడంతో మొత్తం విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దీంతో సిబ్బంది అత్యవసర సాయం కోసం సందేశం పంపారు. సమీపంలో విధుల్లో ఉన్న 'ఐఎన్ఎస్ తబర్'.. వెంటనే అప్రమత్తమైంది. బోట్లు, హెలికాప్టర్ సాయంతో అగ్నిమాపక సిబ్బంది, పరికరాలను తరలించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంటలు చాలావరకు నియంత్రణలోకి వచ్చాయి" అని భారత నౌకాదళం ట్వీట్ చేసింది. ఇదిలాఉండగా.. ఇటీవల కేరళ తీరంలో ప్రమాదానికి గురైన ఓ కంటెయినర్ నౌకలోని సిబ్బందినీ నౌకాదళం కాపాడిన విషయం తెలిసిందే. అంతకుముందు అరేబియా సముద్రంలో మునిగిపోయిన ఓ నౌకలోని 12 మందిని కాపాడింది. పలు సందర్భాల్లో సోమాలియా సముద్రపు దొంగల చేతిలో హైజాక్‌కు గురైన వాణిజ్య నౌకల్లోని సిబ్బందిని సురక్షితంగా విడిపించింది.


## ఉపాధ్యాయుల బదిలీ.. కన్నీటి పర్యంతమైన విద్యార్థులు

**మాస్టారు మమ్మల్ని వదిలిపెట్టి వెళ్లొద్దంటూ ఓ పాఠశాలకు చెందిన విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. అనకాపల్లి జిల్లా బుచ్చయపేట మండలం పి.కందిపూడి ప్రభుత్వ పాఠశాలలో శ్రీరాములు, రమణలు మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులుగా రెండేళ్లుగా పనిచేస్తున్నారు. ఈ ఇద్దరు ఉపాధ్యాయులు ఏనాడు సెలవు పెట్టకుండా నిత్యం పాఠశాలకు వచ్చి చదువులో వెనుకబడిన విద్యార్థులకు మరో గంట అదనంగా బోధన చేసేవారు. గురు శిష్యులు తేడా లేకుండా స్నేహంగా మెలిగేవారు. ఈ ఇద్దరూ వచ్చాక పాఠశాలలో ప్రవేశాలు పెరిగాయి. అయితే వీరు బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్తున్నట్లు విద్యార్థులకు తెలియడంతో కంటతడి పెట్టి భోరున విలపించారు.**



# కవిత్వ రాగాలలో మానవతా సంగీతం...తిలక్ కవిత్వం

**అందమైన ఆడపిల్ల రూపం ... తిలక్ అక్షరాల సౌందర్యం - జూలై 1...దేవరకొండ బాలగంగాధర తిలక్ వర్ధంతి**




దేవరకొండ బాలగంగాధర తిలక్ (1921 ఆగస్టు 1 - 1966 జూలై 1) ఆధునిక తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన అనన్యమైన కవి, కథకుడు, నాటకకర్త. భావుకత, అభ్యుదయం అనే పరస్పర విరుద్ధ ధోరణులను మేళవించిన తిలక్ రచనలు తెలుగు సాహిత్యంలో కొత్త రేఖలు గీశాయి. భావ కవులలో అభ్యుదయ కవిగా, అభ్యుదయ కవులలో భావ కవిగా ఆయనకు ఉన్న ప్రత్యేకత ఆయన కవిత్వ విభిన్నతకు నిదర్శనం. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం లోని మండపాక గ్రామంలో 1921 ఆగస్టు 1న తిలక్ జన్మించారు. తండ్రి సత్య నారాయణ మూర్తి స్వాతంత్ర్య సమర యోధుడిగా, బాలగంగాధర తిలక్ పట్ల గల గౌరవం తోనే కుమారునికి అదే పేరు పెట్టారు. తిలక్ బాల్యంలోనే తణుకుకు మకాం మార్చారు. తెలుగు, ఆంగ్ల భాషలలో అతని ప్రావీణ్యం విశేషం. ప్రాచీన భారతీయ సాహిత్యమే కాక ఆధునిక పాశ్చాత్య సాహిత్యంపై కూడా ఆయనకు మంచి అవగాహన ఉండేది. చదువుకు విఘ్నంగా నిలిచిన అనారోగ్యం ఆయనను పనిలో పనిగా స్వయంగా అధ్యయనానికి కట్టబెట్టింది. తన స్వంత జీవితానుభవాలనూ, సమాజపు చీకటి కోణాలనూ కలబోసి రచనలుగా మలిచాడు. తిలక్ కవిత్వానికి ప్రధానంగా మానవతా విలువలు, సామాజిక చైతన్యం, సౌందర్యం, భావప్రాప్తి మూలాధారాలు. "నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు. నా అక్షరాలు ప్రజా శక్తుల వహించే విజయ ఐరావతాలు. నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" అని తాను వ్యాఖ్యానించు కున్నట్లే %–% తిలక్ కవిత్వం ఓ మానవీయ అనుభవ పథంగా ముందడుగు వేస్తుంది. తిలక్ కవిత్వంలో కరుణ అంతర్లీనంగా ప్రవహించే ప్రవాహంలా ఉంటుంది. ఆయన రచనల్లో అనాథలు, బిచ్చగాళ్లు, పడుపుగత్తెలు వంటి పీడిత వర్గాలు ప్రత్యక్ష పాత్రలుగా దర్శనమిస్తాయి. సౌందర్యం కూడా తిలక్ కవిత్వంలో ఒక అంతర్భాగం. ప్రకృతి, భావాలు, వ్యక్తిత్వం – అన్నింటి లోనూ ఆయన అందాన్ని అన్వేషించారు. వచన కవిత్వానికి ఒక నిర్మాణ సౌందర్యం, మృదుత్వాన్ని అందించిన ఘనత తిలక్‌దే. ఆయన భాష సుతిమెత్తగా ఉన్నా భావాలు పదునైనవిగా, నిదానంగా గుండెను తాకేలా ప్రవహిస్తాయి. భావుకత, అభ్యుదయం అనే రెండు విభిన్న మలుపులను సమన్వయపరిచిన తిలక్ కవిత్వం, భావకవిత్వం లోని సున్నితత్వంతో అభ్యుదయ భావ జాలాన్ని మేళవించి అందించాడు. తిలక్ పద్య కవితను వదిలి వచన కవితకు మారాడు. అయితే ఆ వచనానికి పద్య సౌందర్యాన్ని మలచిన రచయితగా నిలిచాడు. తిలక్ రచనలు అనేకం. ఆయన రచించిన కవితా సంపుటుల్లో ప్రభాతము –సంధ్య, గోరువంకలు, కఠినోపనిషత్తు, అమృతం కురిసిన రాత్రి ప్రసిద్ధమైనవి. ఇందులో చివరిదైన అమృతం కురిసిన రాత్రి కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (1971) లభించింది. ఈ సంపుటిలోని కవితలు ప్రేమ, మానవత్వం, కరుణతో నిండి ఉంటాయి. అమృతం కురిసిన రాత్రి కవితలో తిలక్ రాత్రిని ప్రేమానుభూతుల ఆధ్యాత్మిక అంతరంగంగా చిత్రించారు: "ఆ రాత్రి అమృతం కురిసింది %–% నా చిటికెన వేలి మీదనువ్వు గుబురు గుబురు మనిపించిన దాకా..." ఇక్కడ "అమృతం" అనే పదం ప్రేమను సూచించగా, చీకటి, వర్షం, ఊహా ప్రపంచం అతని అంతరాత్మను ప్రతిబింబించాయి. తిలక్ తన అనుభూతులను, స్పర్శలను, భావోద్వేగాల్ని అత్యంత సున్నితంగా వ్యక్తీకరించ గలిగాడు. కథా రచయితగా కూడా తిలక్ తనదైన ముద్ర వేశాడు. "ఊరి చివరి ఇల్లు" కథ సామాజిక స్పృహను కలిగించే ఓ మానవ సంబంధాల కథ. ఇందులో ఓ పేద కుటుంబం ఆశలు, పరాభవాలు, అసమానతలు ప్రతిబింబించ బడతాయి. సహజమైన సంభాషణలు, పాత్రల మనో వ్యవహార విశ్లేషణలు ఈ కథలో ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. నాటక రచయితగా తిలక్ రచించిన సుశీల పెళ్లి, సుప్త శిల, సాలె పురుగు వంటి నాటకాలలో నూతన భావ విచారణ కనిపిస్తుంది. "సుచిత్ర ప్రణయం" వంటి నాటిక ప్రేమ కథ నేపథ్యంలో వ్యక్తిత్వ విమర్శనాత్మకంగా నడుస్తుంది. ఆయన రచనలు మానవ స్వేచ్ఛకు విలువనిస్తూ సమాజాన్ని ప్రశ్నించేవిగా ఉంటాయి. తిలక్ వ్యక్తిగత లేఖలు – తిలక్ లేఖలు – ఆయన ఆత్మ విమర్శన, రచనా పద్ధతి, సమకాలీన సమాజంపై స్పందనలకు అద్దం పట్టే అద్భుతమైన సాహిత్యమైంది. ఈ లేఖల ద్వారా తిలక్ కేవలం రచయిత గానే కాకుండా, ఒక మేధావిగా, ఆత్మ సాధకునిగా కూడా కనిపిస్తాడు. 1966 జూలై 1న తిలక్ అకాల మరణం చెందాడు. ఆయన వయస్సు అప్పటికి కేవలం నలభై ఐదు సంవత్సరాలు మాత్రమే. కానీ ఆ కొద్ది కాలంలోనే తెలుగు సాహిత్యాన్ని తన రచనల ఝరితో సమృద్ధిగా ముంచెత్తాడు. తిలక్ మరణాన్ని గూర్చి మహాకవి శ్రీశ్రీ "గాలి మూగదయింది, పాట బూడిదయింది" అని విచారం వ్యక్తం చేయడం తిలక్ ప్రభావాన్ని వెల్లడిస్తుంది. దేవరకొండ బాలగంగాధర తిలక్ తెలుగు సాహిత్యంలో కరుణకు ప్రతిరూపం, సౌందర్యానికి మారుపేరు, మానవత్వానికి చిహ్నంగా నిలిచి పోయాడు. భావుకతను అభ్యుదయంతో మేళవించి, మానవతా విలువలకు ప్రాణం పోసిన తిలక్ రచనలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆయన కవిత్వం తెలుగు పదాల మధ్యే కాదు – తెలుగు హృదయాల మధ్యన కూడా శాశ్వతంగా నిలిచి ఉంటుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్ ... 9440595494**

# జూలై 1... బ్రిటిష్ సైన్యం ఢిల్లీ ఆక్రమణకు నడుం బిగించిన దినం



ఆధునిక భారత దేశ చరిత్రలో 1857 సంవత్సరానికి ప్రత్యేక స్థానం ఉంది. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వలస పాలనకు వ్యతిరేకంగా భారతీయులు గళమెత్తిన తొలి సమిష్టి ప్రయత్నం ఇదే. చరిత్ర కారులు దీనిని "సిపాయిల తిరుగుబాటు", "సిపాయిల పితూరి", "ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం", "విప్లవోద్యమం" వంటి పేర్లతో పేర్కొంటారు. ప్రముఖ రచయిత వీరసావర్కర్ తన రచన ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ (1909) లో దీన్ని తొలి స్వాతంత్ర్య యుద్ధంగా ప్రకటించారు. ఈ తిరుగుబాటు దాదాపు వంద సంవత్సరాల బ్రిటీషు పాలన అహంకారానికి ప్రతిఘటనగా మేల్కొంది. 1757లో ప్లాసీ యుద్ధం తర్వాత బ్రిటీషు ఈస్ట్ ఇండియా కంపెనీ తన ఆధిపత్యాన్ని గట్టిగా చొప్పించుకున్న కొద్దీ కాలానికి భారతీయులలో వ్యతిరేకత మొదలైంది. అయితే 1856 డిసెంబర్‌లో కంపెనీ ప్రవేశ పెట్టిన రాయల్ ఎన్ఫీల్డ్ P/53 రైఫిల్ వాడకానికి సంబంధించిన అంశమే తిరుగుబాటుకు ఆశా జనకంగా మారింది. ఈ తుపాకులకు ఉపయోగించే తూటాలను నోటితో కొరికి లోపల పెట్టాల్సి ఉండేది. అయితే అవి ఆవు, పంది కొవ్వుతో పూత పూసినవని ప్రచారం జరిగింది. దీనివల్ల హిందూ ముస్లిం సైనికుల మత భావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తూ బ్రిటిషు పాలకులు వారి మతాలను మార్చాలని కుట్ర పన్నుతున్నారన్న అభిప్రాయం బలపడింది. దీంతో నమ్మకాలు కల్లోలానికి గురై, విద్రోహం చెలరేగింది. 1857 మార్చిలో మంగళ్ పాండే అనే సైనికుడు బ్రిటిష్ అధికారి పై దాడి చేసి అరెస్ట్ చేయ బడ్డాడు. ఏప్రిల్ 8న అతనికి ఉరిశిక్ష విధించ బడింది. అతని ధైర్యం పలువురిలో చైతన్యం నింపింది. మే 10న మీరట్‌లో 11వ, 20వ అశ్వ దళాలు తిరుగు బాటుకు తెరలేపాయి. అధికారులు నిర్లక్ష్యం చేయగా... తిరుగుబాటు సుడిగాలిలా విస్తరించి పోయింది. మే 11న తిరుగుబాటు సిపాయిలు ఢిల్లీ చేరుకొని ఎర్రకోటను ఆక్రమించారు. చివరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్‌ను తిరుగు బాటుకు నాయకత్వం వహించాలని ఒత్తిడి చేశారు. ఆయన మొదట వెనుకాడినా, ఆపై అంగీకరించి తిరుగుబాటు దారుల చిహ్నంగా మళ్లీ ఢిల్లీ సింహాసనం మీద ఆసీనమయ్యారు. దీంతో తిరుగుబాటుకు మరింత బలం చేకూరింది. ఢిల్లీ కేంద్రంగా తిరుగుబాటు పెను తుఫానుగా మారింది. కాన్పూర్, ఝాన్సీ, లక్నో, అలహాబాద్ వంటి నగరాల్లో తిరుగుబాటు దారులు బ్రిటిష్ అధికారులను తుడిచి. పెట్టేశారు. ఝాన్సీ రాణి లక్ష్మీబాయి, నానా సాహెబ్, తాంతియా తోపే వంటి నాయకులు యుద్ధ రంగంలో వీరత్వాన్ని ప్రదర్శించారు. కానీ ఆరంభంలో గందరగోళంగా ఉన్నా... తరువాత బ్రిటిష్ ప్రభుత్వం పకడ్బందీగా ప్రతిస్పందించింది. వారు చైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న పటాలాలను, క్రిమియన్ యుద్ధం నుండి మళ్లించిన యూరోపియన్ బలగాలను భారత్‌కు తరలించి తిరుగుబాటును అణిచి వేయడానికి కృషి చేశారు. ఈ క్రమంలో ఢిల్లీ తిరిగి ఆక్రమించుకునే యత్నాన్ని జూలై 1, 1857న బ్రిటిష్ సైన్యం ప్రారంభించింది. ప్రధాన యుద్ధం ఢిల్లీకి సమీపంలోని బదక్–సరై వద్ద జరిగింది. ఆ యుద్ధంలో తిరుగుబాటు దారులు క్రమశిక్షణతో ధీటుగా పోరాడినా, బ్రిటిష్ సైనిక బలానికి ఎదుర్కోలేక ఢిల్లీకి వెనుదిరగాల్సి వచ్చింది. ఆపై వారపు దాడిలో ప్రతి వీధి, ప్రతి గల్లీ యుద్ధ రంగంగా మారింది. సెప్టెంబర్ 14న ఎర్రకోటపై దాడి చేసి బ్రిటిష్ బలగాలు నగరంలో ప్రవేశించగా, సెప్టెంబర్ 21 నాటికి చివరిగా బహదూర్ షా జఫర్ బ్రిటిష్‌లకు చెర పడ్డారు. నగరాన్ని పూర్తిగా కబళించడంలో బ్రిటిష్ వారు ఆగస్టు 31న విజయాన్ని సాధించారు. ఈ యుద్ధంలో వేల మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. నగరం శ్మశానంగా మారింది. తిరుగుబాటు నాయకుల కొంతమంది పరారైనప్పటికీ, చాలా మంది పట్టుబడి ఉరి తీయబడ్డారు. బహదూర్ షా జఫర్‌ను బర్మాకు పంపించి జీవితాంతం కారాగార జీవితం విధించారు. ఆయన కుమారులను ఎప్పుగేట్ వద్ద కాల్చి చంపారు. మొఘల్ చక్రవర్తిత్వానికి ఇదే తుది ఘట్టమైంది. ఈ తిరుగుబాటు పూర్తిగా 1858 జూన్ 20న బ్రిటిష్ విజయంతో ముగిసినప్పటికీ, భారతీయుల గుండెల్లో తొలిసారి 'స్వాతంత్ర్యం' అనే భావన ఊపిరి తీసుకుంది. ఇది దేశ వ్యాప్తంగా జాతీయ చైతన్యానికి బీజం పట్టింది. ఈ పోరాటం అనంతరం ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలనను రద్దు చేసి, బ్రిటిష్ క్రౌన్ నేరుగా పరిపాలన చేపట్టడం జరిగింది. అప్పటి నుండి భారత దేశపు పాలనా వ్యవస్థలో మార్పులకు తావు ఏర్పడింది. 1857 తిరుగుబాటు ఓ అంతరించిన విప్లవం కాదు... అది భారత స్వాతంత్ర్య పోరాటానికి జ్ఞాపక శిలగా నిలిచింది. జూలై 1... ఢిల్లీ మీద బ్రిటిష్ దాడికి నాంది పలికిన రోజు, మన స్వాతంత్ర్య స్మృతి పటములో ఒక రక్తరేఖగా పదిలంగా నిలిచి ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# అలనాటి మేటి గాయకులు ఏ. ఎం.రాజా - జూలై 1... ఏ.యం.రాజా జయంతి



ఏ.ఎం.రాజా పేరు ఈ తరానికి అంతగా తెలియక పోవచ్చు. ఒకనాడు దక్షిణ భారత సినీ నేపథ్య గాయకుడుగా, అల నాటి కథానాయకులకు అందరికీ తన మధురమైన గొంతును అందించారు. కేవలం పాటలతో సినిమాల విజయ వంతానికి చేయూత అందించారు. హిందీలో మొట్ట మొదట ప్లేబాక్ పాడిన దక్షిణ దేశ గాయకుడైన ఘనత ఏ.ఎం. రాజాదే. బహాత్ దిన్ హుయె (1952)లో పాడారు. తమిళ, తెలుగు సినిమా రంగాలలో విశిష్టమైన నేపథ్య గాయకులు, సంగీత దర్శకులు, నటుడు, ఏ.యం.రాజా 1950వ దశకంలో తమిళ, తెలుగు సినిమా రంగాలలో విశిష్టమైన నేపథ్య గాయకులు, సంగీత దర్శకులు, నటులు. రాజా కంఠస్వరం ప్రత్యేక మైనది. ఎవ్వరి పనితీరైనా గుర్తించడం కష్టం కాదు. కాని అనుకరించడం మాత్రం సులభం కాదు. రాజా గళంలో ఒక వినూత్నమయిన సౌకుమార్యం, మార్దవం, మాధుర్యం ఉండేది. ఆ ప్రత్యేకత వల్లనే సినిమా రంగంలో రాజా మెట్టుమెట్టుగా పైకెదిగారు. ఆయన సంగీత దర్శకత్వంలో ప్రాధాన్యత మెలడీకే ఇచ్చే వారు. రాసిలో తక్కువైనా వాసిలో ఏమాత్రమూ తక్కువ కానివి రాజా పాటలు. ఏ. ఎం. రాజాగా సుప్రసిద్ధుడైన ఏమల మన్మథరాజు రాజా 1929 సంవత్సరం జూలై 1వ తేదీన చిత్తూరు జిల్లాలోని రామచంద్ర పురంలో మన్మథరాజు – లక్ష్మమ్మ దంపతులకు పుట్టారు. పచ్చయప్ప కళాశాల నుండి 1951లో బి. ఏ. పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. కళాశాలలో చదివేటప్పుడే ఎన్నో పాటల పోటీలలో పాల్గొని బహుమతులను పొందారు. మాస్టర్ నటరాజన్ వద్ద సంగీతాభ్యాసం పొందారు. రాజా స్వయంగా రాసి స్వరపరచిన రెండు పాటలను హెచ్.ఎం.వీ రికార్డు చేశారు. ఈ పాటలు ఆకాశవాణి 1951లో తరచూ ప్రసారం చేసేది. ఆయన పాడిన మొదటి రికార్డు 'ఎంత దూరం మీ పయనం'. ఈ పాటలను విన్న జెమినీ స్టూడియో అధినేత వాసన్ తాను తమిళంలో నిర్మిస్తున్న సంసారం చిత్రంలో రాజాను పాడమన్నారు. తమిళంలో సుసర్ల దక్షిణామూర్తి దర్శకత్వంలో సంసారం, సంసారం అనే పాట (తెలుగు లో దీనిని ఘంటసాల పాడారు) రాజా పాడిన మొట్టమొదటి సినిమా పాట. తెలుగు లో ఆయన పాడిన మొదటి పాటలు 'ఆకలి' 'ఆదర్శం', 'సంక్రాంతి' (1952) చిత్రాల లోనివి. కానీ గాయకుడిగా గుర్తింపు పొందింది మాత్రం పక్కింటి అమ్మాయి (1953) సినిమాలో పాడిన పాటలతో. రాజా సరదాగా నటించి, పాడిన హాస్యరస చిత్రం పక్కింటి అమ్మాయి. చిత్రంలోని గీతాలు హాయి గొలిపే లలిత గాన మాధుర్యానికి సంకేతాలుగా నిలిచాయి. అమర సందేశం గీతాలు కూడా రాజా శక్తిని నిరూపించాయి. శోభ, పెళ్లి కానుక చిత్రాలు, మరికొన్ని తమిళ చిత్రాలకు ఏ.యం.రాజా సంగీత దర్శకత్వం వహించారు. అన్ని భావాలూ పలికిస్తూ పాడుతున్నారు, తెలుగు తమిళ సినిమాలలోనే రాజా ఎక్కువగా పాడేవారు. ఆ సమయంలోనే ఎం. జి. రామ చంద్రన్ నటించిన 'జెనోవా' చిత్ర నిర్మాణ సమయంలోనే పి. జి. కృష్ణవేణిని (జిక్కీగా మనకు చిరపరిచితం ఆమె గాత్రం) చూడడం తటస్థించింది. ఇద్దరూ కలిసి సినిమాలలో యుగళ గీతాలు పాడేవారు. అలా ఆ పరిచయం ప్రేమగా మారింది. ఆ ప్రేమ అలా పెరిగి పాటలలోనే కాకుండా జీవితం లో కూడా భాగస్వాములయ్యారు. రాజా సంగీత జీవితపు ఆరంభ దశలో అతనికి ఎక్కువ ఖ్యాతిని తెచ్చినవి మూడు చిత్రాలు %–% ప్రేమలేఖలు (1953), అమర సందేశం, విప్ర నారాయణ (1954). విప్ర నారాయణ లోని 'చూడుమదే చెలియా' లాంటి, పాటలు ఇప్పటికీ ఏమాత్రం వన్నె తగ్గనివే. సుశీలతో పాడిన మిస్సమ్మ (1955) చిత్రంలోని 'బృందావనమది అందరిది గోవిందుడు అందరి వాడేలే' ఒక మరపు రాని పాట. సంగీత ప్రధానమైన 'అమర సందేశం'లో ముఖ్యంగా చెప్పుకోవలసినవి ఆయన పాడిన రెండు సోలోలు: మధురం మధురం మనోహరం, ఆనతి కావలెనా గానానికి సమయము రావలెనా ఏనాటికీ మరిచి పోలేనివే..బంగారు పాప (1954), భాగ్యరేఖ(1957) చిత్రాలలో రాజా పాడిన పాటలు కూడా తీపి గుర్తులే. నేనూ ఒక మనిషినా (మేలు కొలుపు, 1956), అందాల రాణి వీరకంకణం, 1957), తానే మీ కెంతో (దాంపత్యం, 1957), ప్రభూ తొలికసంజె (సిపాయి కూతురు, 1959). ఇలా 1953–57 మధ్య కాలంలో రాజా నక్షత్రంలా ఒక వెలుగు వెలిగారు. ముఖ్యంగా ఒక రెండు సంవత్సరాల పాటు (1953 – 55) ఘంటసాల కంటే రాజా గాత్రానికే నిర్మాతలు, సంగీత దర్శకులు ప్రాధాన్యత నిచ్చారు. మద్రాస్ ఫిల్మ్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాజాను 1959లో అత్యుత్తమ సంగీత దర్శకునిగా గౌరవించింది. రాజా గాయకుడు దర్శకుడు మాత్రమే కాదు, ఒక నటుడు కూడా. పక్కింటి అమ్మాయి (1953) చిత్రంలో రాజా నటనను అందరూ మెచ్చు కొన్నారు. ఇందులో ఒక విచిత్రమేమంటే, ఇదే పాత్రను హిందీ చిత్రంలో (పడోసన్, 1968) గాయక దర్శకుడు కిశోర్ కుమార్ వేయగా, మళ్లీ తీసిన (1976) తెలుగు చిత్రంలో ఈనాటి గాయక దర్శకుడు బాలసుబ్రహ్మణ్యం పోషించారు. ఆయన కన్యాకుమారి జిల్లా లోని ఒక గుడిలో సంగీతకచ్చేరి చేసి తిరిగి వస్తుండగా తిరున ల్వేలి జిల్లాలోని వల్లియూరులో జరిగిన రైలు ప్రమాదంలో 1989, ఏప్రిల్ 9న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# విత్తన జీవితం ... దేశానికి రైతు సేవ అంకితం - జూలై 1...ప్రపంచ వ్యవసాయ దినోత్సవం




ప్రతి సంవత్సరం జూలై 1న నిర్వహించే ప్రపంచ వ్యవసాయ దినోత్సవం, మానవ జాతి జీవనాధారమైన వ్యవసాయ రంగ ప్రాముఖ్యతను గుర్తుచేసే సందర్భం. ఈ రోజు అన్నదాతల కృషిని గౌరవించడం, వ్యవసాయ రంగానికి అంకితభావంతో పని చేసే ప్రతి ఒక్కరికి అభినందన తెలిపే ఉదాత్త సందేశాన్ని ప్రసారం చేస్తుంది. ఇది కేవలం ఒక దినోత్సవం మాత్రమే కాదు... భవిష్యత్తు ఆహార భద్రతకు, పర్యావరణ పరిరక్షణకు, గ్రామీణాభివృద్ధికి, సమాజ సమతుల్యతకు మూలమైన వ్యవసాయాన్ని మనస్ఫూర్తిగా ఆలోచించే రోజు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూలై 1న ప్రపంచ వ్యవసాయ దినోత్సవాన్ని నిర్వహించడం ఒక భావోద్వేగ పూరిత సందేశాన్ని అందిస్తుంది. వ్యవసాయ రంగం కేవలం ఆహారం పండించే వృత్తిగా మాత్రమే కాకుండా మానవ జీవన రేఖగా, పర్యావరణ పరిరక్షకంగా, సమాజాభివృద్ధికి ప్రేరణగా నిలుస్తోంది. ఈ దినోత్సవం సందర్భంగా అన్నదాతల కృషికి అభినందన తెలుపుతూ, భవిష్యత్ సవాళ్లను పరిష్కరించే దిశగా సామూహిక చింతన అవసరమవుతుంది. వ్యవసాయం కేవలం పంటలు పండించడం అనే అర్థానికి మాత్రమే పరిమితమయ్యే రంగం కాదు. ఇది ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, కోట్లాది మందికి ఉపాధి మార్గం, సమాజ సంస్కృతికి ప్రాణనాడి, పర్యావరణ సమతుల్యతకు నిర్ధారక శక్తి. గ్రామీణ జీవితానికి పునాది వేసే వ్యవసాయం మన సంస్కృతి, ఆచారాలతో సైతం జతపడి ఉంది. పండుగలు, పంటల కట్టుబాట్లు, వర్షాకాలపు వేడుకలు అన్నీ వ్యవసాయ దశల ఆధారంగా రూపుదిద్దుకున్నవే. వ్యవసాయ రంగం ప్రపంచ జనాభాలో దాదాపు 26 శాతం మంది ఉద్యోగ అవకాశాలపై ప్రభావం చూపుతోంది. ప్రపంచ వ్యాప్తంగా రెండు బిలియన్ మందికి పైగా ప్రజలు నేరుగా వ్యవసాయ సంబంధిత రంగాల్లో పని చేస్తున్నారు. భారతదేశం లోనే సుమారు 54 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. 2023–24 గణాంకాల ప్రకారం భారత దేశంలో వ్యవసాయ రంగం జాతీయ స్థూల ఉత్పత్తిలో (%+ఙూ%) సుమారు 18.3 శాతం వాటా కలిగి ఉంది. ఈ రంగం ద్వారా ముడి సరుకులు, ఆహారం, జాతికి జీవనాధారం లభించడమే కాకుండా, పలు పరిశ్రమలకు మౌలిక మద్దతు లభిస్తోంది. ఉదాహరణకు, పత్తి, చెరకు, నూనె గింజలు, ధాన్యాలు వంటి పంటల ద్వారా వస్త్ర, చక్కెర, నూనె పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో వాతావరణ మార్పులు కీలకంగా ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పంటల దిగుబడిపై దుష్ప్రభావం పడుతోంది. ఐపీసీసీ నివేదికల ప్రకారం 2050 నాటికి వర్షాధారిత సాగు ప్రాంతాలలో 10–25 శాతం దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. భారత దేశంలో తూర్పు రాష్ట్రాల నుంచి పశ్చిమ ప్రాంతాల దాకా వాతావరణ అస్థిరతలు రైతులకు నష్టాలను కలిగిస్తున్నాయి. నీటి కొరత, భూసార హీనత, వ్యవసాయ రుణ భారం, మార్కెటింగ్ లో అసమతుల్యత, మధ్యవర్తుల వలయంలో రైతు ఆదాయం తగ్గిపోవడం వంటి అంశాలు రైతుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇంకా, భారత దేశంలో రైతు ఆదాయం నామమాత్రంగా పెరుగుతోంది. 2017 నుండి 2023 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా రైతుల సగటు నెలవారీ ఆదాయం రూ. 8,000%–%10,000 మధ్యగానే ఉందని 'ఎన్‌ఎస్‌ఎస్‌ఓ' నివేదికలు సూచిస్తున్నాయి. ఈ ఆదాయంతో కుటుంబ ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు మిళితం చేస్తే వ్యవసాయాన్ని కొనసాగించటం చాలా కష్టమైనదిగా మారింది. ఫలితంగా యువత వ్యవసాయాన్ని వదిలి ఇతర రంగాల్లో ఉద్యోగాల కోసం వలస బాట పడుతున్నారు. ప్రపంచ జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తు ఆహార అవసరాలను తీర్చాలంటే వ్యవసాయ రంగం సామర్థ్యాన్ని గణనీయంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ రంగానికి ఆధునికతను చేర్చడం అత్యవసరమవుతోంది. స్మార్ట్ ఫార్మింగ్, డ్రోన్ సాంకేతికత, భూసార పరీక్షా పద్ధతులు, మైక్రో ఇరిగేషన్ పద్ధతులు, డిజిటల్ మార్కెట్ ప్లాట్‌ఫామ్‌లు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు వంటి ఆధునిక విధానాల ద్వారా వ్యవసాయాన్ని సమర్థవంతంగా తీర్చిదిద్దవచ్చు. దీనివల్ల నూతన తరం యువత వ్యవసాయాన్ని ఆదాయ సాధక రంగంగా భావించే అవకాశముంది. అంతేకాదు, సుస్థిర వ్యవసాయ విధానాలను అవలంబించడం ద్వారా పర్యావరణానికి హాని లేకుండా సాగు కొనసాగించవచ్చు. జీవ వ్యవసాయం, సహజ వ్యవసాయం, మల్చింగ్, ఇంటిగ్రేటెడ్ క్రాప్ మేనేజ్‌మెంట్ వంటి పద్ధతులు భవిష్యత్‌లో వ్యవసాయ భద్రతను నిర్ధారించ గలవు. ప్రపంచ వ్యవసాయ దినోత్సవం వ్యవసాయ రంగానికి నూతన దిశలను సూచించే, రైతులకు మానసిక, సాంకేతిక, ఆర్థిక మద్దతును చాటే ఒక చైతన్య దినంగా నిలవాలి. ఈ రోజు రైతు సమస్యలపై చర్చించడమే కాకుండా, సమగ్ర వ్యవసాయ విధానాలు, గవర్నెన్స్‌లో వ్యవసాయానికి ప్రాధాన్యత, విద్యా రంగంలో వ్యవసాయాన్ని ప్రధానాంశంగా చేర్చడం వంటి అంశాలపై దృష్టి సారించాలి. రైతు చెమటే మన దేశ అభివృద్ధికి మూలాధారం. ఆ చెమట విలువను గుర్తించడం, వ్యవసాయ రంగాన్ని ఆదునికతతో మేళవించడం మనందరి బాధ్యత. వ్యవసాయం మన వంటలపై మాత్రమే కాదు – మన దేశపు భద్రత, మనుగడ, సమాజ సంస్కృతి, పర్యావరణపై ప్రభావం చూపే రంగం. అలాంటి రంగానికి అంకితమైన ఈ దినోత్సవాన్ని కేవలం జ్ఞాపకార్థ దినంగా కాక, రైతు జీవితాన్ని వెలిగించే ఉద్యమ దినంగా మలచుకుందాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ప్రతిభ గల దర్శకులు ప్రకాశరావు - జూలై 1...తాతినేని ప్రకాశరావు వర్ధంతి



కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే అని నిరూపించారు ప్రఖ్యాత సినీ దర్శకులు తాతినేని ప్రకాశరావు. టూరింగ్ టాకీస్‌లో అసిస్టెంట్ ఆపరేటర్ వుద్యోగంతో ప్రారంభించి, అందిన అవకాశాలను అంది పుచ్చుకుని, సహాయ దర్శకునిగా తన లక్ష్యానికి బాటలు వేసుకుని, గొప్ప దర్శకునిగా నిలిచి పోయారు. వివిధ భాషల్లో ఆయన దర్శకత్వం వహించిన చిత్రాలలో అధికంగా శత దినోత్సవాలు జరుపు కోవడం విశేషం. టి.ప్రకాశరావు లేదా తాతినేని ప్రకాశరావు (నవంబరు 24, 1924 – జూలై 1, 1992) సుప్రసిద్ధ తెలుగు, తమిళ, హిందీ సినిమా దర్శకులుగా ఖ్యాతి గడించారు. కృష్ణా జిల్లా కపిలేశ్వర పురంలో జన్మించారు. సినిమా రంగంలో యల్.వి.ప్రసాద్ షావుకారు సినిమాకు, కె.వి.రెడ్డి గారి వద్ద పాతాళ భైరవి సినిమాకు అసిస్టెంటుగా పని చేశారు. తర్వాత పరివర్తన, పల్లెటూరు, జయం మనదేరా మొదలైన ఎన్నో తెలుగు చిత్రాలకు దర్శకత్వం వహించారు. శివాజీ గణేశన్, జెమినీ గణేశన్, యం.జి.ఆర్. మొదలైన అగ్రనటులతో ఎన్నో తమిళ చిత్రాలకు దర్శకత్వం వహించారు. హిందీలో దాదాపు పెద్ద నటులందరి తోనూ 25 పైగా చిత్రాలకు దర్శకత్వం వహించారు. సుమారు 60 పైగా దర్శకత్వం వహించిన వాటిలో కొన్ని చిత్రాలు శతదినోత్సవాలు జరుపు కున్నాయి. ఆయన తాష్కెంట్ చలన చిత్రోత్సవం లోను, ఉజ్ బెకిస్థాన్ లోను రెండు సార్లు డెలిగేషన్ లో పాల్గొన్నారు. కొత్త తరం దర్శకులుగా, తెలుగు చిత్రసీమకు చక్కని చిత్రాలు అందించగల ప్రతిభ గల దర్శకులుగా 50వ దశకంలో తాతినేని ప్రకాశరావు, సి.ఎస్.రావు, డి. యోగానంద్, కె.బి. తిలక్, ఆదుర్తి సుబ్బారావు లను పరిగణించేవారు. వారంతా యువరక్త ప్రభావ ఫలితంగా కుటుంబ కథా చిత్రాలు, ప్రయోగాత్మక, ప్రయోజనాత్మక చిత్రాలను రూపొందించినవారే. అంతేకాదు వారి చిత్రాల్లో మనోల్లాస పాటలకూ ప్రాధాన్యత ఉండేది. తాతినేని ప్రకాశరావు పుట్టింది 1924లో నవంబరు 24. కృష్ణాజిల్లాలోని కపిలేశ్వరపురంలో. తండ్రి వీరరాఘవయ్య కాంగ్రెస్‌వాది. అయినా విప్లవ భావాలుండేవి. ప్రకాశరావుని దత్తత తీసుకున్న చిన్న తాత సుబ్బయ్య ఆయనలోని విప్లవ ఆలోచనల కారణం గానే ప్రకాశరావును తండ్రి వద్దకు పంపేసారు. తండ్రి నుంచి రాజకీయం, విప్లవ భావాలు వారసత్వంగా సంక్రమించడంతో పాటు, అదనంగా సినిమా ఆసక్తి ఏర్పడింది. టూరింగ్ టాకీస్‌లో ఉచితంగా సినిమాలు చూసే అవకాశం కలిగించుకున్నారు. చిన్న తనంలోనే విద్యార్థిగా వుంటూనే రాజకీయాలు వేపు ఆసక్తి చూపారు. ఆయన ఉచితంగా సినిమా చూసే టూరింగ్ టాకీస్‌లో అసిస్టెంట్ ఆపరేటర్ వుద్యోగం సంపాదించు కున్నారు. అదీ వదిలేయాల్సి వచ్చింది కొంత కాలానికి. ప్రజానాట్య మండలి వేపు, కమ్యూనిస్ట్ సిద్ధాంతాలు వేపు ఆకర్షితులయ్యారు తాతినేని ప్రకాశరావు. ప్రజానాట్యమండలి ప్రదర్శించే కళా కార్యక్రమాలను నిర్వహించే పనిలో పడ్డారు. మీటింగు కని ప్రకాశరావు 1946లో మద్రాసు వెళ్లగా, అక్కడ దర్శకుడు ఎల్.వి.ప్రసాద్‌తో పరిచయం ఏర్పడగా అది పెంపొందించు కున్నారు. మళ్ళీ కృష్ణాజిల్లాక తిరిగి వచ్చేసినా, ఏడాది పూర్తి కాకుండానే తను నిర్వహించే రాజకీయ సాంస్కృతిక వ్యవహారాలకు స్వస్తి చెప్పి, మద్రాసు చేరుకుని ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో కె.ఎస్.ప్రకాశరావు హీరోగా రూపొందిన ద్రోహి చిత్రానికి అసిస్టెంట్ డైరక్టర్ అయ్యారు. ఎల్.వి.ప్రసాద్ వద్దనే మనదేశం, సంసారం, షావుకారు, పెళ్ళి చేసి చూడు చిత్రాలకు. కె.వి.రెడ్డి వద్ద పాతాళ భైరవి చిత్రానికి సహాయ దర్శకుడుగా పనిచేసారు. పీపుల్స్ ఆర్ట్స్ సంస్థ నిర్మించిన పల్లెటూరు చిత్రంలో దర్శకుడయ్యారు ప్రకాశరావు. సంక్రాంతి పండుగ సందర్భంగా సంబరాలు, గ్రామాల్లో ఉండే చెడుగుడు ఆట వంటివి అత్యంత సహజంగా చిత్రీకరించడమే కాకుండా సంక్రాంతి పండుగ గురించి ఒక పాట, దేశభక్తిని ప్రబోధించే పాట ఒకటి, తెలుగు తేజం వివరించే చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా.. పాటని చిత్రీకరించారు. ఎన్టీఆర్, ఎస్వీఆర్, సావిత్రి, నాగభూషణం ఈ చిత్రాలకి ముఖ్య పాత్రధారులు. పల్లెటూరు అందాలు, ఆనందాలు వర్ణించిన ఈ చిత్రం 1952లో విడుదలై విజయం సాధించింది. 1953లో ఎన్టీఆర్ నటించిన పిచ్చి పుల్లయ్యని డైరక్ట్ చేసారు. తరువాత అన్నాచెల్లెలు నాటకం ఆధారంగా అక్కినేని, ఎన్టీఆర్, సావిత్రి ప్రధాన పాత్రలు పోషించగా పరివర్తన చిత్రం రూపొందించారు. ఈ చిత్రం తమిళంలో డబ్ అయి ఘన విజయం సాధించింది. 1954లో విడుదలైన ఆ చిత్రంలో నీతి నియమాలు, మానవతా విలువులు ఆదర్శాలు చక్కగా చిత్రీకరించారు. అక్కినేనితో నిరుపేదలు చిత్రాన్ని తీసి 1954లోనే విడుదల చేసారు. 1959లో విడుదలైన ఇల్లరికం సాధించిన విజయం అందరికీ తెలిసిందే. 1958లో 'అమర్‌దీప్' అనే హిందీ చిత్రానికి దర్శకత్వం వహించడం ద్వారా బాలీవుడ్ లోనూ ప్రవేశించారు. జయం మనదే, మా బాబు, మైనర్ బాబు, సంసారం, చిరంజీవి రాంబాబు, గాలి పటాలు, గంగా భవాని, పొగరు బోతు, ఆశా జ్యోతి, భారతంలో అర్జునుడు తదితర చిత్రాలకు తెలుగులో దర్శకత్వం వహించారు. తాతినేని ప్రకాశరావు కజిన్ అయిన తాతినేని రామారావు, ప్రకాశరావు వద్ద అసిస్టెంట్ డైరక్టర్‌గా పనిచేసి ఆయన కూడా ఆయన బాటలో ప్రయాణం చేసి, తెలుగు చిత్రాలు, హిందీ చిత్రాలు డైరక్ట్ చేసారు. హిందీలో స్టార్ డైరక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు. కె.ప్రత్యగాత్మ కూడా తాతినేని ప్రకాశరావు శిష్యుడే. ప్రత్యగాత్మ హిందీ చిత్ర రంగాన్ని ఏలారు కె.పి.ఆత్మగా.వి.మధుసూదన రావు, గుత్తా రామినీడు, కె. హేమాంబరధర రావు, తాతినేని ప్రకాశరావు వద్దనే దర్శకత్వ శాఖలో శిక్షణ పొంది హిట్ చిత్రాల దర్శకులుగా రాణించారు. తెలుగు హిందీ భాషలలో కొన్ని చిత్రాలను డైరక్ట్ చేసిన టి.ఎల్.వి.ప్రసాద్, తాతినేని ప్రకాశరావు కుమారుడు. ఆయన తాతినేని ప్రసాద్ కూడా కొన్ని చిత్రాలను డైరక్ట్ చేసారు. వినోదంతో పాటు విజ్ఞానం కూడా అందించాలని సమాజంలోని సమస్యలను కూడా చర్చించాలని, కుటుంబ పరమైన సమస్యలు, సరదాలు చక్కగా చూపించాలని ప్రయత్నించి, సఫలం చెందేవారు. దర్శకుడుగా, అందుకే తాతినేని ప్రకాశరావు చిత్రాలలో కథబీ కథనం నాటకీయంతో ఆకట్టుకునేలా ఉండేది. తాతినేని ప్రకాశరావు 1992, జూలై 1న మృతి చెందారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# చురకలు

## సంపాదకీయం

### వైసీపీ.... కాంగ్రెస్‌లో విలీనం అవుతోందా?!

కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిల.. గత ఎన్నికలకు ముందు నుంచి ఇప్పటి వరకు కూడా తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్‌పై విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. వివేకా హత్య కేసు నుంచి తన ఆస్తుల వ్యవహారాల వరకు షర్మిల అనేక విషయాలను ప్రస్తావిస్తూనే ఉన్నారు. అయితే.. తాజాగా షర్మిల యూటర్న్ తీసుకుని.. మరో కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. వరుస నాలుగు రోజులుగా షర్మిల చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. నేరుగానే వైసీపీని టార్గెట్ చేస్తున్న షర్మిల.. కాంగ్రెస్‌ను మహా సముద్రంతో పోల్చుతున్నారు. మహా సముద్రం వంటి కాంగ్రెస్‌లో పిల్లకాలువలు కలిసిపోతాయని షర్మిల చెబుతున్నారు. ఈ క్రమంలోనే వైసీపీ పేరును కూడా ఆమె చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ మహాసముద్రం. దేశంలో ఉన్న అన్ని పిల్లకాలువలు.. సముద్రంలో కలిసిపోవాల్సిందే. వైసీపీ కూడా ఏదో ఒక రోజు ఇదే పనిచేస్తుంది. అని షర్మిల వ్యాఖ్యానిస్తున్నారు. గత నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న షర్మిల జిల్లాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నానని చెబుతున్నారు. ఈ క్రమంలోనే వైసీపీని పిల్లకాలువతో పోల్చిన ఆమె.. సముద్రంలో కలిసిపోతుందన్నారు. వాస్తవానికి గత ఏడాది ఎన్నికల తర్వాత.. కూడా ఈ తరహా చర్చ అయితే వచ్చింది. పార్టీ ఘోరంగా ఓడిపోయిన దరిమిలా.. జగన్ పరిస్థితి ఇబ్బందిగా మారిందన్న చర్చ తెరమీదికి వచ్చింది. బీజేపీతో గత ఐదేళ్లు కలిసి ఉన్న జగన్ ఎన్నికలకు ముందు ఆ పార్టీకి దూరంగా ఉన్నారు. దీంతో కూటమితో కలిసి బీజేపీ అధికారం పంచుకుంది. ఈ పరిణామాలతో జగన్‌పై ఉన్న సీబీఐ, ఈడీ కేసులు తిరగదోడడం ఖాయమని చర్చ వచ్చింది. ఇదే జరిగితే.. రాజకీయంగా తనకు రక్షణ అవసరమని జగన్ భావించారు. దీంతో ఆయన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమిలో చేరుతారన్న చర్చ జరిగింది. తద్వారా తనను తాను కేసుల నుంచి రక్షించుకుంటారని కూడా విశ్లేషకులు కొందరు చెప్పుకొచ్చారు. అయితే.. ఇప్పటి వరకు అలాంటి పరిణామాలేవీ జరగలేదు. పైగా.. వైసీపీ వాదన కూడా మరోలా వుంది. బీజేపీకి-కాంగ్రెస్‌కు మధ్య తీవ్ర ఘర్షణ ఉందని.. అలాంటి సమయంలో జగన్ పోయి పోయి కాంగ్రెస్ కూటమిలో చేరితే.. లేనిపోని ఇబ్బందులు వస్తాయన్నది వైసీపీ వాదన. ఈ క్రమంలో తటస్థంగా ఉంటేనే మంచిదని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు ఆతరహా సంకేతాలు అయితే.. వైసీపీ నుంచి రాలేదు. కానీ, తాజాగా మరోసారి షర్మిల చేస్తున్న వ్యాఖ్యలతో ఏం జరుగుతుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# రాజకీయాలలో చెరగని ముద్ర వేసిన పిడతల - జూలై 1...పిడతల రంగారెడ్డి వర్ధంతి



ఆయన ఒక అరుదైన నాయకుడు. ఏకగ్రీవంగా శాసన మండలికి ఎన్నికైన వ్యక్తి. శాసన సభ, శాసన మండలి రెండింటికీ అధ్యక్షునిగా ఎన్నికైన అరుదైన, అపూర్వ రికార్డును సొంతం చేసుకుని సమర్థ వంతంగా ఉభయ సభలను నడిపి, సామర్థ్యాన్ని చాటి చెప్పిన ఘనుడు. పలు మార్లు జైలు శిక్ష అనుభవించిన ఉద్యమ కారుడు. ప్రావెన్షియల్ పార్లమెంటేరియన్. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ తొలి అధ్యక్షుడు. బహుభాషా కోవిదుడు. పాత్రికేయుడు. ఆయనే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో తనదైన ముద్ర వేసిన పిడతల రంగారెడ్డి. పిడతల రంగారెడ్డి (నవంబర్ 10, 1917 - జూలై 1, 1991), ఆంధ్రప్రదేశ్ కు చెందిన రాజకీయ నాయకుడు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకరు, శాసనమండలి అధ్యక్షుడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండు సభలకు (శాసనసభ, శాసనమండలి) అధ్యక్షుడిగా పనిచేసిన ఏకైక వ్యక్తి. గిద్దలూరు శాసనసభ నియోజక వర్గం నుండి నాలుగుసార్లు శాసన సభకు ఎన్నికయ్యారు. గిద్దలూరు శాసనసభ నియోజవర్గం ఏర్పడక ముందు 1952లో తొలిసారిగా కంభం శాసనసభ నియోజవర్గం నుండి గెలిచి శాసనసభ సభ్యుడయ్యారు. పిడతల రంగారెడ్డి... ప్రకాశం జిల్లా, రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన పిడతల వెంగళరెడ్డి, పిచ్చమ్మలకు 1917, నవంబర్ 10న రంగారెడ్డి జన్మించారు. 1937లో కొత్తపట్నంలో కాంగ్రేసు పార్టీ సోషలిష్టు విభాగం నేతృత్వంలో జరిగిన రాజకీయ పాఠశాలలో శిక్షణ పొందారు. 1939లో గిద్దలూరులో వ్యక్తిగత సత్యాగ్రహంలో పాల్గొని ఐదు వందల రూపాయల జరిమానా చెల్లించడంతో పాటు ఆరు నెలల జైలు శిక్ష అనుభవించారు. 1940 కర్నూలు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, సత్యాగ్రహంలో పాల్గొని జరిమానా చెల్లించటంతో పాటు జైలు శిక్షను కూడా అనుభవించారు. 1941లో కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, 500 రూపాయలు జరిమానా తో బాటు 3సంవత్సరముల జైలు శిక్ష అనుభవించారు. 1950వ సంవత్సరములో మద్రాసు శాసనసభ నుండి ప్రావెన్షియల్ పార్లమెంట్‌కు ఎన్నికైనారు. విశాలాంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత పిడతల రంగారెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తొలి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1952-1959 వరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా వ్యవహరించారు. పిడతల 1952వ సంవత్సరములో ఉమ్మడి మద్రాసు శాసనసభకు నేటి ప్రకాశం జిల్లా కంభం నియోజకవర్గం నుండి ఎన్నికైనారు. 1955వ సంవత్సరములో గిద్దలూరు నియోజకవర్గం మండి ఆంధ్ర శాసనసభకు శాసనసభ్యుడిగా ఎన్నికైనారు. ఆయన దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలో 1960వ సంవత్సరం జనవరి 11వ తేదీ నుండి 1962వ సంవత్సరం మార్చి 11వ తేదీ వరకు ప్రణాళిక అభివృద్ధి, పంచాయతీరాజ్, సమాచార, ప్రచారం, పర్యాటక శాఖ మంత్రిగా పనిచేసారు. ప్రణాళిక శాఖా మంత్రిగా ఆయన చేపట్టిన కార్యక్రమాలు, ఆ శాఖను ఆయన నడిపించిన తీరు తెన్నులు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొంది ఆంధ్రప్రదేశ్ గౌరవ ప్రతిష్టలను ఇనుమడింప చేసాయి..ఒకప్పటి పాత్రికేయుడిగా, ప్రతిరోజూ ఒక ప్రెస్‌నోట్‌తో పాత్రికేయులకు బాగా పని కల్పించేవారు. భాషావేత్త అయిన రంగారెడ్డి ఇంగ్లీషు, తమిళం, తెలుగు, హిందీ, ఉర్దూలలో అనర్గళంగా మాట్లాడేవారు. 1968వ సంవత్సరములో స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి విధాన పరిషత్తుకు పోటీ లేకుండా ఎన్నికైన రంగారెడ్డి 15.07.1968 నుండి 13.03.1972 వరకు విధాన పరిషత్తు చైర్మన్ గా పనిచేశారు. ఆయన విధాన పరిషత్తు చైర్మన్ గా సభా కార్యక్రమాలను నడిపించిన తీరు, ఆవలంభించిన విధానాలు, అన్ని పక్షాల సభ్యుల మన్ననలు, ప్రశంసలను పొందాయి. 1970వ దశకపు చివర్లో ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ మూడు వర్గాలుగా చీలిపోయినప్పుడు, ఇందిరా గాంధీకి ససేమిరా మద్దతును ఇవ్వకూడదని నిశ్చయించుకొని, పిడతల రంగారెడ్డి తన వర్గంతో అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న జనతా పార్టీలో చేరారు. 1972వ సంవత్సరములో గిద్దలూరు నియోజకవర్గం నుండి ఐదవ శాసనసభకు ఎన్నికైన ఆయన, 1972-1974 సంవత్సరాల మధ్య కాలంలో స్పీకరుగా పనిచేసి ఆ పదవికి కీర్తి ప్రతిష్టలు తీసుకు వచ్చారు. జలగం వెంగళరావు మంత్రి వర్గంలో రంగారెడ్డి ఆర్థిక, వాణిజ్య పన్నులు గృహనిర్మాణం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగా పనిచేసారు. ఆయన 1978వ సంవత్సరము ఆరవ శాసనసభకు, 1985వ సంవత్సరము ఎనిమిదవ శాసనసభకు గిద్దలూరు నియోజకవర్గం మండి ఎన్నికైనారు. 1985 ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు తెలుగుదేశం పార్టీ ఆయనకు మద్దతునిస్తూ గిద్దలూరు శాసనసభా నియోజక వర్గంలో అభ్యర్థిని నిలబెట్టలేదు. ఆ ఎన్నికలలో గెలిచిన రంగారెడ్డి, ఆ తరువాత తెలుగుదేశం పార్టీలో చేరి, మరణించే దాకా తెలుగుదేశం లోనే కొనసాగారు. 1985వ సంవత్సరములో ప్రోటెం స్పీకరుగా బాధ్యతలను నిర్వహించారు. శాసనసభకు మంత్రి మండలి సమిష్టి బాధ్యత వహించే పేరుతో ఒక మంత్రి తరపున వేరొక మంత్రి సమాధానాలు ఇవ్వడం, ముఖ్యమంత్రి పేరున వున్న సభా కార్యక్రమాన్ని ఇతర మంత్రులు నిర్వహించడం ఒక అలవాటుగా మారకూడదని అనివార్య కారణాల వల్లనో లేదా కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగానే ఆ విధంగా చేయాలని పేర్కొంటూ 1974 జనవరి 23వ తేదీన పిడతల రంగారెడ్డి స్పష్టంగా రూలింగు ఇచ్చి తమ వ్యక్తిత్వాన్ని చాటి చెప్పారు. రంగారెడ్డి, 1969లో ట్రినిడాడ్, టుబాగో, 1971లో మాల్టాయ్ దేశాలలో జరిగిన కామన్ వెల్త్ పార్లమెంటరీ సదస్సులలో పాల్గొన్నారు. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ రష్యా మొదలైన దేశాలలో పర్యటించారు. విధాన పరిషత్తు చైర్మన్ గా, శాసనసభ స్పీకరుగా ఎంతోమందికి ఆదర్శ ప్రాయులైన పిడతల రంగారెడ్డి 1991 సంవత్సరము జూలై ఒకటవ తేదీన మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# వస్తు సేవల పన్ను దినోత్సవం - సమీకృత ఆర్థిక వ్యవస్థకు సాక్ష్యం

## వస్తు సేవల పన్ను విజయం - వ్యాపార సరళీకరణకు సంకేతం - జూలై 1...వస్తు సేవల పన్ను దినోత్సవం

వస్తు మరియు సేవల పన్ను భారత దేశపు పన్ను సంస్కరణల చరిత్రలో ఒక విప్లవాత్మక మలుపు. ప్రతి సంవత్సరం జూలై నెల మొదటి తేదీని వస్తు సేవల పన్ను దినోత్సవంగా మన దేశంలో పాటిస్తున్నారు. ఇది కేవలం ఒక పన్ను విధానం ఆవిర్భావ దినోత్సవం మాత్రమే కాదు, భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఓ సుస్థిర మార్గాన్ని ఏర్పరిచిన ఘట్టం. దేశ వ్యాప్తంగా పన్నుల పరంగా అనేక మోడళ్ల మధ్య జరుగుతున్న గందరగోళానికి ముగింపు పలికిన మలుపు. వస్తు సేవల పన్ను అమలుకు దారితీసిన అవసరాలు ఎన్నో. కొంతకాలం క్రితమే మనదేశంలో విక్రయపు పన్ను, ఎక్సైజ్ సుంకం, సేవలపై పన్ను, రాష్ట్రాల మధ్య వ్యాపార లావాదేవీలపై వేర్వేరు పన్నులు, ప్రవేశపు పన్ను వంటి అనేక రకాల పన్నులు అమలులో ఉండేవి. రాష్ట్రానికి ఒక విధానం, మరో రాష్ట్రానికి మరో విధానంతో వ్యాపార రంగం సంక్లిష్టతలతో కొట్టు మిట్టాడేది. దీని ప్రభావంగా దేశ వ్యాప్తంగా సమగ్ర వ్యాపార వాతావరణం ఏర్పడలేక పోయింది. ఈ సమస్యలన్నింటికి పరిష్కారంగా ఒకే విధమైన పన్ను విధానాన్ని రూపొందించారు. దీని ఫలితంగా దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలులోకి వచ్చింది. దీనివల్ల పన్నుల వ్యవస్థ సరళతరం అయింది. వ్యాపారులు పన్నుల వివరాలు సమర్పించడంలో నూతన సాంకేతిక పద్ధతులను ఉపయోగించటం ప్రారంభించారు. ఈ పన్ను విధానం మూడు భాగాలుగా విభజించ బడింది. తయారీదారు నుండి తుది వినియోగదారుని వరకు ప్రతి దశలో విధించబడే పన్నును తక్షణమే ముందుగానే చెల్లించిన పన్నుతో సమన్వయం చేసుకునే అవకాశం కల్పించ.బడింది. దానివల్ల ఒకే వస్తువుపై పన్ను మీద పన్ను విధించే




పరిస్థితి లేకుండా పోయింది. ఈ విధానంలో కేంద్రానికి ఒక భాగం, రాష్ట్రానికి మరో భాగం లభించేలా పన్ను వసూలు జరుగుతుంది. అంతర్రాష్ట్ర వ్యాపార లావాదేవీలపై ప్రత్యేకంగా మరో విధానంలో వసూలు జరుగుతుంది. దీనివల్ల రాష్ట్రాల మధ్య వస్తువుల రవాణా సులభతరమైంది. వాణిజ్యానికి ఆటంకాలు తొలగి పోయాయి. ప్రస్తుతం ఈ పన్ను విధానం నాలుగు ప్రధాన శ్రేణులుగా విభజించ బడింది. అవసరమైన నిత్యావసర వస్తువులకు తక్కువ శాతం, విలాస వస్తువులకు ఎక్కువ శాతం విధించ బడుతున్నాయి. దీనివల్ల సామాన్యులపై భారం తగ్గించబడి, విలాస వస్తువుల వినియోగంపై నియంత్రణ సాధించ బడుతోంది. ఈ పన్ను విధానం ప్రారంభం తరువాత ప్రభుత్వ ఆదాయ వనరులు గణనీయంగా పెరిగాయి. 2024%25 ఆర్థిక సంవత్సరంలో పన్ను ద్వారా వచ్చిన ఆదాయం రెండు లక్షల కోట్ల రూపాయలకుపైగా ఉండటం గమనించ దగినది. ఇది పాలనా సామర్థ్యాన్ని సూచించడమే కాదు, పన్ను చెల్లింపులో పారదర్శకతను, ప్రజల నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. అయితే, దీనిలో కొన్ని సవాళ్లు ఇప్పటికీ ఎదురవుతున్నాయి. ముఖ్యంగా చిన్న, మధ్య.%ఎ% తరహా వ్యాపారులు ఈ పద్ధతిలో పూర్తిగా స్థిరపడలేక పోతున్నారు. పన్ను వేదికపై సాంకేతిక సమస్యలు, ఖాతాల సర్దుబాటు లోపాలు, ఎంటరైన పన్ను మొత్తాన్ని తిరిగి వాడుకునే అవకాశాలపై చిక్కులు, తరచూ మారే నిబంధనలు వీటన్నీ వ్యవస్థపై కొంత అస్పష్టత కలిగిస్తున్నాయి. వస్తు సేవల పన్ను దినోత్సవం అనేది ఈ విధానంపై ప్రజలలో అవగాహన పెంపు, ప్రయోజనాలపై చర్చలు, విధాన బలాలపై మద్దతు, లోపాలపై పరిష్కారాలకు మార్గదర్శనం చేసే సందర్భంగా పరిగణించాలి. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రాలు, పరిశ్రమల సంఘాలు, వాణిజ్య మండలులు ఈ దినాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాలు, సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహించడం ప్రాశస్త్యం. ఈ విధానం ద్వారా దేశీయ పెట్టుబడులే కాకుండా, విదేశీ పెట్టుబడులకు కూడా అనుకూల వాతావరణం ఏర్పడింది. వ్యాపారానికి అనువైన విధానంగా దీన్ని అంతర్జాతీయంగా గుర్తిస్తున్నారు. మొత్తంగా ఇది కేవలం పన్ను విధానం కాదని, దేశ ఆర్థిక సమీకరణకు ఒక నూతన దిశనిచ్చిన మార్గదర్శకంగా నిలుస్తున్నది. పన్ను చెల్లింపు దారులు, వ్యాపారులు, పాలకులు, ప్రజలందరూ ఈ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చుకోవాలన్న సంకల్పంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్ ... 9440595494**

# "అద్వితీయం ప్రాణ దాత సేవాభావం" - (బి.సి.రాయ్ జయంతి మరియు వర్ధంతి సందర్భంగా) (నేడు వైద్యుల దినోత్సవం)

ప్రతి వృత్తీ దేనికదే సాటి అయినప్పటికీ వైద్య వృత్తి మిగిలిన వాటికి భిన్నమైనది. మృత్యువు చివర అంచులదాకా వెళ్ళిన వారికి ప్రాణం పోసే శక్తి ఈ వృత్తికి ఉంటుంది. అందుకే రోగుల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు చేసే నిరంతర సేవకు ఈమాత్రం గుర్తింపుగా ప్రతి సంవత్సరము జూలై 1 వ తేదీన డాక్టర్స్ డే ని జరుపుకుంటారు. ప్రాణ ప్రదాతలను గుర్తు పెట్టుకునేందుకు ఈ రోజున డాక్టర్లందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరి సంపదలతో చల్లగా ఉండాలని దేవుని ప్రార్థించి శుభాకాంక్షలు తెలియ జేస్తారు. అలా తెలియ జేసేందుకు సంవత్సరములో ఒకరోజు కేటాయించ బడింది. బెంగాల్ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా పనిచేసిన బిధాన్ రాయ్.. రాష్ట్రంలో అనేక వైద్య సంస్థల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. జాధవ్‌పూర్ టీబీ ఆస్పత్రి, చిత్తరంజన్ సేవా సదన్, కమలా నెహ్రూ మెమోరియల్ ఆస్పత్రి, విక్టోరియా ఇన్‌స్టిట్యూషన్, చిత్తరంజన్ క్యాన్సర్ ఆస్పత్రి, చిత్తరంజన్ సేవా సదన్ ఫర్ విమెన్ అండ్ చిల్డ్రన్ తదతర ప్రతిష్టాత్మక సంస్థలన్నీ ఆయన హయాంలో పురుడు పోసుకున్నవే. మహిళలకు సామాజిక సేవ, నర్సింగ్‌లో శిక్షణ ఇప్పించడానికి ఆయన ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. కలకత్తా నగరానికి మేయర్ (1931-33)గానూ బిధాన్ రాయ్ పని చేశారు. స్థానిక పరిపాలనలో కీలక సంస్కరణలు తీసుకు వచ్చారు. కలకత్తా యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్(1942-44)గా, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఛైర్మన్ (1939)గా, ఉత్తర ప్రదేశ్ గవర్నర్‌గానూ ఆయన విశేష సేవలు అందించారు. 1882 జులై 1న జన్మించిన బిధాన్ రాయ్ 1962లో అదే రోజున (జులై 1) మరణించడం గమనార్హం. 1933 లో జార్జియలోని విండార్ లో మార్చి 30 వ తేదీన తొలి డాక్టర్స్ డే ని పాటించారు . డా.చార్లెస్ బి.ఆల్మండ్ భార్య బ్రౌన్ ఆల్మండ్ వైద్యుల గౌరవార్ధము ఒక రోజును కేటాయించాలని నిర్ణయించింది. గ్రీటింగ్ కార్డులు పంపడం, అసువులు బాసిన వైద్యులకు పూలతో నివాళులర్పించడం ద్వారా తొలి డాక్టర్స్ డే ఉత్సవం జరిపారు. యునైటెడ్ స్టేట్స్ లో ప్రతినిధుల సభ డాక్టర్స్ డే పాటిస్తూ1958 మార్చి 30 వ తేదీన తీర్మానం చేసింది. 1990 లో నేషనల్ డాక్టర్స్ డే పాటించాల్సిందిగా చట్టాన్ని ప్రవేశ పెట్టారు. 1990 అక్టోబర్ 30 న అధ్యక్షుడు జార్జి బుష్ మార్చి 30 న ' నేషనల్ డాక్టర్స్ డే ' గా పేర్కొంటూ చట్టం పై సంతకాలు చేశాడు. మన భారత దేశములో ప్రతియేటా జూలై 1 న నేషనల్ డాక్టర్స్ డే ని జరుపు కుంటున్నాము. ప్రముఖ వైద్యుడు డా. బి.సి.రాయ్ గౌరవార్థం ఈ రోజును నిర్ణయించారు. రాయ్ 1882 జూలై 01 న జన్మించినారు. మన దేశంలో వైద్య రంగానికి ఎనలేని సేవలందించిన ఆ మహా మహుని జన్మదిన వేడుకలే డాక్టర్స్ డే ఉత్సవాలుగా జరుపు కుంటున్నాము. ఆయన పుట్టినరోజు .. మరణించిన రోజు ఒక్కరోజే .. అదే జూలై 1 వ తేదీ . 1962 జూలై 1 వ తేదీన మృతి చెందారు. డాక్టర్ బి.సి.రాయ్ 1882 వ సంవత్సరం జూలై ఒకటవ తేదీన బీహార్ రాష్ట్రం ,పాట్నా జిల్లాలోని బకిమ్ పూర్ లో జన్మించారు. ఆయన పూర్తి పేరు బిధాన చంద్ర రాయ్. తండ్రి ప్రకాశ్ చంద్ర ఎక్సైజ్ ఇనస్పెక్టర్. బి.సి .రాయ్ తోబుట్టువులు ఐదుగురు. తన 14వ యేట నే తల్లిని కోల్పోయారు. అవివాహితుడైన బి.సి.రాయ్ తన ఆస్తులతో పాట్నాలో ఓ ట్రస్ట్ ఏర్పాటు చేసి సామాజిక సేవలకు అంకితం చేసారు . బిధాన చంద్ర రాయ్ 1909-11 మధ్య కాలంలో ఇంగ్లండ్ లోని సెంట్ బెర్త్ లోమో కాలేజీ లో M.R.C.P మరియు F.R.C.S అనే డిగ్రీలు పొందడానికి చదువు కొనసాగించి, 1911 లో స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత, కోల్ కతా మెడికల్ కాలేజీలో కొంతకాలం అధ్యాపకుడిగా పనిచేసారు. ఆయన నజాదవ్ పూర్ టి.బి.హాస్పిటల్, ఆర్.జి.ఖార్ మెడికల్ కాలేజీ, కమలా నెహ్రూ హాస్పిటల్, విక్టోరియా ఇన్నిట్యూట్, చిత్తరంజన్ క్యాన్సర్ హాస్పిటల్ మొదలైన సంస్థలు నెలకొల్పారు.1926 లో ప్రత్యేకంగా మహిళల కోసం, పిల్లల కోసం చిత్తరంజన్ సేవాసదన్ అనే వైద్య శాలను ఏర్పాటు చేసారు. మహిళలకు నర్సింగ్ శిక్షణ కోసం ఒక శిక్షణా సంస్థనూ ఏర్పాటు చేసారు. రాయ్ మహాత్మా గాంధీ వ్యక్తిగత వైద్యులలో ఒకరు. దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వైద్య మండలి సభ్యులుగా కూడా ఆయన ఉన్నారు. 1925 లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. బారక్ పూర్ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి పోటీ చేసి "గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ బెంగాల్" గా పేరొందిన సురేంద్రనాథ్ బెనర్జీని ఓడించారు..1922-28 ల మధ్య కాలంలో కోల్ కతా మెడికల్ జర్నల్ కు సంపాదకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. 1928 లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యులైనారు. కోల్ కతా నగరానికి మేయర్ గా ఎన్నికైనారు. 1942 లో కోల్ కతా విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా, 1943 లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షులుగా నియమింప బడ్డారు. విద్య, వైద్య రంగాలలో ఆయన సేవలకు 1944 లో గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయ బడింది. 1948 జనవరి 13 న పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి పదవిని చేపట్టారు.1961 లో ఫిబ్రవరి 4 న ఆయనను భారత రత్న వరించింది. రాయ్ జయంతి రోజైన జూలై ఒకటినే వర్ధంతి కూడా కావడం విశేషమైనందున ఆయన స్మారకార్థం ప్రతీ ఏడూ జూలై ఒకటవ తేదీన వైద్యుల దినోత్సవంగా జరుపుకోవాలని భారత ప్రభుత్వం 1962





లో ప్రకటించింది. వివిధ రంగాలలో సేవలు అందించిన వారికి 1976 నుంచి డాక్టర్ బి.సి.రాయ్ పేరు మీద అవార్డులను ప్రధానం చేస్తున్నారు. నేటి వైద్యులకు, వైద్య విద్యార్థులకు ఆదర్శప్రాయులు డా.బి.సి.రాయ్. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది. నిబద్ధత, త్యాగనిరతి వైద్యులకు ఉండాలి. తమ వ్యక్తిగత జీవితాన్ని పక్కకు పెట్టేసి తెల్లకోటుకే ప్రాధాన్యత ఇవ్వాలి. ఎదుటి వ్యక్తి ప్రాణాలు కాపాడడానికి తపన పడేవారే నిజమైన వైద్యులు. మానవ సేవే మాధవ సేవ అన్నట్లు సాగే వైద్య వృత్తిలో ఎంతగా సేవా నిరతి కలిగి ఉంటే అంతటి గొప్పవ్యక్తిగా గుర్తింపు. డాక్టర్లకు సహనము , ఓర్పు, సేవానిరతి, దయ ఉండాలి. వైద్యుడు ఎల్లప్పుడు అన్నివేలలా రోగులకు అందుబాటులో ఉండాలి. ఏ అత్యవసర పరిస్థితిలోనైనా తనకు వైద్యం చేసే డాక్టర్ అందుబాటులో ఉన్నాడన్న , ఉంటాడన్న నమ్మకము రోగికి కలిగేటట్లు వైద్యులు మెలగాలి. తను చేస్తున్న వృత్తి మీద వైద్యులకు అబిరుచి, నమ్మకము ఉండాలి. ఏదో జీవనోపాధి కోసం పనిచేయకూడదు. తను చేస్తున్న పనికి ఒక క్రమబద్ధత ఉండాలి. నిర్దిష్ట మైన సమయ సారిణి ఉండాలి. ప్రతి డాక్టరూ ఎల్లప్పుడు రోగికి మంచి చేయాలనే ఆలోచించాలి. ఫీజు తీసుకున్నా, తీసుకోక పోయినా తను చేసే సేవ ఒకేలా ఉండాలి. రోగికి, వైద్యునికి మధ్య నమ్మకం అనే బంధము ఉండాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పల్లె పోరుకు సిద్ధం..!

నల్గొండ : పల్లెపోరుకు అధికారులు సిద్ధమయ్యారు. హైకోర్టు తాజా తీర్పుతో ఆశావహుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఎన్నికలను ఈ ఏడాది సెప్టెంబరులోగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అటు అధికారులు మిగతా ఏర్పాట్లకు సన్నద్ధం కానున్నారు. గ్రామ పంచాయతీల్లో పాలక వర్గాల గడువు గతేడాది ఫిబ్రవరి ఒకటితో ముగిసింది. ఆ తర్వాత నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఎన్నికల నిర్వహణలో జాప్యంతో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనుందని భావించిన అధికారులు ఏర్పాట్లు చకచకా చేపట్టారు. నామినేషన్ల సామగ్రితో పాటు ఇతర వాటిని జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూంలో ఉంచారు. బ్యాలెట్ పేపర్ గుర్తులను ఎన్నికల సంఘం నిర్ణయించింది. బ్యాలెట్ పత్రాల ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుల నుంచి టెండర్లు స్వీకరించారు. రిటర్నింగ్ అధికారులను నియమించి శిక్షణ సైతం పూర్తి చేశారు. పీవోలు, ఏపీవోలను ఎంపిక చేయగా శిక్షణ మిగిలి ఉంది. చివరి దశలో ప్రభుత్వం ఎన్నికలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా హైకోర్టు తీర్పుతో మళ్లీ ఎన్నికల నిర్వహణలో కదలిక వచ్చినట్లయింది.

**రిజర్వేషన్లపై ఉత్కంఠ..**

రిజర్వేషన్ల అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పుడు అమలులో ఉన్న



రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్తారా? కొత్తగా ప్రకటిస్తారా? అని అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్న డిమాండ్ ఉంది. ఈ విషయంలోనూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం వరకు ఉండేవి. ఇప్పుడు కొత్త ప్రతిపాదనలతో రిజర్వేషన్ల ప్రక్రియలో మార్పులు జరగనున్నాయి. దీంతోపాటు గత ప్రభుత్వం చేసిన చట్టప్రకారం 2019లో కేటాయించిన రిజర్వేషన్లు పదేళ్ల వరకు కొనసాగాలి. దీనిపైనా ప్రస్తుతం ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందా అన్న ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. గత రిజర్వేషన్ల ప్రకారం అధికారులు ఇప్పటికే నివేదిక సిద్ధం చేసి పంపారు. మరోవైపు గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే విషయంలో సంబంధిత యంత్రాంగం సిద్ధంగా ఉంది. **ఇదీ.. సంగతి**

జిల్లాలో పంచాయతీలు 856

వార్డులు 7392

పోలింగ్ కేంద్రాలు 7392

# యాప్‌లో.. ఆమె ఆరోగ్యం

నల్గొండ : ప్రభుత్వం రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఆరోగ్య మహిళా పథకం జిల్లాలో మహిళలకు ఉపయోగకరంగా ఉంది. ప్రతి మంగళవారం ప్రత్యేకంగా ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ వైద్యులతో పాటు ఇతర సిబ్బంది కూడా మహిళలే పనిచేస్తుండడంతో వారి ఆరోగ్య సమస్యలు పూర్తి స్థాయిలో చెప్పుకోవడానికి అనుకూలంగా ఉంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రాలు అందుబాటులో ఉంటున్నాయి. ఇక్కడ పీసీవోడీ, థైరాయిడ్, బీపీ, చక్కెరవ్యాధి పరీక్షలతో పాటు, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ సమస్యలు, హార్మోన్ సమస్యలు, మూత్రనాళ సమస్యలు, మామోగ్రామ్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, టుడీ ఈకో వంటి అత్యాధునిక పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. చికిత్స వివరాలు ఆరోగ్య మహిళా యాప్‌లో నిక్షిప్తపరుస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం చింతపల్లి, దామరచర్ల, డిండి, నిడమనూరు, వేములపల్లి, చండూరు, కట్టంగూరు, తిప్పర్తి, మాన్యంచెల్క, శాలిగౌరారం, మర్రిగూడ



ప్రాంతాల్లో ఆరోగ్యమహిళ పథకం కింద ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు.

**ఎక్కువగా ఇన్‌ఫెక్షన్లే..** జిల్లాలో మహిళా ఆసుపత్రులకు వచ్చే బాధితులు ఎక్కువగా మూత్రాశయ ఇన్‌ఫెక్షన్‌లతో బాధపడుతున్న వారే ఉంటున్నారు. ఆ తర్వాత మామోగ్రామ్, రక్తహీనత, థైరాయిడ్, వీఐఏ, ఇన్‌ఫెక్షన్ సమస్యలతో బాధపడేవారు ఉంటున్నారు. థైరాయిడ్ సమస్యలు ఉన్నవారిని గుర్తించడంతో పాటు శస్త్రచికిత్సలు కూడా జనరల్ ఆసుపత్రిలో జరిగేలా చూస్తున్నారు. వీరి కోసం రేడియాలజీ విభాగంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న 37 పరీక్షలతో పాటు ప్రత్యేకంగా విటమిన్ డీ-3, బీ-12 టెస్టులు చేస్తున్నారు.

**మెరుగు పరుస్తున్నాం.** జిల్లాలో ఉన్న ఆరోగ్య మహిళా ఆసుపత్రుల్లో ఓపీ క్రమేణా పెరుగుతుంది. ప్రతి మంగళవారం ఇక్కడ మహిళా వైద్యులతో పాటు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. బాధితులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తున్నాం. పరీక్షల కోసం వచ్చేవారి నుంచి రక్తపూతలు సేకరించి టీడీ హబ్ ద్వారా అన్నిరకాల పరీక్షలు చేయించి అదే రోజు వారి చరవాణికి సమాచారం అందేలా చూస్తున్నాం. వ్యాధి తీవ్రతను బట్టి మెరుగైన వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులతో పాటు జిల్లా జనరల్ ఆసుపత్రులకు రోగులను పంపిస్తున్నాం.

డా.పుట్ల శ్రీనివాస్ డీఎంహెచ్‌వో, నల్గొండ

2023 మార్చి నుంచి ఆరోగ్య మహిళా ఆసుపత్రుల్లో చికిత్స పొందిన మహిళలు ఇలా.. జిల్లా : నల్గొండ

ఆరోగ్య మహిళ ఆసుపత్రులు : 11

ఓపీ : 1,15,419

పరీక్షలు చేయించుకున్న బాధితులు : 1,01,160

ఇన్‌ఫెక్షన్లు : 3,356

రొమ్ము క్యాన్సర్ : 876

ఇతర పరీక్షలు : 22,367

# బొంరాస్‌పేట.. పర్యాటక కోట!



బొంరాస్‌పేట : సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ రానున్న రోజుల్లో పర్యాటక శోభను సంతరించుకోనుంది. ఇప్పటికే విద్య, వైద్యం, సాగునీరు, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. పర్యాటకంగానూ ముందడుగు పడనుంది. సీఎం చొరవతో బొంరాస్‌పేటలోని రిజర్వు ఫారెస్టులో ఎకో పార్కు ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు ప్రాజెక్టుకు రూపకల్పన చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

**అటవీ ప్రాంతం చుట్టూ కంచె..**

చెరువులో బోటింగ్, కాయకింగ్.. రిజర్వు ఫారెస్టులో పర్యావరణ పార్కులు ఏర్పాటు చేస్తారు. అటవీ ప్రాంతం చుట్టూ చైన్‌లింక్ ఫెన్సింగ్ ఉంటుంది. ముఖద్వారాలు, వాహనాలు నిలపడానికి పార్కింగ్ సౌకర్యం కల్పిస్తారు. పార్కులో సందర్శకులు నడవడానికి వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు నిర్మిస్తారు. కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేస్తారు. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పిస్తారు. అటవీ ప్రాంతాన్ని చూడటానికి 40 అడుగుల ఎత్తయిన వాచ్ టవర్ నిర్మిస్తారు. క్యానోపీవాక్, జిప్‌లైన్, రాక్ క్లైంబింగ్ సదుపాయం కల్పిస్తారు. రెండు చిన్న గజెబోలు(గుడిసెల మాదిరిగా ఉండేవి) ఏర్పాటు చేస్తారు. సందర్శకులకు పర్యావరణంపై అవగాహన కల్పించడానికి జిల్లా పర్యావరణ విద్యా కేంద్రం (డీఈఈసి)లు ఏర్పాటు చేస్తారు. రిజర్వు ఫారెస్టు మొత్తం ఆహ్లాదంగా కనిపించడానికి పచ్చదనం పెంచనున్నారు. ఇప్పటికే మూడు అటవీ ప్రాంతాల్లో రావి, మర్రి, వేప వంటి అటవీ జాతులకు చెందిన 85 వేల మొక్కలు నాటారు.

**సుమారు 40 ఎకరాల్లో..**

హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారికి పక్కనే అడవి, చెరువు ఉండడంతో బొంరాస్‌పేటను అనుకూల ప్రాంతంగా అధికారులు ఎంపిక చేశారు. ఇక్కడ 40 ఎకరాల్లో పర్యావరణ పర్యాటకాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం రూ.8 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. నిధులు రాగానే పనులు చేయనున్నారు.

**బోటింగ్‌కు అవకాశాల పరిశీలన..**

ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుండడంతో ముందుగా చెరువులో నీటి లభ్యత, బోటింగ్ అవకాశాలపై గురువారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, నీటి పారుదల శాఖ డీఈ కిరణ్‌కుమార్ పరిశీలించారు. సందర్శకులను ఆకట్టుకునేలా వినూత్నంగా అడవిని అభివృద్ధి చేసే అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. జాతీయ రహదారికి పక్కనే చెరువు ఉండడంతో బోటింగ్‌కు మంచి ఆదరణ వస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. అందరూ సహకరించి ప్రాజెక్టును విజయవంతం చేయాలని, మూణ్నెల్లలో చెరువులో బోటింగ్ ప్రారంభం కావాలని కడా ప్రత్యేకాధికారి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, జయకృష్ణ పాల్గొన్నారు.

# చరవాణి.. చేస్తోంది హాని



జగిత్యాల: చిన్ననాటి ఊసులతో.. బాల్యం మిగిల్చిన జ్ఞాపకాలతో జీవితాంతం మధురానుభూతులు పంచుకోవాల్సిన బాలబాలికలు కొందరు నేరాల మరక అంటించుకుంటున్నారు. తెలిసీతెలియని వయసులో, చరవాణులే తమ ఆస్తిగా... టీవీలే నేస్తాలుగా మంచిని నేర్చుకోవాల్సింది పోయి చెడును ఆస్వాదిస్తున్నారు. అమ్మ చేసిన తీపి వంటకాలు రుచిగా ఉంటున్నాయో తెలియదు కానీ హితం కోరని స్నేహితుడు గంజాయికి అలవాటు చేస్తే ఆనందంగా ఉంటున్నారు. పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన వయసులోనే కొందరు కత్తులు దూస్తున్నారు. నాన్న నడుం చుట్టూ చేతులేసి వాహనంపై వెళ్లాల్సిన వారే వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. నేరాల మరక అంటించుకొని తల్లిదండ్రులకు తీరని వేదన మిగులుస్తున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ ఇటీవల బాలబాలికలు పలు నేరాల్లో చిక్కారు. కరోనా సమయంలో ఆన్‌లైన్ తరగతుల పేరిట చరవాణులకు దగ్గరవ్వడం.. ఆ తర్వాత కూడా రోజంతా వాటితోనే కాలక్షేపం చేయడంతో విపరీత ధోరణికి అలవాటు పడుతున్నారు. చాలా మంది చరవాణుల్లో మంచిని స్వీకరిస్తుండగా కొందరు మాత్రం బాల్యంలోనే నేరప్రవృత్తికి సంబంధించిన అంశాలను చూస్తూ ప్రభావితమవుతున్నారు. పలువురు బాలలు తల్లిదండ్రులపై దాడులు చేసిన ఘటనలు వీటి ప్రభావంతోనే అని స్పష్టమైంది. గంజాయి, సిగరెట్, మద్యం తదితరాలకు కూడా బానిసవ్వడం.. నేరాల్లో పాలుపంచుకోవడంతో ఇబ్బందుల పాలవుతున్నారు.

**ఇలా ప్రభావితం**

సామాజిక మాధ్యమాలు

చెడు సావాసాలు

గంజాయి, గుట్కా, మద్యం, సిగరెట్

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

జగిత్యాల పట్టణంలో ముగ్గురు మైనర్లు ఒకే వాహనంపై వెళ్తూ పంచాయతీ కార్యదర్శిని ఢీకొట్టడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పంచాయతీ కార్యదర్శి కుటుంబంతో పాటు బాల్యంలోనే కేసులతో తల్లిదండ్రులు మనోవేదనకు గురయ్యారు.

బీమారం మండల కేంద్రంలో ఓ బాలుడు ద్విచక్ర వాహనం నడుపుతూ వృద్ధుడిని ఢీకొనడంతో మృతిచెందగా కేసు నమోదైంది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2025లో మైనర్లు వాహనం నడిపినందుకు 4,000కు పైగా కేసులు నమోదయ్యాయి.

ఆయా కేసుల్లో తల్లిదండ్రులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించడం తల్లిదండ్రులకు ఇబ్బందిగా మారింది.

మహారాష్ట్ర నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నారంటూ పోలీసులు నిఘా పెట్టగా మెట్‌పల్లి పట్టణంలో పలువురు మైనర్లు గంజాయి విక్రేతలుగా ఉన్నట్లు తెలిసి విస్తుపోయారు.

రామగుండం కమిషనరేట్ పరిధిలోనూ పలువురు మైనర్లపై గంజాయి రవాణా, దాడుల కేసులు నమోదయ్యాయి. జీడిమెట్లలో రెండు రోజుల కిందట వెలుగుచూసిన ఘటన బాలబాలికల్లో నేర ప్రవృత్తి ఎంతలా పెరిగిందో స్పష్టం చేస్తోంది. సామాజిక మాధ్యమంలో పరిచయమైన ప్రేమ పదో తరగతిలోనే ఓ బాలిక చేత తల్లిని హత్య చేయించింది. ప్రేమ మోజులో ప్రియుడు, అతని తమ్ముడితో కలిసి బాలిక ఈ దారుణానికి ఒడిగట్టింది.

**ప్రవర్తన గమనించాలి..**

డాక్టర్ వీరేందర్, సైకాలజిస్ట్

కుటుంబ పరిస్థితులు, చుట్టూ ఉన్న వాతావరణం బాలబాలికల ప్రవర్తనలో మార్పు తెచ్చే అవకాశముంది. పాఠశాలల్లోనూ ఎలా ఉంటున్నారన్న విషయాలను గ్రహించి ఉపాధ్యాయులకు తెలిపితే ప్రయోజనముంటుంది. ఇటీవల నేరప్రవృత్తి కూడా పెరిగింది. సామాజిక మాధ్యమాల్లో చెడు ఎక్కువగా ఆకర్షించే అవకాశముంటుంది కాబట్టి ఆ వైపుగా పిల్లలు ఆకర్షితులు కాకుండా చూడాలి. తల్లిదండ్రులు వారి పిల్లలను తరచూ మాట్లాడిస్తూ వారి ప్రవర్తనలో మార్పు ఏమైనా ఉందా గమనించాలి. ఏ మాత్రం మార్పు ఉన్నా కౌన్సెలింగ్ ఉపయుక్తంగా ఉంటుంది. తల్లిదండ్రులు, బంధువులు, మానసిక నిపుణులు చిన్నారుల మానసిక స్థితిలో మార్పు తెచ్చే అవకాశముంటుంది.

**చట్టపరమైన చర్యలు**

రఘుచందర్, డీఎస్పీ, జగిత్యాల

మైనర్ల కదలికలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. ఎక్కువగా చరవాణి వినియోగిస్తుండటం, మానసిక ప్రవర్తనలో మార్పులు కనిపిస్తే బంధువులు, ఇతరుల సహకారంతో మార్పునకు ప్రయత్నించాలి. గంజాయి, మద్యం మత్తు బారిన పడకుండా మైనర్లను కాపాడటం కొందరు తల్లిదండ్రులకు సవాలుగా మారింది. దాడులు, ఇతర కేసుల్లో నిందితులుగా ఉన్న బాలబాలికలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

# విభిన్న సేద్యానికి ఊతం లభించేనా?


సిరిసిల్ల: గంభీరావుపేట మండలం నర్మాలలో మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకం కేంద్రం, పక్కనే చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ రెండు కేంద్రాలు నిరాదరణకు గురయ్యాయి. వీటికి సంబంధించిన సుమారు 100 ఎకరాలకుపైగా భూములు ఉన్నాయి. ఈ భూమిని సద్వినియోగం చేసుకుంటే పరిశోధనలకు మరింత మేలు జరగనుంది.

జొన్న, సజ్జ, నువ్వు, అలసంద, చెరకు, పసుపు, మిరప, మినుము, పల్లీ ఇలా.. చెప్పుకుంటూ పోతే లెక్కకు మిక్కిలి పంటలు. కానీ జిల్లాలో వరి, పత్తి మొక్కజొన్న పంటలు మాత్రమే సాగు చేస్తున్నారు. వీటిల్లో ఏటికేడు వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. అయితే సేద్యంలో వినూత్న ఆలోచనలతో విభిన్న పంటలు పండించేందుకు కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే)లు ఉండాలి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రానికి 16 కేవీకేలను మంజూరు చేసింది. కాగా జిల్లాలో నెలకొల్పాలనే దానిపై ప్రాధాన్యత కనిపిస్తోంది.

దేశవ్యాప్తంగా జిల్లాకో కృషి విజ్ఞాన కేంద్రాన్ని(కేవీకే) నెలకొల్పాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ చర్యలు చేపట్టాయి. కొత్తగా మంజూరయ్యే దానితో వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ సమాచారం ఒకే చోట లభించి రైతులకు సాగు సంబంధిత సేవలు మరింతగా దరిచేరుతాయి.

**కలిగే ప్రయోజనాలు ఇలా..**

జిల్లాలోని వ్యవసాయ డిగ్రీ కళాశాలను పీజీ స్థాయికి పెంచేందుకు పలు కోర్సుల ప్రారంభానికి గతేడాది యూనివర్సిటీ అనుమతికి పంపారు. అలాగే పాలిటెక్నిక్ డిప్లొమాలోనూ మరిన్ని కోర్సులు పెంచేలా ప్రయత్నాలు సాగుతున్నాయి. వీటికి తోడు కేవీకే ఏర్పాటుతో జిల్లాలో వ్యవసాయంపై మరో ముందడుగు పడుతుంది.




కొత్తగా ఏర్పాటు చేయనున్న కేవీకేల్లో ఒక సీనియర్ సైంటిస్ట్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాస్త్రవేత్తలు కార్యాలయ సిబ్బంది, సాంకేతిక ఉద్యోగులు ఉంటారు. వీరితో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా జిల్లా స్థాయి సమగ్ర వ్యవసాయ కేంద్రంగా తీర్చిదిద్దుతారు. పరిశోధన స్థానాల్లో అభివృద్ధి చేసిన నూతన వంగడాలను తొలుత కేవీకేల్లోని క్షేత్రాల్లో సాగు చేసి ఫలితాలను సమీక్షిస్తారు.

శాస్త్రవేత్తలు నూతన వంగడాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన ఫలితాలపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. నూతన సాగు విధానాలపై వీటిల్లో పరిశోధనలు చేపడతారు. భూసార పరీక్ష కిట్లు, వ్యవసాయ యంత్రాలు, పరికరాలను రైతులకు అందిస్తారు.

వాతావరణ సమాచారం, చీడపీడల నివారణపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తారు. జిల్లెలలో వ్యవసాయ డిగ్రీ, సర్దాపూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాల ఉంది. కేవీకే అందుబాటులోకి వస్తే క్షేత్ర పరిశీలనలో శాస్త్రవేత్తలతో కలిసి పని చేసే అనుభవం వస్తుంది.

# ఆగుతూ.. సాగుతూ..!

నల్గొండ: ప్రపంచ బౌద్ధక్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన నాగార్జునసాగర్ బుద్ధవన ప్రాజెక్టు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుద్ధవనాన్ని సందర్శించి ఇక్కడి అద్భుత బౌద్ధశిల్ప సంపద, కళాకృతులు, బుద్ధ చరిత్ర ప్రాంతాలను చూసి అబ్బురపడ్డారు. ఈక్షేత్ర అభివృద్ధికి నిధులు త్వరితగతిన మంజూరు చేస్తామని ప్రకటించారు. మంత్రి పర్యటన తర్వాత రూ.15.39 కోట్లు యువజన సాంస్కృతిక శాఖ నిధుల నుంచి కేటాయించారు. వాణిజ్య దుకాణాల నిర్మాణం, లైటింగ్, పెయింటింగ్, కాటేజ్‌ల పునఃనిర్మాణ పనులు ఆగుతూ సాగుతూ నడుస్తున్నాయి. బుద్ధవనంలోనూ చేయాల్సిన పెండింగ్ ఫ్లోరింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

**నిధులు కేటాయించేనా..**

బుద్ధ చరితకు సంబంధించిన సమస్త సమాచారాన్ని డిజిటలైజ్ చేసి ఔత్సాహిక పర్యాటకుల కోసం 'డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ మ్యూజిక్ సెంటర్' పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు సంబంధించి బుద్ధచరితవనానికి కుడివైపు ప్రతిపాదిత స్థలం అందుబాటులో ఉన్నా.. ఇంకా పనులు సాగడం లేదు. నాగార్జునకొండపై 'టూరిస్ట్ డెస్టినేషన్' చేస్తామని మంత్రి ప్రకటించినా నిధులు రాలేదు.

మూడేళ్లుగా జీవో నెంబర్ 280 ప్రకారం రూ.5.39 కోట్లు బుద్ధవనానికి



కేటాయించగా ఇందులో 17 రకాలైన పనులు చేపట్టనున్నారు. ఉపరితల నీటి ట్యాంకులు, పైప్‌లైన్ పనులు పూర్తవుతుండగా ఇంకా క్లాక్‌రూమ్, సైన్ బోర్డ్స్ టెండర్లు పూర్తికావాల్సి ఉంది. జీవో నెంబర్ 1 ప్రకారం రూ.10 కోట్లు లైటింగ్, పెయింటింగ్, పెండింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. బుద్ధవనంలో విభిన్న రూపాల్లో ఉండే బౌద్ధ స్తూపాలకు, ధ్యానమందిరానికి ఏసీలు, కార్యాలయాలకు విద్యుత్తు సౌకర్యాలతో నిరంతరం వెలిగేలా ఏర్పాటు చేశారు. ప్రతి నెల దాదాపు రూ.2లక్షల విద్యుత్తు బిల్లులు వచ్చేవి. విద్యుత్తు అవసరాలకు రెడ్‌కో ఆధ్వర్యంలో సౌరశక్తిని ఉపయోగించేందుకు శ్రీకారం చుట్టారు. ఇటీవల రూ.93లక్షలతో 150 కిలోవాట్ల సామర్థ్యంతో భారీ సౌరశక్తి ఫలకాలను ఏర్పాటు చేశారు. యూనిట్ ఏర్పాటు చేసిన తర్వాత నెలకు వినియోగాన్ని బట్టి నెలకు రూ.50వేల నుంచి రూ.70వేల వరకు ఖర్చవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. నెలకు గరిష్ఠంగా రూ.లక్షన్నర వరకు ఆదా అవుతున్నట్లు చెబుతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించనప్పుడు బుద్ధవనంలో జరిగే కార్యక్రమాలకు విద్యుత్తు అవసరాలు ఉపయోగించుకుంటున్నారు.

# ఎప్పటికప్పుడు.. యంత్రంలో నమోదు

గరిడేపల్లి: రైతులకు అవసరమైన ఎరువులు ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖకు తెలియడానికి ఈ-పాస్ యంత్రాలతోనే అమ్మకాలు చేయాలని ఆ శాఖ ఆదేశించింది. గతంలో వీటి వినియోగం ఉన్నా.. కొన్నిసార్లు ఈ-పాస్‌లో నమోదు చేయకుండానే అమ్మకాలు చేస్తున్నారు. దాంతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ సక్రమంగా పంపిణీ కావడం లేదు. అందుకే ఈసారి కొత్త యంత్రాలను సరఫరా చేసింది.

**పాత సాంకేతికత అప్‌డేట్‌తో..**

పాత సాంకేతికతకు అప్‌డేట్ చేసి అందులో కొన్ని ఆప్షన్స్ ఇచ్చింది. రైతు చెల్లింపులను ఫోన్‌పే, గూగుల్‌పే, నగదు ద్వారా చేస్తున్నారా అనేది అడుగుతుంది. దాంతో పాటు భూసార పరీక్ష ఫలితాల పత్రం ఉందా లేదా అని తెలుసుకుంటున్నారు. భవిష్యత్తులో ఈ-పాస్ యంత్రాల సాయంతో పాటు రైతు విశిష్ట సంఖ్యకు అనుసంధానం చేసి రైతులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కేంద్రం సేకరించే అవకాశం ఉందని తెలిసింది. రైతుకు ఎంత పొలం ఉందో ఈ-పాస్ యంత్రంలో ఇట్టే తెలుస్తుంది. తద్వారా ఎంత ఎరువు అవసరం, ఎంత కొనుగోలు చేస్తున్నారో తెలుసుకోవచ్చు. ఇప్పటికే కేంద్రం ఎరువులపై రాయితీని లక్షల కోట్లు చెల్లిస్తోంది. రాయితీ సొమ్ము పారదర్శక చెల్లింపుతో పాటు ఎరువుల వినియోగం, సరఫరాలో కచ్చితత్వం ఉంటుంది. అందుకే దీన్ని సక్రమంగా అమలు చేసేందుకు కొత్త పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకు వస్తోంది.

**సమస్యలు రాకుండా..**

ఏ ఎరువు ఎంత అమ్ముడు పోయిందనేది తెలిస్తే.. తదనుగుణంగా కంపెనీలకు ఎప్పటికప్పుడు రాయితీ సొమ్ము కేంద్రం చెల్లిస్తుంది. ఈ-పాస్‌లో నమోదు చేయకపోతే సదరు కంపెనీలకు రాయితీ సొమ్ము



నిలిచిపోతుంది. దాంతో పాటు ఎరువులు నిల్వ ఉన్నట్లుగానే నమోదవుతుంది. అప్పుడు సరఫరాలో ఇబ్బందులు ఏర్పడతాయి. గతేడాది సహకార సంఘాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఈ-పాస్‌లలో నమోదు చేయలేదు. యూరియా కొరతతో లారీ లోడు రాగానే ఎగబడి లారీ మీది నుంచి నేరుగా ట్రాక్టర్లు, ఆటోలలో వేసుకుని వెళ్లారు. అప్పుడు సిబ్బంది ఈ-పాస్ చేయించలేకపోయారు. దాంతో మార్క్‌ఫెడ్‌లో సహకార సంఘాలకు సరఫరా చేసిన యూరియా స్టాక్ ఉన్నట్లుగానే నివేదించారు. దాంతో సదరు సంఘానికి యూరియా సరఫరా చేయలేకపోయారు. సమస్యను గుర్తించి వ్యవసాయ శాఖ మండల అధికారులకు కచ్చితమైన ఆదేశాలిచ్చి ఈ-పాస్ పూర్తి చేయాలని సూచించారు. దీంతో ఆగమేఘాల మీద నమోదు చేశారు. ఇలా జాప్యం జరగకుండా ఈసారి పకడ్బందీగా ఈ-పాస్‌తోనే అమ్మకాలు చేయాలని ఆదేశించారు. మరో పదిహేను రోజుల్లో ఎరువుల అమ్మకాలు ప్రారంభం కానున్నాయి.

చురకలు



## సీసీ కెమెరా.. మహా టోకరా

హైదరాబాద్: ఇళ్లు, ఖాళీ ప్రదేశాలు, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద వైఫైతో కూడిన అధిక రెజుల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుంటారు. పేరున్న కంపెనీ అయితే ఒక్కో కెమెరా రూ.2 వేల నుంచి రూ.3 వేలు, గరిష్ఠంగా రూ.5 వేల వరకు ఉంటుంది. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) మాత్రం శివార్లలోని 12 పార్కుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఏకంగా రూ.9 కోట్లు వెచ్చిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఒక్కో పార్కు వద్ద 100 నుంచి 150 వరకు కెమెరాలు పెట్టాలని నిర్ణయించారు. టెండర్ల ప్రక్రియ కూడా కొలిక్కి వస్తోంది. మొత్తంగా 1200 నుంచి 1800 కెమెరాలు అవసరమని లెక్కగట్టారు.

**ధరపై సందేహాలు**



నగరంలోని పలు కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో కెమెరాలు ఉన్నాయి. ఇవి వేగంగా వెళ్తున్న చిన్నచిన్న వాహనాలను సైతం నాణ్యమైన ఫొటోలు తీస్తుంటాయి. ఒక్కోటి రూ.2 వేలకు మించి ఉండదు. అలాంటిది పార్కుల్లో ఏర్పాటు చేసే కెమెరాలు ఒక్కోటి రూ.20 వేల నుంచి రూ.25 వేలకు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ఒక్కోటి రూ.25 వేలు అనుకున్నా.. 12 పార్కులకు గరిష్ఠంగా 2 వేల వరకు అవసరం. అన్ని పన్నులు కలుపుకొని సుమారు రూ.6.50 కోట్లకు మించి ఉండదు. ఈ కెమెరాల విషయంలో నిర్వహణ ఒప్పందం ఏడాదే ఉన్నట్లు తెలుస్తోంది. రూ.కోట్లు ఖర్చు పెట్టి కొన్న కెమెరాలు రెండో ఏడాది నుంచి పనిచేయకపోతే పరిస్థితి ఏమిటనేది సమాధానం లేని ప్రశ్నే. ఉన్నతాధికారులు స్పందించి కెమెరాల కొనుగోలు వ్యవహారంపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

## స్థానిక పోరుకు సిద్ధం

వికారాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికలు 90 రోజుల్లో నిర్వహించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశించడంతో దానికనుగుణంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. మొదట జడ్పీటీసీ, ఎంపీటీసీ.. అనంతరం పంచాయతీ, పురపాలక సంఘం ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. పలువురు ప్రజాప్రతినిధుల వ్యాఖ్యలు దీనికి బలాన్ని చేకూరుస్తున్నాయి.

**అందరి దృష్టి రిజర్వేషన్లపైనే..:** రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ ఉండేలా గత ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఆ తరవాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గత డిసెంబరులో జరిగిన శాసనసభ సమావేశాల్లో మళ్లీ కొత్తగా పంచాయతీరాజ్ చట్టం-2024 బిల్లును ఆమోదించారు. దీని ప్రకారం ఎన్నికల్లో ఒకసారి మాత్రమే రిజర్వేషన్ వర్తించనుంది. ఈ నేపథ్యంలో అన్ని స్థానాలకు రిజర్వేషన్లు మారనుండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. గతంలోని రిజర్వుడు స్థానాలన్నీ రొటేషన్ పద్ధతిలో మారతాయని



పలువురు అంటున్నారు. ప్రాధాన్య క్రమంలో ఎస్టీ, ఎస్సీ, బీసీలకు రిజర్వు చేయనున్నట్లు తెలుసోంది. జడ్పీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు కొత్తగా రిజర్వేషన్లు అమలవుతాయని భావిస్తున్నారు. జిల్లాలో మూడు మండలాలు కొత్తగా ఏర్పడ్డాయి. వీటికి రిజర్వేషన్లు కేటాయించనున్నారు. సగం స్థానాలకు ప్రకటించగా.. మిగతావి జనరల్ కేటగిరీలో ఉండనున్నాయని తెలుస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై సందిగ్ధం నెలకొంది.

**ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం..- సుధీర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు).**

స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్, లెక్కింపు కేంద్రాలు, ఎన్నికల అధికారుల నియామకం తదితర ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నాం.

## ఖాళీ స్థలాలు.. కావాలి కనువిప్పు!

ధర్మపురి: పురపాలికల్లోని మురుగునీటి సమస్య వెంటాడుతోంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటం, పారిశుద్ధ్యలోపం తదితర కారణాలతో ఏటా వర్షాకాలంలో ఖాళీ ప్రదేశాల్లో నీరు నిలుస్తోంది. రోజుల తరబడి అలాగే ఉండటంతో దోమలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో వ్యాధులు విజృంభించి ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. అధికారులు ఆయా ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు పంపించి చేతులు దులుపుకొంటున్నారు. జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి, రాయికల్ పట్టణాల్లో ఏటా ఈ దుస్థితి నెలకొంటోంది. ఓ వైపు వానలకు రహదారులు చిత్తడిగా మారడంతో పాటు, మురుగు కాలువల్లోని నీరు బయటకు వెళ్లక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

**రోడ్లు, మురుగు కాలువలకు నోచని నూతన కాలనీలు**

పురాల్లో నూతనంగా సుమారు 15 కాలనీలు అవతరించాయి. కానీ కనీసం రహదార్లు, మురుగు కాలువలకు నోచుకోలేదు. దీంతో వానలకు శివారు ప్రాంతాల్లో నీరు నిలుస్తోంది. రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. వానకాలంలో పుర సిబ్బంది ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని, స్వచ్ఛ ఆటోలు కూడా రావటం లేదని ఆయా కాలనీవాసులు వాపోతున్నారు. ధర్మపురిలో జాతీయ రహదారి నుంచి పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహకాలనీ పైభాగం వరకే మురుగు కాలువ నిర్మించారు. లక్ష్మీనరసింహకాలనీతో పాటు దిగువన ఉన్న ఒడ్డెర, గిరకలకాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ లేదు. ఈ కాలనీలలోని నివాస ప్రాంతాల్లో మురుగునీరు చేరుతోంది. దీంతో దుర్వాసన, దోమలు, పందుల బెడద ఉంటుంది. చుట్టు పక్కన కాలనీలకు దోమలు వ్యాపిస్తున్నాయి. సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలి.

**గుర్తించి చర్యలు తీసుకుంటాం**

కల్లెడ రాజశేఖర్, పురకమిషనర్

ధర్మపురిలో వందరోజుల ప్రణాళికలో భాగంగా ఖాళీ స్థలాలు గుర్తిస్తాం. పరిశీలించి అన్ని రకాల స్వచ్ఛత, పరిశుభ్రత చర్యలు తీసుకుంటాం. స్వచ్ఛ వాహనాలను అన్ని కాలనీలకు పంపిస్తాం.

## దళారీ.. అవినీతి సవారీ




హైదరాబాద్ : ఏ వాహనం రోడ్డు ఎక్కాలన్నా రవాణా శాఖ అధికారుల ధ్రువీకరణ తప్పనిసరి. ఇంతటి కీలకమైన శాఖలో దళారుల దందా రాజ్యమేలుతోంది. ‘రవాణా’ కార్యాలయాల్లో పని జరగాలంటే మధ్యవర్తులుండాల్సిందే. కొందరు అధికారులు, సిబ్బంది మధ్యవర్తులతో కుమ్మక్కై యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు. తిరుమలగిరి, ఉప్పల్ ఆర్టీఓ కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ (అనిశా) సోదాలు నిర్వహించింది. రాత్రి వరకు ద్వారాలు మూసివేసి అధికారులు తనిఖీలు చేపట్టారు.

**ఉడాయించిన మధ్యవర్తులు**

ళరవాణా కార్యాలయాల ప్రాంగణాల్లో జిరాక్స్ షాప్‌ల మాటున కొందరు దందా నడిపిస్తున్నారు. ఉప్పల్ కార్యాలయంలో అధికారులు సోదాలు చేస్తుండగా.. దుకాణాలకు తాళాలు పెట్టి ఏజెంట్లు పరుగులు తీశారు. ఉప్పల్‌లో ఏడుగురిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తిరుమలగిరి రవాణా కార్యాలయంలోనూ పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

**ప్రతి పనికీ ఓ ధర :** రవాణా శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రతిదానికీ ఒక నిర్దిష్టమైన ధర ఉంటుంది. అవి నోటీసు బోర్డు వరకే పరిమితం. ఇక్కడ ఏజెంట్లు చెప్పిందే వేదం. వారు నిర్ణయించిందే రేటు. ఆన్‌లైన్ ఫీజుతో సంబంధం లేకుండా వాళ్లు చేసే పనిని బట్టి దరఖాస్తుదారు నుంచి వసూలు చేస్తుంటారు.

**సీక్రెట్ కోడ్ :** అధికారులు, ఏజెంట్లకు మాత్రమే అర్థమయ్యేలా ప్రత్యేక సీక్రెట్ భాషను వాడుతుంటారు. ఫారంలో అన్ని పూర్తిచేశాక ‘ఫలానా నంబర్ కౌంటర్ దగ్గరికి వెళ్లండి.. పని పూర్తవుతుంది’ అంటూ చెబుతారు. ఆయా దరఖాస్తుల వెనుకభాగంలో పెన్సిల్‌తో ‘సీక్రెట్ కోడ్’ రాసి ఇస్తుంటారు. ఇది సిబ్బంది, ఆ మధ్యవర్తికి మాత్రమే అర్థమవుతుంది. ఆ సంకేతం ఆధారంగా దస్త్రం వేగంగా కదులుతుందనే అరోపణలున్నాయి. దొంగ సర్టిఫికెట్లు ఉన్నా ఏజెంట్ల అండ ఉంటేనే దస్త్రం ముందుకు వెళ్తుంది. ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం తగ్గించడానికి ఇటీవల ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో కృత్రిమ మేధ (ఏఐ) సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇవి వారిని కట్టడిచేయడంలో ఏమాత్రం ప్రభావం చూపకపోవడం గమనార్హం.

**ఫిర్యాదుల మేరకే తనిఖీ-** ఆనంద్‌కుమార్, డీఎస్పీ, ఏసీబీ, రంగారెడ్డి రేంజ్ “ఉప్పల్ రావాణా శాఖ కార్యాలయ పరిధిలో దళారుల కేంద్రంగా దందా జరుగుతుందని అనేక ఫిర్యాదులందాయి. వారి సహకారంతో అవకతవకలు జరుతున్నాయని తెలిసింది. ఆకస్మికంగా తనిఖీలు చేపట్టాం. సిబ్బందిని విచారిస్తున్నాం. దళారుల ఫోన్లలో ఎక్కువ సమాచారం ఉంది. వారితో అధికారుల సంబంధాలపై ఆరా తీస్తున్నాం.”

## చీకటి చీల్చి.. చింతలు తీర్చి!



హైదరాబాద్: ఆ యువతి.. జీవితంపై ఎన్నో ఆశలతో బీఎస్సీ, బీఈడీ పూర్తిచేసి ప్రైవేటు టీచర్‌గా చేరింది. పెళ్లి చేసుకుని ఓ చిన్నారికి జన్మనిచ్చింది. జీవితం సాఫీగా సాగుతున్న వేళ విధి ఆమెపై పగపట్టింది. నెమ్మదిగా కంటిచూపు తగ్గడం మొదలైంది. ఆసుపత్రికి వెళ్తే రెటీనా డిటాచ్‌మెంట్ జరిగినట్లు వైద్యులు చెప్పారు. చికిత్సలతో ఫలితం లేకపోయింది. చూపు బాగా మందగించి పాఠాలు బోధించలేని పరిస్థితి. అండగా నిలవాల్సిన భర్త వదిలేశాడు. చివరికి చికిత్సలు అందించిన ఆసుపత్రే ఆమెకు అండగా నిలిచింది. జీవితంలో నిలదొక్కుకునేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చింది. ఇప్పుడామె తనలాంటి అంధులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తూ ఉపాధి పొందుతోంది. అలా ఎంతోమంది అభాగ్యులకు ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్(ఎల్వీపీఈఐ)లో భరోసా దొరుకుతోంది. అంధత్వంతో బాధపడుతున్న వారికి ఎల్వీపీఈఐ నేత్ర చికిత్సలే కాదు.. తమ కాళ్లపై తాము నిలబడేలా తోడ్పాటు అందిస్తున్నారు. ఇప్పటికే వందలాది మంది పూర్తి, పాక్షిక అంధులు శిక్షణ తీసుకుని కొత్త జీవితానికి బాటలు వేసుకున్నారు. ఈ క్రతువులో 1,800 మంది స్వచ్ఛందంగా భాగస్వాములుగా ఉన్నారని ఇన్‌స్టిట్యూట్ ఫర్ విజన్ రీహాబిటేషన్ విభాగాధిపతి డా.బ్యూలా క్రిస్టీ తెలిపారు. పేదలకు చికిత్స, శిక్షణ ఉచితమని, ఖర్చు భరించగలిగే వారికి నామమాత్రపు ఫీజు తీసుకుంటామన్నారు.

**సొంతంగా వంట చేసేలా..**

అంధులు సొంతంగా వంట చేసుకునేలా శిక్షణ ఇస్తున్నారు. గ్యాస్ స్టవ్ వెలిగించడం నుంచి కూరగాయలు తురమడం, పాత్రలు శుభ్రం చేయడం, వంట గదిలో ఎక్కడ ఏ సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలి.. తదితరాలన్నీ నేర్పిస్తున్నారు.

**ఆధారపడాల్సిన అవసరం లేకుండా..**

స్మార్ట్‌ఫోన్‌లో యాప్‌ల సహాయంతో పుస్తకాలు చదవడం, ఎదుట ఉన్నవారు పురుషులా, స్త్రీలా, ఏ రంగు దుస్తులు వేసుకున్నారో తెలుసుకోవటం వంటివన్నీ అంధులు చేసేలా శిక్షణ ఇస్తున్నారు. 30 రకాల యాప్‌లను ఎలా ఉపయోగించాలి.. బస్సులు, మెట్రో, ఉబర్, వోలా లాంటివి ఉపయోగిస్తూ ఎలా ప్రయాణించాలి.. ఈ-కామర్స్ సైట్లలో వస్తువుల కొనుగోలు తదితరాలన్నీ నేర్పిస్తారు.

**ఉపాధి పొందేలా కంప్యూటర్ కోర్సులు..**

అంధులు జీవితంలో నిలదొక్కునేలా కంప్యూటర్ విజ్ఞానం అందిస్తున్నారు. కీబోర్డు వాడకం మొదలుకుని వివిధ సాఫ్ట్‌వేర్ల వరకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే 3వేల మందికి శిక్షణ ఇచ్చారు. వారిలో కొందరు పలు కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు.

**డిజిటల్ లైబ్రరీతో అండగా...**బ్రెయిలీ లిపి అందుబాటులో ఉన్నా అన్ని పుస్తకాలు చదవడం సాధ్యం కాదు. అంధ విద్యార్థులకు ఎల్వీపీఈఐ డిజిటల్ లైబ్రరీని నిర్వహిస్తోంది. అన్ని రకాల పుస్తకాలను ఆడియోల రూపంలో డిజిటలైజ్ చేస్తోంది. ఉద్యోగులు, విద్యార్థులు శని, ఆదివారాల్లో వచ్చి పుస్తకాలు చదువుతూ ఆడియో రికార్డు చేస్తున్నారు. ఇలా 11 భాషల్లో ఆడియో బుక్స్ తయారుచేసి దేశవ్యాప్తంగా పంపిణీ చేస్తున్నారు. స్వయంఉపాధి మార్గాల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. సేవలు పొందేందుకు, వాలంటీర్లుగా పనిచేసేందుకు 040-68102823, 23548271లో సంప్రదించవచ్చు.

## సూర్యాపేట ఠాణా.. మజాకా..!



సూర్యాపేట : సూర్యాపేట ముత్యాలమ్మగుడి సమీపంలోని సారగండ్ల రంగయ్య ఇంట్లో మే 31న రాత్రి చోరీ జరిగింది. దుండగులు ఐదు తులాల బంగారం, డెబ్బై తులాల వెండి, ట్యాబ్, సెల్‌ఫోనుతోపాటు నగదును ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితులు పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనుమానిత వ్యక్తిని ఒకసారి విచారించి వదిలేశారు. ఠాణాలో సరైన సమాధానం చెప్పేవారు లేరని బాధితులు వాపోతున్నారు.

**నెలన్నరగా ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగానే..**

పట్టణంలో ఇన్‌స్పెక్టర్ పోస్టు నెలన్నరగా ఖాళీగా ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు, డీఎస్పీ పార్థసారథి నకిలీ వైద్యుడి నుంచి లంచం డిమాండ్ చేసి ఈ ఏడాది మే 12న ఏసీబీ అధికారులకు చిక్కిన విషయం విదితమే. ఉన్నతాధికారులు నూతన డీఎస్పీగా ప్రసన్నకుమార్‌ను నియమించగా.. ఇన్‌స్పెక్టర్ విషయంలో ఇంకా తేలలేదు. ప్రస్తుతం గ్రామీణ సీఐ రాజశేఖర్ పట్టణ ఇన్‌స్పెక్టర్‌గా ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒకవైపు గ్రామీణ స్మీఐగా..మరోవైపు వన్, టూ టౌన్ ఠాణాలకు ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తుండటంతో బాధితులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే నూతన ఇన్‌స్పెక్టర్‌ను నియమించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.

**సేవలు అంతంత మాత్రమే...**

సూర్యాపేట జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటి నుంచి శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అందుకు తగినట్లుగానే శివారు కాలనీలు విస్తరిస్తున్నాయి. ప్రభుత్వం ఇక్కడ గతంలోనే టూటౌన్ ఠాణాను మంజూరు చేసినా.. అది కాగితాలకే పరిమితమైంది. ఇందుకోసం ప్రత్యేకమైన భవనం ఏర్పాటు చేయలేదు. వన్ టౌన్‌లో ఉన్న సిబ్బందినే వేరు చేసి టూటౌన్‌కు కేటాయించారు. రెండు ఠాణాలకు ఒకే ఇన్‌స్పెక్టర్ ఎస్‌హెచ్‌వోగా పనిచేసే వారు. అతనూ అనిశాకు పట్టుబడటంతో సమస్య తీవ్రమైంది. వాస్తవంగా రెండో ఠాణాను ప్రత్యేకంగా మరోచోట ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ఎస్‌హెచ్‌వోను నియమించాల్సి ఉంది.

మరోవైపు జనాభా లక్షాయాభై వేలకు మించిపోయినట్లు అంచనా.. భార్య, భర్తల పంచాయితీ, బాధితుల తాకిడి నిత్యకృత్యంగా ఉంటోంది. ఒక మహిళా ఠాణానూ ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటితోనూ ప్రజలకు సరైన సేవలు అందడం లేదు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి సూర్యాపేటకు మెరుగైన పోలీసు సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఆ ఇద్దరి హవా

జిల్లా కేంద్రంలో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు దీర్ఘకాలికంగా పనిచేస్తూ ఠాణాకు వచ్చే బాధితుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అక్కడి అధికారులను సైతం వీరి కనుసన్నల్లోనే నడిపిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎస్‌హెచ్‌వో లేకపోవడంతో వీరి ఆగడాలు మరింత పెరిగిపోయినట్లు తోటి సిబ్బంది చర్చించుకుంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

జిల్లా కేంద్రంలోని ఇన్‌స్పెక్టర్ నియామక విషయంలో ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇక్కడ ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. త్వరలోనే ఇన్‌స్పెక్టర్ నియామకం పూర్తవుతుంది. అవినీతికి పాల్పడినట్లు తేలితే ఎంతటి వారినైనా ఉపేక్షించేంది లేదు. మహిళా ఠాణా విషయంలోనూ ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంటుంది. నరసింహ, ఎస్పీ, సూర్యాపేట

## పేదల గూడు.. పట్టదా గోడు

హుజూరాబాద్ : పేదల సొంతింటి కల నెరవేర్చాలని గత భారాస ప్రభుత్వం నిరుపేదలకు రెండు పడకల గదుల ఇళ్లు నిర్మించింది. చాలా చోట్ల ఇవి నిర్మించి ఏళ్లు గడుస్తున్నా పంపిణీ చేయలేదు. మరికొన్ని చోట్ల నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయా యి. నిర్మించిన వాటిని పంపిణీ చేయాలని చాలామంది భావిస్తున్నారు. వారి సొంతింటి కల అందని ద్రాక్షగానే మిగిలిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

**నిర్మించి ఏళ్లు గడుస్తున్నా..**

హుజూరాబాద్ శివారులోని గణేష్‌నగర్ కాలనీలో రెండు పడకల గదుల ఇళ్లు నిర్మించారు. మొత్తం 952 గృహాలు మంజూరుకాగా 13 బ్లాకుల్లో 500 గృహాలను నిర్మించారు. కానీ నేటికీ ఒక్క ఇంటిని కూడా పంపిణీ చేయలేదు. ఈ ఇళ్ల కోసం పలువురు అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. నిర్మించి ఏళ్లు గడవడం,



ఉపయోగించకపోవడంతో నిర్మానుష్యంగా మారాయి. రాత్రి సమయాల్లో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని పలువురు చర్చింకుంటున్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరైనా రెండు పడక గదులవైపు కన్నెత్తి కూడా చూడడం లేదని, పేదల గోడును పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.**దరఖాస్తు తీసుకున్నారు..**

రెండు పడకల గదుల కోసం చాలా ఏళ్లుగా నిరీక్షిస్తున్నాం. అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలను అందించాం. దరఖాస్తులు తీసుకున్నారే తప్పా, ఇంతవరకు పంపిణీ చేయలేదు. ఎప్పుడు పంపిణీ చేస్తారో కూడా తెలియని పరిస్థితి. అధికారులు స్పందించి గృహాలను పంపిణీ చేయాలి గుర్రాల రాజకుమారి, హుజూరాబాద్

**జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం**

రెండు పడకల గదుల ఇళ్ల పంపిణీ ప్రతిపాదనను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. చాలామంది దరఖాస్తులు అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపిణీ చేస్తాం. అర్హులైన నిరుపేదలకు అందేలా చూస్తాం.కనకయ్య, హుజూరాబాద్ తహసీల్దార్

## అక్కడ దాడులు... ఇక్కడ షట్టర్ డౌన్

నీలగిరి : రవాణా శాఖ కార్యాలయాల్లో ఏజెంట్ల పేరుతో ఆగడాలు మితిమీరిపోతున్నాయని వచ్చిన ఫిర్యాదులపై గురువారం హైదరాబాద్‌లోని పలు రవాణాశాఖ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. పదుల సంఖ్యలో ఏజెంట్లను, సిబ్బందిని పట్టుకొని విచారిస్తున్నారు. ఏసీబీ దాడుల విషయం మీడియాలో రావడంతో జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో ఏజెంట్లు తమ కార్యాలయాలు మూసి వేశారు. అధికారులు తమను ఇబ్బందులు పెడుతున్నారని.. దీనికి నిరసనగా తాము కార్యాలయాలను మూసి వేస్తున్నామని చెప్పి పలాయానం చిత్తగించారు. వాస్తవానికి హైదరాబాద్‌లో జరిగిన దాడులు ఇక్కడ కూడా జరిగే అవకాశం ఉందని.. అందుకే ముందస్తుగా ఏజెంట్లు అంతా మూకుమ్మడిగా తమ కార్యాలయాలను మూసివేసి



అక్కడి నుంచి మాయం అయ్యారని పలువురు చర్చించుకుంటున్నారు.

**అధికారులు సహకరించడం లేదనే..**

రవాణా శాఖలో అనేక మంది ఏజెంట్లుగా పనిచేస్తున్నా అధికారికంగా ఎవరికీ అనుమతి లేదు. వాహనదారులు నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎలా చేయాలో తెలియక.. సంబంధిత అధికారుల వద్దకు వాహనదారుడు నేరుగా వస్తే ఏదో ఒక వంకతో తిప్పుతుంటారు. దీంతో బాధితుడు చేసేది లేక ఏజెంటును సంప్రదించడం పరిపాటిగా మారింది. కార్యాలయంలోని అధికారులు కొందరి పనులు చేసి మరికొందరి పనులు చేయకపోవడంతో ఏజెంట్ల మధ్య మనస్పర్థలు పెరిగి పైఅధికారులపై ఏసీబీకి ఫిర్యాదులు చేసుకున్నట్లు తెలిసింది. తాజాగా ఏసీబీ దాడులతో ఏజెంట్లు తమ కార్యాలయాలు మూసివేసి తోకముడిచారు. వాహనదారుల సమస్యను పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపితే ఏజెంట్ల అవసరం ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## నమ్మకమే.. పెట్టుబడిగా..!

భువనగిరి: సర్కారు బడులపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో గత రెండేళ్లుగా ప్రవేశాల సంఖ్య పెరుగుతోంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, ఏటేటా సాధిస్తున్న ఉత్తమ ఫలితాలతో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రవేశాలు పెంచేందుకు విద్యాశాఖ అమలు పరుస్తున్న వినూత్న కార్యక్రమాలు, ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి నేడు ఫలితాలు వస్తున్నాయి. ప్రతి ఏటా వందల సంఖ్యకు పరిమితం అయ్యే ప్రవేశాల సంఖ్య గత రెండేళ్లుగా వేల స్థాయికి చేరుకోవడం గమనార్హం. ప్రస్తుత విద్యాసంవత్స రంలో జిల్లా పరిధిలో మూతపడిన ఏడు పాఠశాలలు మళ్లీ తెరుచుకోవడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రులు, విద్యార్థుల్లో నమ్మకం కలిగించేందుకు ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి అనుగుణంగా బోధన, సౌకర్యాలు కల్పిస్తోంది. డిజిటల్ తరగతుల నిర్వహణ, ఏటేటా ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇస్తూ వారి బోధనా సామర్థ్యాలను పెంచుతుండటంతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి. ప్రత్యేక తరగతుల నిర్వహణ, మేలుకొలుపు వంటి కార్యక్రమాలు జిల్లాను పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లాకు ఏడో స్థానం దక్కింది. ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల పేరిట పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం అంశాలు ప్రవేశాలపై ప్రభావితం చేశాయి. పెరిగిన ప్రవేశాల సంఖ్యను వచ్చే ఏడాది మరింతగా పెరిగే దిశగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు చొరవ చూపిన పక్షంలో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింతగా నమ్మకం పెరిగి సర్కారు పాఠశాలలకు పూర్వవైభవం సంతరించుకునే అవకాశం ఉంది.

చురకలు



## కోట్లు వెచ్చించినా దుర్వాసనే

కోరుట్ల : పట్టణం మధ్యనున్న ప్రధాన చెరువును మినీట్యాంక్ బండ్‌గా అభివృద్ధిచేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించారు. 9 ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో మురుగు కూపంలా తయారై దుర్వాసన వెదజల్లుతోంది. చెరువు పరిసరాలలో నివసించే ప్రజలు దుర్గంధంతో ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని మద్దుల చెరువును మినీట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం రూ.3.20 కోట్లు కేటాయించగా 25.04.2016లో అప్పటి నీటిపారుదలశాఖమంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పనులు ప్రారంభించారు. చెరువులో పూడికతీసి, కట్ట ఎత్తుపెంచారు. కట్టపై సిమెంట్‌రోడ్, మత్తడి, కట్టపై ఇనుప రెయిలింగ్, గేట్‌లను ఏర్పాటు చేశారు. వీటితోపాటు కట్టపై ఇతర కట్టడాలు, అభివృద్ధి పనులు చేపట్టారు. నిధులు సరిపోకపోవడంతో 2019లో టీయూఎఫ్‌ఐడీసీ కింద రూ.3.55 కోట్లు కేటాయించారు. పైప్రాంతం నుంచి వచ్చే మురుగు నీరు చేరకుండా ప్రత్యేక కాలువల నిర్మాణం, కట్టపై స్వాగతతోరణం, చెరువులో బోట్ల ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటివరకు పనులు పూర్తిచేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు.

**కప్పేసిన గుర్రపుడెక్క**

మద్దుల చెరువు(మినీట్యాంక్ బండ్)లో పైప్రాంతంలోని కాలనీల నుంచి వచ్చే మురుగు చేరడంతో గుర్రపుడెక్క భారీగా పెరిగి చెరువుంతా విస్తరించింది. గతేడాది పురపాలక సంఘం నిధులు రూ.14 లక్షలు వెచ్చించి గుర్రపుడెక్కను తొలగించారు. తర్వాత చెరువులోకి మురుగు నీరు రావడంతో మరోమారు పూర్తిగా గుర్రపుడెక్క కప్పేసింది.



కొన్నిరోజులుగా పట్టణంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో పైనున్న కాలనీల నుంచి వర్షపు నీరంతా చెరువులోకి చేరుతుండటంతో మత్తడి దూకుతోంది. చెరువు పరిసరాల్లోని చిన్నతోటవాడ, అయిలాపూర్‌రోడ్, ప్రకాశంరోడ్, ఆదర్శనగర్ కాలనీలకు దుర్గంధం వెదజల్లడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు వాపోతున్నారు.

**నిధుల దారి మళ్లింపు**

ఏఖీన్‌పూర్ స్తంభాల చెరువు నిండిన తర్వాత నీరు గొలుసుకట్టు కాలువ ద్వారా కంచరకుంటలోకి తర్వాత మద్దుల చెరువు(మినీట్యాంక్ బండ్)లో వచ్చి చేరుతోంది. ఏటా మద్దుల చెరువులో సమృద్ధిగా నీరు చేరడంతో చెరువు కళకళలాడేది. కొన్నేళ్లుగా మద్దుల చెరువు పైప్రాంతంలో ఆదర్శనగర్, ముత్యాలవాడ, రాంనగర్, బిలాల్‌పురా, ఏసుకోనిగుట్ట, అర్బన్‌కాలనీలు వెలిశాయి. కాలనీలో ఇళ్ల నుంచి వెలువడే మురుగు నీరంతా వచ్చి మద్దుల చెరువులో చేరి మురుగు కూపంలా తయారైంది. పైనుంచి వచ్చే మురుగు నీరు చేరకుండా ప్రత్యేక కాలువలు నిర్మించేందుకు టీయూఎఫ్‌ఐడీసీ నిధుల్లోంచి సుమారు రూ.2 కోట్లకుపైగా కేటాయించారు. చెరువు పైప్రాంతంలోని భూముల యజమానుల, స్థిరాస్తి వ్యాపారుల ఒత్తిడితో మురుగు కాలువను నిర్మించకుండా నిధులను దారి మళ్లించారు.

విస్తీర్ణం 29.28 ఎకరాలు
ఎఫ్‌టీఎల్ 50.11 మీటర్లు
బఫర్‌జోన్ 30 మీటర్లు

## సర్కారు కళకళలాడేలా.. బాలలందరూ బడికొచ్చేలా..!

చౌటుప్పల్ : సర్కారు బడులను పిల్లలతో కళకళలాడేలా చేసేందుకు చౌటుప్పల్ మండలంలోని కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. మిగతా పాఠశాలలకు భిన్నంగా పని చేస్తున్నారు. గ్రామ ప్రజలను భాగస్వాములను చేస్తున్నారు. దాతల సహకారం పొందుతున్నారు. సమష్టి కృషితో నాణ్యమైన విద్యనందిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే పిల్లలందర్నీ ప్రభుత్వ బడిబాట పట్టించేందుకు వ్యూహాలు రూపొందిస్తున్నారు.

పాఠశాలకు యూట్యూబ్ ఛానల్..తంగడపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నారు. బడిలో నిర్వహించే వినూత్న కార్యక్రమాలను తమ పాఠశాల ఛానల్ ద్వారా ప్రజలందరికీ తెలియజేస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడిగా విధుల్లో చేరిన ప్రసాద్ ఈ ఛానల్‌కు రూపకల్పన చేశారు. విద్యార్థులకు తన సొంత ఖర్చుతో గుర్తింపు కార్డులు తయారు చేయించారు. అయిదుగురు ఉపాధ్యాయులు కలిసికట్టుగా పనిచేస్తూ విద్యార్థుల్లో భాషా నైపుణ్యం పెంచేందుకు ప్రార్థన సమావేశంలో హరివిల్లు పేరుతో కథలు చెప్పిస్తున్నారు. మంచు లక్ష్మి ఫౌండేషన్ ద్వారా స్మార్ట్ తరగతిని, దాతల సహకారంతో డిజిటల్ తరగతులను నిర్వహిస్తూ 111 మంది విద్యార్థులకు వినూత్న బోధనను అందిస్తున్నారు. గురుకుల ప్రవేశ పరీక్షకు ప్రత్యేక శిక్షణనిస్తున్నారు.

**తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ..**

కొయ్యలగూడెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను విద్యార్థులను ఆకట్టుకునేలా చూడముచ్చటగా ముస్తాబు చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలను తలదన్నేలా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రధానోపాధ్యాయుడు మేడి యాదయ్య నేతృత్వంలో ఉపాధ్యాయులు కృషి చేస్తుండడంతో 123 మంది విద్యార్థులు ఇక్కడ చదివేందుకు ఉత్సాహంగా వస్తున్నారు. విద్యార్థులకు పాటలతోపాటు క్షేత్ర పర్యటనలకు తీసుకెళ్తున్నారు. ప్రతి వారం పరీక్షలు నిర్వహించి మూల్యాంకనం చేసి విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి ప్రత్యేక శిక్షణనిచ్చి ప్రోత్సహిస్తున్నారు. డిజిటల్ తరగతుల్లో దృశ్య, కృత్యాధారంగా బోధన చేస్తున్నారు. నోష్ ల్యాబ్ సహకారంతో ఇద్దరు విద్యా వాలంటీర్లను నియమించుకున్నారు.

**ఇతర గ్రామాల నుంచి ఆటోల్లో..**

ఆరెగూడెం గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో పన్నెండేళ్ల క్రితం 30 మంది విద్యార్థులుండేవారు. ఇప్పుడు 137 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాల మూతబడే పరిస్థితి రాగూడదని అప్పట్లో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన బత్తుల దశరథ గ్రామస్థుల, దాతల సహకారంతో కృషి చేశారు. ఎక్కడా లేని విధంగా ఈ పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ పూర్వ ప్రాథమిక విద్యను డీఈవో అనుమతితో ఆంగ్ల మాధ్యమంలో ప్రారంభించారు. ఇద్దరే ఉపాధ్యాయులతో బోధన సక్రమంగా జరగదని గుర్తించి పరిసరాల్లో ఉన్న దివిస్, నైల్, సౌభాగ్య పరిశ్రమల సీఎస్సార్ నిధితో అయిదుగురు విద్యా వాలంటీర్లను నియామకం చేయించుకున్నారు. డిజిటల్ తరగతులు ప్రవేశపెట్టారు. నాణ్యమైన విద్యను అందిస్తుండడంతో ఏటికేడు విద్యార్థుల సంఖ్య 137కు పెరిగింది.

## కమిషనర్ నిర్ణయం.. బల్దియాకు భారం




హైదరాబాద్: "వీధి దీపాల నిర్వహణను ప్రైవేటుకు అప్పగించాం. ఖాళీగా ఉన్న ఎస్ఈ (సూపరింటెండెంట్ ఇంజినీరు) పోస్టును భర్తీ చేసుకుంటే సరిపోతుంది. మిగిలిన ఖాళీలను ప్రస్తుతమున్న ఇంజినీర్లతో సర్దుబాటు చేసుకోవచ్చు. ఇంజినీర్లు వెళ్లి లైట్లను బిగించరు. స్విచ్చులు వేయడం, ఆపేయడం ఏజెన్సీ పని. మన ఇంజినీర్లతో పోలిస్తే విద్యుత్తుశాఖ ఇంజినీర్ల జీతం రెండు, మూడు రెట్లు ఉంది. అంతంత జీతాలు ఇచ్చి.. నామమాత్రపు పని కోసం వారిని జీహెచ్ఎంసీకి డిప్యుటేషన్‌పై తీసుకోవాల్సిన అవసరం లేదు."అని రెండు నెలల కిందట ముగ్గురు అదనపు కమిషనర్లతో ఏర్పాటైన కమిటీ తీర్మానించింది. ఆ నిర్ణయాన్ని అప్పటి కమిషనర్ ఇలంబర్తి అంగీకరించారు. నెల క్రితం కొత్త కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఆర్.వి.కర్ణన్ ప్రారంభంలో కమిటీ నిర్ణయంతో ఏకీభవించినా తర్వాత ఆయన నిర్ణయం మారింది. ఒక ఎస్ఈ, ఐదుగురు ఈఈలు, 28 మంది డీఈలు, 70 మంది ఏఈలను కలిపి 104 మంది ఇంజినీర్లను జీహెచ్ఎంసీకి కేటాయించాలంటూ విద్యుత్తుశాఖకు లేఖ రాశారు. ఈ నిర్ణయంతో బల్దియా ఖజానాపై ప్రతి నెలా జీతాల రూపంలో రూ.2.5కోట్ల భారం పడనుంది. జీతాల భారం భరించలేక గత కమిషనర్లు కూడా పలువురు విద్యుత్తు శాఖ ఇంజినీర్లను వారి మాతృసంస్థకు పంపించారు.

**రూ.1,200 కోట్లతో ప్రైవేటు సంస్థకు!...** వీధి దీపాల నిర్వహణను జీహెచ్ఎంసీ 2017లోనే ప్రైవేటుకు అప్పగించింది. ఏప్రిల్, 2025 వరకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ ఆ పనిని నిర్వహించింది. అందుకుగాను జీహెచ్ఎంసీ ఆ సంస్థకు రూ.వందల కోట్ల రుసుం చెల్లించింది. ఇప్పుడు మరింత పెద్ద సంస్థకు అప్పగించాలని కమిషనర్ నిర్ణయించారు. ఆయన రూపొందించిన విధానం అమలు చేయాలంటే దాదాపు రూ.1,200కోట్ల ఖర్చు అవుతుందని అంచనా. ఆ ప్రక్రియ పూర్తయితే.. గుత్తేదారు సంస్థనే అన్ని పనులు నిర్వర్తిస్తుంది. వెలుగుతోన్న లైట్లు ఎన్ని, వెలగనివి ఎన్ని అని చూసుకోవడమే జీహెచ్ఎంసీ పని.

**ఇసుజు వాహనాలతోనూ..**

జీహెచ్ఎంసీ వర్షాకాల అత్యవసర బృందాలు, సత్వర మరమ్మతు బృందాలకు 150 ఇసుజు వాహనాలను కేటాయించాలని కమిషనర్ తీసుకున్న నిర్ణయం కూడా విమర్శలకు తావిస్తోంది. ఇందుకు జీహెచ్ఎంసీ గతంలో ట్రాక్టర్లను ఉపయోగించేది. ట్రాక్టర్‌లో మూడు క్యూబిక్ మీటర్ల సరకును, వ్యర్థాలను తరలించేవారు. ఇసుజు వాహనం ట్రాలీలో ఒక క్యూబిక్ మీటరు వ్యర్థాలనూ తరలించలేరు. ట్రాక్టర్ అద్దెతో పోలిస్తే.. మూడింతలు అదనంగా చెల్లిస్తామంటూ సీటీఓ శ్రీనివాస్ టెండరు నోటిఫికేషన్ ఇచ్చారు. రెండు సంస్థలకు మాత్రమే టెండరులో పాల్గొనే అవకాశాన్ని సృష్టించారని, వారికి పోటీగా టెండరు వేయడంతో తమను సీటీఓ బెదిరించారని గుత్తేదారులు శనివారం ప్రకటన విడుదల చేశారు.

## సిబ్బంది కొరత.. నిఘా అంతంతే

కరీంనగర్ :కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)లో నియామకాలు చేపట్టి సుమారు ఎనిమిదేళ్లయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా 41 పోస్టులు అత్యవసరంగా భర్తీ చేయాల్సి ఉండగా అందులో 70 శాతం ఖాళీలు రాజధాని పరిధిలోనే ఉన్నాయి. సిబ్బంది కొరత, పనిభారం పెరగడంతో అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలను తగ్గించేశారు. తనిఖీలు సకాలంలో జరగకపోవడంతో పరిశ్రమల నిర్వాహకులు వ్యర్థాలను ఇష్టానుసారంగా డంప్ చేస్తున్నారు.

**రాజధాని పరిధిలో 3 పెట్రోలింగ్ వాహనాలే..**

రాత్రిపూట రసాయన ఘాటువాసనలు వెదజల్లే పరిశ్రమలు, హానికర వ్యర్థాలను జలాశయాలు, డ్రైనేజీల్లో వదిలే వారిపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత నైట్ పెట్రోలింగ్ సిబ్బందిపై ఉంది. కానీ తూతూమంత్రంగానే నిఘా ఉందన్న విమర్శలున్నాయి. పీసీబీ కేంద్ర కార్యాలయం, హైదరాబాద్, ఆర్సీపురం జోన్ కార్యాలయాల పరిధిలో ప్రస్తుతం 3 నైట్ పెట్రోలింగ్ వాహనాలు తిరుగుతున్నాయి. ఒక్కో వాహనంలో ఒక అనలిస్ట్, ఏఈ, ఈఈ స్థాయి అధికారులు, సెక్యూరిటీగార్డులు ఉంటున్నారు. వీరు రాత్రంతా తిరిగి.. గుర్తించిన పరిశ్రమలపై నివేదిక ఇవ్వాలి. దీనిపై 'పీసీబీ సభ్య కార్యదర్శి' సమీక్షించి సూచనలు, మార్గదర్శకాలు జారీ చేస్తారు. ఆశించిన స్థాయిలో నైట్‌పెట్రోలింగ్ సిబ్బంది నుంచి స్పందన లేదని, ఫిర్యాదు చేసిన 2గంటల తర్వాత బృందం అక్కడికి చేరుకుంటోందన్న విమర్శలున్నాయి. 5వేలకు పైగా పరిశ్రమలున్న రాజధాని పరిధిలో కనీసం 6-10 పెట్రోలింగ్ వాహనాలు అవసరం.

**గడువులోగా తేల్చేయాలి..:** పరిశ్రమల్లో గ్రీన్, ఆరెంజ్, రెడ్ కేటగిరీలుండగా.. గ్రీన్ కేటగిరీ పరిశ్రమకు వారం రోజుల్లో, ఆరెంజ్ పరిశ్రమకు 14రోజులు, రెడ్ కేటగిరీకి 21రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలి. గడువులోపే అనుమతివ్వడమా? రద్దు చేయడమా అనే నిబంధనలున్నాయి. కానీ అనుమతుల జారీకే 6 నెలల సమయం పడుతుందంటూ పరిశ్రమలవర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో నమోదయ్యే ఫిర్యాదులను పరిశీలించాలన్నా, ఆయా కార్యాలయాల్లోని పర్యావరణ ఇంజినీర్లు, అనలిస్టులు పరిశ్రమల్లో తనిఖీలుచేసి శాంపిళ్లను ల్యాబ్‌కు పంపి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ సిబ్బంది కొరతతో ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది.

**ప్రక్షాళన అవసరమే..**

23 ఏళ్లు.. 18 ఏళ్లు.. 16ఏళ్లు.. ఇలా ఒకేజోనల్ పరిధిలో ఒకే చోట పనిచేస్తున్న (హైదరాబాద్‌లో) అధికారులు 10 మంది ఉన్నారు. మిగిలిన వారు ఇక్కడికి రాకుండా, వీరు వెళ్లకుండా పైరవీలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. తాము చెప్పిందే వేదం అన్నట్టు ప్రవర్తిస్తూ కొన్ని పరిశ్రమలకు మేలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒకే వ్యక్తికి ఏళ్ల తరబడి ఒకే చోట పోస్టింగ్ ఇవ్వడం నిబంధనలకు విరుద్ధం అయినా ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం.

## అధికారుల నిర్ణయం.. చిన్నారులకు శాపం




కరీంనగర్ : జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల బలవంతపు తరలింపు ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో అర్హులైన లబ్ధిదారులకు పౌష్టికాహారం అందని ద్రాక్షలా మారుతుంది. సమీపంలో ఉన్న కేంద్రాలకు వచ్చి పోషకాహారం తీసుకునే గర్భిణులు, బాలింతలకు కేంద్రాల తరలింపు నిర్ణయం మింగుడు పడట్లేదు. ఇప్పటి వరకు తమ చిన్నారులను పూర్వ ప్రాథమిక విద్య కోసం ఇంటి దగ్గర్లో ఉన్న కేంద్రానికి పంపించే వారు. కానీ కేంద్రాల తరలింపుతో వారి హాజరు శాతం తగ్గిపోయే అవకాశముంది. ఈ నేపథ్యంలో కేంద్రాల తరలింపుపై జిల్లా వ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో ఎక్కడా అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఉండకూడదు. అద్దె భవనాల్లో ఉన్న కేంద్రాలను వెంటనే సమీపంలో ఉన్న ప్రభుత్వ, అద్దె చెల్లించనవసరం లేని సామాజిక భవనాల్లోకి మార్చాలని జిల్లా ఉన్నతాధికారి హుకుం జారీ చేశారు. నెల రోజులుగా ప్రతిరోజు ఎన్ని కేంద్రాలను మార్చారని ప్రగతి నివేదిక సమర్పించాలన్నట్లు సమాచారం. పైగా కొత్తగా మార్చుతున్న కేంద్రాల్లో 25 వాటిల్లో భవనాలను మరమ్మతు చేస్తే కానీ నిర్వహణకు ఉపయోగపడని పరిస్థితి ఉన్నట్లు తెలిసింది.

**పాఠశాలల్లో గదుల కొరత..**

కరీంనగర్ అర్బన్, గ్రామీణం, గంగాధర, హుజూరాబాద్ నాలుగు ప్రాజెక్టుల పరిధిలో 777 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 310 కేంద్రాలకు సొంత భవనాలున్నాయి. మిగిలిన వాటిలో నెల రోజుల కిందటి వరకు మరో 200 కేంద్రాలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, ఇతర సామాజిక భవనాల్లో ఉండగా, కొత్తగా మరో 65 కేంద్రాలను మార్చడానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు.

ఇవి పోగా మరో 202 కేంద్రాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. వాటన్నింటినీ మార్చాలని వస్తున్న ఒత్తిళ్లతో ఉద్యోగులకు పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ఒక్కో కేంద్రం ఎందుకు మార్చడానికి అవకాశం లేదో వివరాలను నమోదు చేసి నివేదికలు సమర్పిస్తున్నారు.

అందులో చాలా చోట్ల కేంద్రాలను రెండు కిలోమీటర్లకు దూరంగా మార్చడానికి సిద్ధపడ్డా.. ఆ మండల ఎంఈవోలు తమ పాఠశాల భవనాల్లో గదులు లేవని సమాధానం చెప్పినట్లు నివేదికలు సమర్పించారు.

తరలింపులో అలసత్వం వహిస్తే చర్యలు

కరీంనగర్ మంకమ్మతోట : మరో పది రోజుల్లో అద్దె భవనాల్లో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. శనివారం స్థానిక సుడా కార్యాలయంలో ఐసీడీఎస్, పలు శాఖల ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 63 అంగన్‌వాడీ కేంద్రాలను తరలించారని, మిగిలిన అన్ని కేంద్రాలను సైతం తప్పనిసరిగా తరలించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతితోపాటు పలు శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ ఇక సులభతరం...!

మిర్యాలగూడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ విధానం విజయవంతం కావడంతో రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నుంచి జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ ఏడాది మార్చిలో పైలట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లాలోని బీబీనగర్, చౌటుప్పల్, భువనగిరి కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయగా ఇక మీదట మిర్యాలగూడ, నల్గొండ, చండూరు, దేవరకొండ, నిడమనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుండటంతో దీనికి ప్రత్యామ్నాయంగా స్లాట్ బుకింగ్ విధానం అమలు చేస్తున్నారు.

**స్లాట్ బుకింగ్ సౌకర్యం ఇలా..**

రిజిస్ట్రేషన్ల శాఖ వారి పబ్లిక్ డాటా ఎంట్రీ సిస్టమ్‌లోని అధికారిక వెబ్‌సైట్‌లో స్లాట్ బుకింగ్ ప్రక్రియ ఉంటుంది. మరో వైపు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు స్లాట్ బుకింగ్ విధానంతో సమయం ఆదా కావడంతో పాటు, నకిలీ రిజిస్ట్రేషన్లకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చు రిజిస్ట్రేషన్ల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. స్లాట్ బుకింగ్‌లో ఉన్న సమయానికి కార్యాలయానికి వెళ్తే 15 నిమిషాల్లో పని పూర్తి చేసేలా 'డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ విధానం'



అమలు చేస్తున్నారు.సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునికీకరిస్తుండగా కృత్రిమ మేధ, చాట్ జీపీ విధానంతో మరింత సులువుగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసేలా సన్నాహాలు చేస్తున్నారు.

నిషేధిత జాబితాలోని భూములను రిజిస్ట్రేషన్లు చేయకుండా 'భూ భారతి' పోర్టల్ తరహాలో నిషేధిత ఆస్తుల సర్వే నెంబర్ల వివరాలను పొందుపరుస్తున్నారు. నిషేధిత జాబితాలోని భూములు రిజిస్ట్రేషన్ చేస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం వెళ్లే విధంగా సమాంతర వ్యవస్థను అభివృద్ధి పరుస్తున్నారు. స్లాట్ బుకింగ్ విధానంలో ఆన్‌లైన్‌లో స్కాన్ చేసిన డాక్యుమెంట్లను కొనుగోలు చేసే వారికి అదే రోజు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి ఏర్పాటు చేస్తున్నామని, ఎప్పటి నుంచి ప్రారంభించాలనే విషయం ఖచ్చితమైన తేదీ రాగానే స్లాట్ బుకింగ్ అమలు చేస్తామని జిల్లా రిజిస్ట్రార్ ప్రకాశ్ తెలిపారు.

## సొరంగ మార్గం తవ్వకాల్లో సందిగ్ధం!

దేవరకొండ : దేశంలో అతి పెద్ద సొరంగ మార్గపు ప్రాజెక్టు గా గుర్తింపు పొందిన శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ పథకం నిర్మాణ పనులు ఒక అడుగు ముందుకు పడితే మరో రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా సాగుతోంది. తాజాగా రూ.కోట్లు వెచ్చించి అమెరికా నుంచి ఎస్సెల్బీసీ సొరంగ మార్గం తవ్వకాలకు తెప్పించిన టన్నెల్ బోరింగ్ మిషన్‌తో పని చేయడం శ్రేయస్కరం కాదని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో టీబీఎం పరిస్థితి ఇక తెల్లగుర్రమేనా అనే సందేహం వ్యక్తం అవుతుంది.

**డ్రిల్లింగ్.. బ్లాస్టింగ్.. టీబీఎంతోనా..?**

శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ సొరంగం పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టాలు ఎక్కించేందుకు దోమలపెంటలోని ఇన్‌లెట్ వైపు నుంచి పనులు ప్రారంభించింది. ఇవి ప్రారంభమైన నాలుగు రోజులకే ఫిబ్రవరి 22న సొరంగం పైకప్పు కూలి ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ సమయంలో ఎనిమిది మంది జాడ నేటికీ బయటికి రాలేదు. ఈ క్రమంలో సమయం వృథా చేయకుండా మన్నెవారిపల్లిలోని ఎస్సెల్బీసీ ఔట్‌లెట్ ఏప్రిల్ 18న టీబీఎం బేరింగ్ ఇక్కడికి చేరుకోవడంతో మరికొన్ని విడి భాగాలను కెనడా నుంచి తెప్పించాల్సి ఉంది. ఈ సమయంలోనే ప్రభుత్వం జియో సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. శనివారం ఎస్సెల్బీసీ ఔట్‌లెట్ వద్దకు చేరుకొని అక్కడి పరిస్థితులు గమనించారు. సొరంగం పనులు టీబీఎంతో తవ్వకాలు అసాధ్యమని, డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో తవ్వకాలు చేపట్టాలని ఇప్పటికే ప్రభుత్వానికి సూచించారు. దీంతో ఎస్సెల్బీసీ టన్నెల్‌కు రూ.కోట్లు వెచ్చించి తీసుకొచ్చిన టీబీఎం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, ప్రభుత్వానికి ఆర్థిక భారంతో తెల్లగుర్రంలా మిగిలిపోతుందని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తం సొరంగం 43.93 కిలోమీటర్లు పొడవు కాగా ఇన్‌లెట్ వైపు నుంచి 13.93 కిలోమీటర్లు పూర్తయ్యింది. ఔట్‌లెట్ వైపు నుంచి 20.49 కిలోమీటర్లు తవ్వారు. మిగిలిన 9.53 కిలోమీటర్లు ఇంకా తవ్వాల్సి ఉండగా ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సొరంగం పనులు ఆలస్యంగా సాగుతున్నాయని పలువురు వాపోతున్నారు.**నిపుణుల కమిటీ చేరుకుంది : చక్రపాణి, డీఈ** ఎస్సెల్బీసీ ఔట్‌లెట్ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. టీబీఎంతో డ్రిల్లింగా లేదా బ్లాస్టింగ్‌తో డ్రిల్లింగా.. ఏది ఉత్తమం అనే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. టీబీఎంతో ఎంత వరకు పని చేయాలో అంత వరకు చేయాలా అనేది నిపుణుల కమిటీ చర్చిస్తుంది.

## మీనం..మౌనం

భానుపురి : జిల్లాలో మత్స్యకారులకు ఈ ఏడాది ఉపాధి కరవైంది. వర్షాకాలంలో సమృద్ధిగా వానలు పడి చెరువులు, కుంటలు నీటితో పరవళ్లు తొక్కాయి. కానీ గతంలో మాదిరిగా ఈసారీ ప్రభుత్వం చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదిలి ఉపాధి కల్పిస్తుందని భావించినా మత్స్యకారులకు నిరాశే మిగిలింది. వాటిని వదలకపోవడంతో మత్స్యకారుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.మత్స్యకారులు చెరువులు, కుంటల్లో చేపల వేట సాగిస్తూ ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో 1086 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో అనువైన చెరువులు 648 ఉన్నాయి. ప్రభుత్వం ఏటా వాటిలో వదిలేందుకు వందశాతం రాయితీపై ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసేది. 3 కోట్లకుపైగా పిల్లలను చెరువుల్లో వదిలేవారు. ఈ ఏడాది పంపిణీ చేసేందుకు మత్స్యశాఖ అధికారులు గుత్తేదారుల నుంచి టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో పూర్తిస్థాయిలో పంపిణీ కాలేదు. ఈ ఏడాది కేవలం 315 చెరువుల్లో 1.01 కోట్ల చేప పిల్లలను మాత్రమే వదిలారు.

జిల్లాలో ఈసారి చేపల ఉత్పత్తి తగ్గింది. గతేడాది 3.38 కోట్ల చేప పిల్లలు వదలగా.. ఈ సారి 1.01 కోట్లు మాత్రమే విడుదల చేశారు. ప్రభుత్వం మారటం.. గుత్తేదారులకు పెండింగ్ బిల్లులు ఉండటంతో ఎవరూ టెండర్లకు ముందుకు రాలేదు. దీంతో ఆలస్యం కారణంగా జిల్లాలో చేపల ఉత్పత్తి తగ్గింది. గతేడాది కంటే ఈసారి 2.37 కోట్ల మేర చేపల ఉత్పత్తి తగ్గింది. ఈసారి ఇంకా లక్ష్యం ఖరారు చేయలేదు. ప్రస్తుతం చేపల దిగుబడి అంతగా లేకపోవడంతో మత్స్యకారులు నష్టపోతున్నారు.ఉత్పత్తి పెంచుతాం..జిల్లాలో ఈసారి చేపల ఉత్పత్తిని పెంచుతాం. గతంలో కంటే అధికంగా విడుదల చేసేలా కృషి చేస్తాం. ప్రభుత్వం ఇంకా లక్ష్యం ఖరారు చేయలేదు. ఏమైనా ఆదేశాలు వచ్చిన వెంటనే నిత్యం నీరుండే చెరువులను ఎంపిక చేసి విడుదల చేస్తాం.నాగులు నాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి, సూర్యాపేట

చురకలు



# అలా వదిలేశారు!

కోటవురట్ల : మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రాలకు బూజుపడుతోంది. రూ. లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన కుట్టుమిషన్లు తుప్పుపట్టి పాడైపోతున్నాయి. జిల్లాలోని కోటవురట్ల, సబ్బవరం, చోడవరంలో ఒక్కోచోట రూ. కోటికిపైగా వెచ్చించి ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రూ. 80 వేల నుంచి రూ. లక్ష పైగా ఖరీదుగల కుట్టుమిషన్లను సుమారు 100 వరకు ప్రతి కేంద్రంలో పెట్టారు. దీనిలో పని చేయడానికి ముందుగా చదువుకున్న యువతులతోపాటు ఆసక్తి కలిగిన మహిళలను గుర్తించి నెల రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. ఆ తరువాత వారి నైపుణ్యానికి తగ్గట్టుగా, ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రంలో ఉపాధి కల్పించేవారు. కోటవురట్ల మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలోని ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రంలో కోటవురట్ల, నర్సీపట్నం, ఎస్.రాయవరం, ఎలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట, మాకవరపాలెం, నాతవరం మండలాల్లోని పలు గ్రామాలకు



చెందిన మహిళలు ఉపాధి పొందేవారు.

**అనుభవజ్ఞులకు లీజుకిచ్చినా..:** ప్రభుత్వం ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రాలను కొద్ది నెలలు నడిపి తరవాత టెక్స్‌టైల్ రంగంలో అనుభవం కలిగిన బెంగుళూరు, ఢిల్లీకు చెందిన వ్యక్తులకు ఈ కేంద్రాన్ని లీజుకు అప్పగించింది. వాళ్లు ఏడాది కాలం నడిపి, ఆశించిన రీతిలో లాభాలు రాకపోవడంతో అద్దె, విద్యుత్తు బిల్లు తగ్గిస్తే ఈ కేంద్రాన్ని నడుపుతామని.. లేకపోతే వదిలేస్తామని షరతులు పెట్టారు. అధికారులు అందుకు అంగీకరించలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రం నిరుపయోగంగానే ఉండిపోయింది. గోదాములో ఉన్న విలువైన కుట్టుమిషన్లు నిరుపయోగంగా మారి పాడైపోతున్నాయి. కేంద్రం నడపకపోవడంతో ఈ మండలానికి చెందిన మహిళలు అచ్యుతాపురంలో ఉన్న దుస్తుల కంపెనీలకు వెళ్లిపోతున్నారు.

**ఉన్నతాధికారులకు చెబుతున్నాం:** కోటవురట్లతోపాటు చోడవరం, సబ్బవరంలో ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రాలూ మూసే ఉన్నాయి. టెక్స్‌టైల్ రంగంలో అనుభవం ఉన్న వ్యక్తులు ఎవరైనా ముందుకొస్తే వారికి లీజుకు అప్పగిస్తాం. ఎలమంచిలిలో కేంద్రం తెరిపించి, మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. శచీదేవి, పీడీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

# ఐటీ రంగంలో మరో ముందడుగు

విశాఖపట్నం: గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఐటీ కంపెనీలు విశాఖను వదిలి వెళ్లిపోగా... కూటమి అధికారంలోకి వచ్చాక దిగ్గజ కంపెనీలు ఒక్కొక్కటిగా వెనక్కి వస్తున్నాయి.వైకాపా హయాంలో ఉత్తరాంధ్ర యువత ఉపాధి కోల్పోయి కొందరు చిన్నచిన్న పనులు చేసుకుంటుండగా.. ఇంకొందరు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి అవకాశాలపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. దీనికి కారణం ఇప్పటికే టీసీఎస్ రూ.1370కోట్ల పెట్టుబడితో 12వేల మందికి ఉపాధి కల్పించేలా విశాఖలో కార్యాలయం స్థాపనకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ కంపెనీకి ఐటీ హిల్స్-3లో 22 ఎకరాలు కేటాయింపు సైతం చేశారు.

'మా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచించేలా విశాఖలో క్యాంపస్ ప్రారంభిస్తున్నాం. మద్దతిచ్చిన ఏపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. సాంకేతికంగా అత్యున్నత ప్రతిభావంతులతోపాటు, విస్తృతస్థాయి మౌలిక సదుపాయాలతో రేపటి డిజిటల్ వర్క్ ఫోర్స్‌ను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో టైర్-2 నగరాల్లో బలమైన విశాఖను ఎంచుకున్నాం. ఈ పెట్టుబడి ద్వారా ప్రభావవంతమైన కెరీర్ అవకాశాలు సృష్టించాలని, ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడాలని ఎదురుచూస్తున్నాం' అంటూ కాగ్నిజెంట్ సంస్థ సీఈవో రవి కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు.

**8 వేల మందికి ఉపాధి:** కాగ్నిజెంట్ సంస్థకు కాపులుప్పాడలో 22 ఎకరాలు వీఎంఆర్డీఏ స్థలం కేటాయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు



నాయుడు ఆధ్వర్యంలో మంత్రి వర్గ ఆమోదం తెలిపింది. రూ.1583 కోట్ల పెట్టుబడులతో 8 వేల మందికి ఉపాధి కల్పించనుంది. మూడు దశల్లో క్యాంపస్ విస్తరించేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. తొలుత వచ్చే ఏడాది 800 మంది అసోసియేట్ సీటింగ్ సామర్థ్యంతో తాత్కాలిక కార్యాలయం ప్రారంభించనున్నారు. 2029లో మొదటి దశ క్యాంపస్ పూర్తయ్యే వరకు ఈ తరహాలోనే ఇక్కడ కార్యకలాపాలు సాగనున్నాయి.

**ఎవరేమన్నారంటే:** 'ఏపీని ప్రపంచ అగ్రగామి సంస్థలకు గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్న మా లక్ష్యానికి అనుగుణంగా కాగ్నిజెంట్ విశాఖకు రావడం స్వాగతిస్తున్నాం. కాగ్నిజెంట్ ఇక్కడ క్యాంపస్ ఏర్పాటు చేయడం ద్వారా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగవంత కావడంతోపాటు, భవిష్యత్ శ్రామికశక్తికి అవసరమైన నైపుణ్యాలను మెరుగు పరుస్తుంది' అని ఐటీ మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే ఎక్స్‌లో పోస్టు చేశారు.

గూగుల్ విశాఖలోని మధురవాడ వద్ద 80 ఎకరాల్లో డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. తాజాగా ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ కూడా విశాఖలో మూడు దశల్లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత తెలిపింది. 2024 నుంచి భువనేశ్వర్, ఇండోర్‌లలో కొత్త డెలివరీ కేంద్రాలతో పాటు, గుజరాత్‌లోని గిఫ్ట్ నగరంలో ఒక టెక్‌ఫిన్ కేంద్రాన్ని కాగ్నిజెంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారతదేశంలో 13 చోట్ల 3.36 లక్షల మంది ఉద్యోగులతో కాగ్నిజెంట్ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు గుర్తు చేశారు.

# కప్పిందెంత. కొట్టేసిందెంత?



అనకాపల్లి : వైకాపా ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో మెరక పేరుతో ఆ పార్టీ నేతలు కొందరు మేసేశారు. కొండ దిగువన, లోతట్టు ప్రాంతాలు, ఊరికి దూరంగా స్థలాలు ఇవ్వడంతో వాటిని చదును చేసేపేరు చెప్పి రూ. కోట్లను వెనకేసుకున్నారు. కొన్నిచోట్ల అరకొర పనులు చేసి... మొత్తం చేసినట్లు రాసి బిల్లులు చేసుకున్నారు. వీటిపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ సైతం చేపట్టింది. తాజాగా అనకాపల్లి జిల్లాలో 280కి పైగా లేఅవుట్లలో గ్రావెల్‌తో చేసిన పనుల్లో నాణ్యతను పరిశీలించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

**పది బృందాలతో విచారణ**

అనకాపల్లి జిల్లాలో మొత్తం 56 వేల మందికి 704 లేఅవుట్లలో పట్టాలు పంపిణీ చేశారు. ఇందులో 280కిపైగా లేఅవుట్లలో గ్రావెల్‌తో చదును పనులు చేశారు. ఇందుకు సుమారు రూ. 180 కోట్లకు పైగా ఖర్చు చేశారు. వాటిలో చాలావరకు గత ప్రభుత్వంలోనే బిల్లులు చేసుకున్నారు. ఇంకా కొంతమంది నేతలు తమకు బిల్లులు చేయాల్సి ఉందని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే చెల్లించిన సొమ్ము ఎక్కువగా ఉందని, అసలు క్షేత్రస్థాయిలో చేసిన పని, నాణ్యత చూసి నివేదిక ఇవ్వాలని గ్రామీణ నీటిసరఫరా, గృహనిర్మాణ సంస్థ, ఉపాధి హామీ విభాగాలకు ఆదేశాలందాయి. జిల్లాలో 10 బృందాలతో విచారణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఆయా లేఅవుట్లకు వెళ్లి నిజంగా గ్రావెల్‌తో చదును చేశారా? ఎం-బుక్ రికార్డు మేరకు జరిగిందా? ఈ గ్రావెల్ ఎక్కడ నుంచి తెచ్చారు అనేది నిగ్గుతేల్చనున్నారు. నిబంధనల మేరకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నా.. అవకతవకలు జరిగినట్లు గుర్తించినా తుది నివేదికను ప్రభుత్వానికి అందజేయాలి.

**అనుచరుల పేరుతో చదును:** అనకాపల్లి, మునగపాక, పాయకరావుపేట, ఎలమంచిలి, నర్సీపట్నం తదితర మండలాల్లో భారీగా లేఅవుట్లు వేశారు. భూముల కొనుగోలులో భారీగా అక్రమాలు జరిగాయి. అప్పటి ప్రజా ప్రతినిధులే తమ అనుచరుల పేరుతో చదును పనులు చేయించారు. గతంలో ఓసారి విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయగా.. భారీగా అక్రమాలు చేసినట్లు తెలుస్తోంది. అయినా.. అధికారం అడ్డుపెట్టుకుని అప్పటి నేతలు బిల్లులు చేసుకున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజిలెన్స్‌తో తనిఖీలు చేపట్టినా.. వాటి నివేదిక ఇంకా బయటపెట్టలేదు. ఇప్పుడు మళ్లీ ప్రత్యేక బృందాలతో మళ్లీ తనిఖీలు చేపడుతున్నారు.

దీనిపై జిల్లా జల యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణిమా దేవి వద్ద ప్రస్తావించగా.. కొంత మంది బకాయిలు కోసం న్యాయస్థానానికి వెళ్లడంతో వాటిని చెల్లించడానికి ఓసారి తనిఖీలు చేయాలని ప్రభుత్వం సూచించింది. జిల్లా ఉన్నతాధికారుల సూచనలతో తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు.

# సంద్రం లోతున.. వలకు చిక్కే 'ట్యూనా'...!



విశాఖ : విదేశీ మార్కెట్‌లో డిమాండ్... అధిక రాబడి... పోషక విలువలు మెండు... తదితర కారణాలతో 'ట్యూనా చేపల' వేటపై బోటు ఆపరేటర్లు దృష్టి సారిస్తున్నారు. విశాఖ చేపలరేవులో గతేడాదితో పోల్చితే ఈసారి 50 బోట్లు అదనంగా ట్యూనా చేపలవేటకు బయలుదేరి వెళ్లాయి. ట్యూనాల్లో కొమ్ముకోనాం, నెమలి కోనాం, అభిలాష, తదితర రకాలు లభ్యమవుతున్నాయి.

**విదేశాలకు ఎగుమతి..!**

శుద్ధి చేసిన ట్యూనాలు అమెరికా, థాయ్‌లాండ్, వియత్నాం, ఇతర యూరోపియన్ దేశాలకు అధిక సంఖ్యలో ఎగుమతి అవుతున్నాయి. దేశంలో అయితే కేరళ రాష్ట్రానికి ఎగుమతి అవుతుంటాయి. ఈ చేపల్లో ముళ్లు తక్కువగా ఉంటాయని, అధికశాతం ప్రొటీన్లు, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, విటమిన్స్ ఎక్కువగా ఉండటంతో డిమాండ్ పెరుగుతుందని జేడీ వివరించారు.

**ప్రత్యేక 'వలలు..బోట్లు'**

ఇక్కడి రేవులో 680 వరకు బోట్లు ఉంటే, దాదాపు 200పైగా బోట్లు 'ట్యూనాల' వేట సాగిస్తున్నాయి. ఆ చేపలు బరువుగా ఉండటంతో పాటు, డీప్ సీ(సముద్రంలో లోతైన ప్రదేశాలు)లో మాత్రమే దొరుకుతుంటాయి. దీంతో ఒక్కసారి వేటకు వెళ్లే బోట్లు కనీసం 20 నుంచి 25 రోజుల పాటు సముద్ర జలాల్లోనే ఉంటాయి. విశాఖ తీరం నుంచి బయలుదేరే మత్స్యకారులు.. ట్యూనాల కోసం పశ్చిమ బెంగాల్ సరిహద్దు వరకు వెళ్లి వేట సాగిస్తుంటారు.

**బోట్ల నిర్మాణ ఖర్చులో రాయితీ..!**

ఒక బోటు 20 రోజుల పాటు వేట సాగిస్తే 6 నుంచి 7 టన్నుల వరకు దిగుబడులు వస్తుంటాయని, కిలో ధర రూ.160 వరకు ఉంటుందని, వాటిని శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేస్తే ధర పెరిగే అవకాశాలు ఉన్నాయని మత్స్యశాఖ విశాఖ జిల్లా జేడీ పి.లక్ష్మణరావు తెలిపారు. ట్యూనాల వేటకు లాంగ్ లైన్ (హుక్ అండ్ లైన్) వలల్ని వినియోగిస్తారు. తీరం నుంచి 60 కిలోమీటర్ల లోపలకు వెళ్లి వేట సాగించాలి. 800 నుంచి వెయ్యి గాలాలు అవసరమవుతాయి. ప్రస్తుతం ఉన్న బోట్లను డీప్ సీ ఫిషింగ్‌కు అనుకూలంగా మార్చుకునేందుకు అయ్యే ఖర్చులో 40 శాతం వరకు రాయితీ లభిస్తుంది.

**ఇలా భద్రపరుస్తారు..!**

ట్యూనాలు పట్టుబడిన వెంటనే మెదడు, పేగులు, రెక్కలు, మొప్పలు, కళ్లు ఇతర భాగాలు తొలగించి, శుభ్రం చేస్తారు. ఆ తర్వాత బోట్లలో ఐస్‌తో నిండిన ప్రత్యేక గదుల్లో సున్నా డిగ్రీ ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేస్తారు. అలా చేప నాణ్యతను పరిరక్షిస్తే అధిక ధర దక్కుతుంది. సాధారణ బోట్లు, వలలతో 'ట్యూనాల' వేట సాధ్యం కాదు. వాటి కోసం పెద్ద సైజు వలలు, గాలం తాళ్లను సిద్ధం చేసుకోవాలి. వలలకు చిక్కిన వాటిని భద్రపరుచుకునేందుకు వీలుగా బోట్లను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ తరహా వేట సాగించే మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇస్తుండడంతో చాలా మంది అటువైపు దృష్టి సారిస్తున్నారు.

# పనుల వెనుక మతలబు ఏమిటో?



అగనంపూడి: అగనంపూడి టోల్‌గేట్ వద్ద కొనసాగుతున్న నిర్మాణ పనుల వెనుక పలు అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. మూసేసిన గేట్‌లో పక్కా నిర్మాణాలు ఎందుకు చేపట్టారన్న విషయం అంతుచిక్కడం లేదు. దీని నిర్వహణపై కోర్టులో కేసు నడుస్తుండగా నిర్మాణ పనులు చేపట్టడం ఊహాగానాలకు తావిస్తోంది. రెండు దశాబ్దాల క్రితం అనకాపల్లి- గాజువాక మధ్య జాతీయ రహదారిపై శివాజీనగర్ వద్ద టోల్‌గేట్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఇది నగర పరిధిలో ఉండకూడదన్న నిబంధన ఉన్నా పట్టించుకోకుండా ప్రజలపై భారం మోపుతూ వచ్చారు. దీనిపై స్థానిక ప్రజలు వివిధ స్థాయిల్లో ఆందోళనలు సాగిస్తూ వచ్చారు. 2018లో అప్పటి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హయాంలో కోర్టును ఆశ్రయించి టోల్‌గేట్‌ను మూయించేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో మళ్లీ తెరిచారు. 2024లో ప్రభుత్వం మారడంతో టోల్ వసూళ్లకు తెరపడింది.

**వసూళ్లకు ఒప్పుకోం...**

అగనంపూడి టోల్‌గేట్ సమస్య కోర్టు పరిధిలో ఉంది. కోర్టు నుంచి ఒకవేళ అనుకూలంగా తీర్పు వస్తే వెనువెంటనే వసూళ్లు ప్రారంభించేందుకే హైవే అధికారులు ఈ పునరుద్ధరణ పనులు చేపడుతున్నారా? అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ టోల్ నిర్వహణను ఒప్పుకోబోమని, మళ్లీ తెరిస్తే ఆందోళన చేపట్టి అడ్డుకుంటామని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

కూటమి హయాంలో స్థానికులు టోల్ నిర్వహణను అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర ఆందోళన కూడా సాగింది. తరువాత కౌంటర్లు తొలగించగా షెడ్డు అలాగే ఉండిపోయింది. పది నెలలుగా కార్యకలాపాలు నిలిచిపోగా ఇటీవల ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు టోల్‌బూత్ వద్ద రహదారి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఇరుపక్కలా స్లాబులు వేసి రహదారులను నిర్మిస్తున్నారు. దీంతో మళ్లీ టోల్‌గేట్ తెరిచేందుకే ఈ పనులు కొనసాగిస్తున్నా రని స్థానిక ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారులకు

**మరమ్మతులు చేస్తున్నాం:**

అగనంపూడి టోల్‌గేట్ వద్ద చేపట్టిన అభివృద్ధి పనులపై ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్‌రంజన్‌ను 'వివరణ కోరగా.. ఆయన ముక్తసరిగా సమాధానమిచ్చారు. ప్రస్తుతానికి ఇరుపక్కలా రహదా రులకు మరమ్మతు పనులు చేపట్టామన్నారు. టోల్‌గేట్‌ను మళ్లీ తెరిచేందుకే ఈ పనులు చేపట్టారా? అన్న ప్రశ్నకు సమాధానాన్ని దాట వేశారు.

# పాలకా.. సీటడుగుతోంది బాలిక

నంద్యాల : కోసిగి కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈ ఏడాది 160 దరఖాస్తులొచ్చాయి. 40 సీట్లు ఉండగా నాలుగు రెట్ల అధికంగా విద్యార్థినులు దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడ మొత్తం 280 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ప్రతి తరగతిలో నూతన ప్రవేశాల కోసం తల్లిదండ్రులు సంప్రదిస్తూనే ఉన్నారు." ఏటా మేము పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస పోతున్నాం. ఆడ పిల్లలను వెంట బెట్టుకుని వెళ్లలేం. అలాగని ఇంటి దగ్గర విడిచిపోలేం. కస్తూర్బా పాఠశాలల్లో చదువు, వసతి బాగుంటాయని చెబుతున్నారు. నా కూతురును చేర్పిద్దామని కోసిగి, పెద్దకడబూరు, గోనెగండ్ల పాఠశాలల్లో అడిగి చూస్తే సీట్లు లేవని చెబుతున్నారు. వలసపోయేటోళ్లను చూసి సీట్లను పెంచాలి.రామకృష్ణ, కోసిగి

కర్నూలు జిల్లాలో 26, నంద్యాలలో 27 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ) ఉన్నాయి. వీటిలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధిస్తున్నారు. ప్రతి తరగతికి 40 సీట్ల చొప్పున ఉన్నాయి. ఇలా ప్రతి విద్యాలయంలో 10వ తరగతి వరకు 200 సీట్లు, ఇంటర్మీడియట్‌కు 80 సీట్లు ఉన్నాయి. రక్షణ ఎక్కువగా ఉండటం.. బోధన బాగుండటంతో అమ్మాయిలను చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. సరిపడా సీట్లు లేకపోవడంతో వారికి నిరాశే ఎదురవుతోంది. చాలాచోట్ల నాలుగు రెట్ల దరఖాస్తులొస్తున్నాయి. 6 నుంచి 9వ తరగతి వరకు సీట్లు పెంచాలన్న డిమాండ్లు ఎక్కువయ్యాయి. కొందరు తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులతో సిఫార్సు చేయిస్తున్నారు.

**పశ్చిమాన డిమాండ్ ఎక్కువ**

పశ్చిమ ప్రాంతంలో కేజీబీవీల్లో చేరడానికి ఎక్కువమంది విద్యార్థినులు ఆసక్తి చూపుతున్నారు. ప్రత్యేకించి పెద్దకడబూరు, కౌతాళం, గోనెగండ్ల, తుగ్గలి, ఎమ్మిగనూరు, కోసిగి, నందవరం, మంత్రాలయం, హొళగుంద, హాలహర్వి, దేవనకొండ, కృష్ణగిరి మండలాల్లోని కేజీబీవీల్లో ప్రవేశాలకు ఎక్కువ డిమాండ్ ఉంది. పట్టణ ప్రాంతమైన ఎమ్మిగనూరులో ఈ ఏడాది 6వ తరగతిలో ప్రవేశాల కోసం 60 మంది దరఖాస్తు చేసుకున్నారు.నందికొట్కూరు, కోవెలకుంట్లలో కేజీబీవీలు లేవు. నందికొట్కూరు పట్టణంలో విద్యాలయం లేకపోవడంతో సమీప ప్రాంతాలైన జూపాడుబంగ్లా, మిడుతూరులో చేరేందుకు విద్యార్థినులు ప్రయత్నిస్తున్నారు.జిల్లా కేంద్రం నంద్యాలలో రెండు కేజీబీవీలు ఉండగా.. ఇక్కడ సీట్ల కోసం ఏటా ప్రజాప్రతినిధులు సిఫార్సు చేస్తున్నారు. గత ఐదేళ్లుగా నంద్యాలలో మరో కేజీబీవీ ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. లేదా రెండు కేజీబీవీల్లో సీట్లు రెట్టింపు చేయాలని విన్నవిస్తున్నారు.

**వలస జీవుల వెతలు**

ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాల్లో ఏటా పెద్ద సంఖ్యలో ప్రజలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. కుటుంబాలతో కలిసి వెళ్తుండటంతో బాలికల చదువు మధ్యలోనే ఆగిపోతోంది. దీంతో తల్లిదండ్రులు తమ కుమార్తెలను కేజీబీవీల్లో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాంతాల్లోని విద్యాలయాల్లో ప్రవేశాలు లేకపోవడంతో ప్రిన్సిపాళ్లు తల్లిదండ్రులను ఇతర పాఠశాలలకు వెళ్లేలా కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఇప్పటికే పశ్చిమ ప్రాంతంలో అన్ని కేజీబీవీల్లో సామర్థ్యానికి మించి విద్యార్థినులు ఉన్నారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 17, నంద్యాల జిల్లాలోని 22 కేజీబీవీల్లో అదనపు గదులను నిర్మిస్తున్నారు. ఇవి పూర్తయితే కొన్ని సీట్లు పెరిగే అవకాశం ఉంది.

**గత నెలలోనే ప్రవేశాలు పూర్తి**

ఉమ్మడి జిల్లాలోని 53 కేజీబీవీల్లో 10,600 మంది విద్యార్థినులు చదువుకునే అవకాశం ఉంది. ప్రతిచోటా మరికొందరికి ప్రవేశాలు కల్పించాలనే అభ్యర్థనలు వస్తున్నాయి. తల్లి, తండ్రి లేని విద్యార్థినులు, లేదా తల్లిదండ్రులిద్దరూ లేని బాలికలకు ప్రాధాన్యం ఇస్తారు. తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారు, నిరుపేద బాలికలకు అవకాశం కల్పిస్తారు.విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో సీఆర్పీలు ఆయా కేజీబీవీల పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించి అర్హుల జాబితాలను అందిస్తారు. వీరికి ప్రవేశాల్లో ప్రాధాన్యం ఇస్తారు. ఆ తర్వాత ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకున్న వారిని పరిగణనలోనికి తీసుకుని అర్హులను ఎంపిక చేస్తారు.

# స్మార్ట్‌గా వ్యవహరించాల్సిందే

కర్నూలు : ఇప్పుడంతా 'స్మార్ట్'కాలం. విద్యుత్తు వినియోగం లెక్కింపు కోసం స్మార్ట్ మీటర్లు వచ్చేశాయి.. సంబంధిత శాఖ ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు, బహుళ అంతస్తు భవనాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 67,000, నంద్యాల జిల్లాలో 66,800 మీటర్లను ఇప్పటికే అమర్చినట్లు విద్యుత్తు శాఖ అధికారులు చెబుతున్నారు. వీటిపై వినియోగదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కరవైంది. ఫలితంగా ఒక్కసారిగా బిల్లు పెరగడంతో ఆందోళనకు గురవుతున్నారు.. లోడుకు తగ్గ కెపాసిటర్లు బిగించుకుంటే 'లెక్క' సరిగా ఉంటుందని విద్యుత్తు శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**బంద్ చేయకుంటే భారీగా బిల్లు**

ఏపీఈఆర్సీ రెగ్యులేషన్స్ ఆధారంగా ఐఆర్‌డీఏ మీటర్లలో కెపాసిటర్ బ్లాకింగ్ అనే ఆప్షన్ తీసేశారు. దీంతో అధిక లోడు కెపాసిటర్లు బిగిస్తే లీడింగ్ పవర్ ఫ్యాక్టర్ అనేది కేవీఏహెచ్‌లో కలుస్తుంది. వినియోగదారులు మోటారు లోడులో 1/3వ వంతు ఉండే కెపాసిటర్లను బిగించుకోవాలి. మోటారు లోడు లేక మిషన్ లోడ్ ఆఫ్‌లో ఉన్నప్పుడు తప్పనిసరిగా కెపాసిటర్లు ఆఫ్ చేసుకోవాలి. లేకుంటే అధికంగా ఉన్న కెపాసిటర్ల లోడు కేవీఏహెచ్‌లో కలుస్తుంది. బిల్లు భారీగా వస్తుంది.

**కెపాసిటర్ల అవసరం గుర్తించాలి**

స్మార్ట్ మీటర్లు ఉన్న దుకాణాలు, దుకాణ సముదాయాల్లో లోడుకు తగ్గట్టు కెపాసిటర్లు అమర్చుకోవాలి. ఉదాహరణకు 5 హెచ్‌పీ మోటారు ఉన్న వినియోగదారుడు 2 కేవీఏఆర్ కెపాసిటర్‌ను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలి. అలాకాక 4 కేవీఏఆర్ కెపాసిటర్ ఏర్పాటు చేసుకుంటే లీడింగ్ కేవీఏహెచ్‌లో కలవడంతో విద్యుత్తు బిల్లు పెరిగే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు.

పరిశ్రమలు, ఇతర కమర్షియల్ దుకాణాల్లో అధిక లోడు వాడు వాడుతుంటే లోడులో 25 శాతం కలిగిన కెపాసిటర్ ఏర్పాటు చేసుకోవాలి. పని అయిపోగానే మోటారును, కెపాసిటర్‌ను తప్పనిసరిగా స్విచ్ఛాఫ్ చేసుకుంటే బిల్లు తగ్గుతుంది.

" లోడుకు తగ్గ కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలి. పరిశ్రమలో యంత్రాలను ఆపేసిన వెంటనే వాటికి సంబంధించిన కెపాసిటర్‌నూ ఆఫ్ చేసుకోవాలి. దీనిపై అవగాహన కల్పిస్తున్నామని" ఎస్ఈ ఎం.ఉమాపతి పేర్కొన్నారు.

**ఉదాహరణకు ఇలా..**

"వాణిజ్య విద్యుత్తు కనెక్షన్ (ఎల్‌టీ2)కు సంబంధించి నెల రోజులపాటు వాడే విద్యుత్తు వాడకానికి రూ.800 వచ్చేది. కానీ స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసుకున్నాక లోడులో 1/3వ వంతు కెపాసిటర్ కంటే ఎక్కువ కెపాసిటర్‌ను ఏర్పాటు చేసుకోవడం.. లీడింగ్ కేవీఏహెచ్‌లో కలవడంతో ఒకేసారి రూ.18 వేల మేర బిల్లు వచ్చింది. దీంతో విద్యుత్తు వినియోగదారుడు అవాక్కయ్యారు."

చురకలు



# ప్రతిష్ఠాత్మక కోర్సు.. ఏయూలో ప్రత్యేకం!

విశాఖపట్నం: అమెరికాలోని సిలికాన్ వ్యాలీని తలపించేలా అమరావతిలో రూ.4,000 కోట్లతో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రాన్ని క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ ఇండస్ట్రీకి నైపుణ్యమున్న మానవ వనరులను అందించేందుకు ఉన్నత విద్యా సంస్థలు కృషి చేస్తున్నాయి. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయం.. ఇంజినీరింగ్‌లో ఈసీఈ, సీఎస్ఈ మాదిరిగా క్వాంటం కంప్యూటింగ్‌లో మేజర్, మైనర్ డిగ్రీ ప్రోగ్రాంలు అందించనుంది.

**మైనరీ డిగ్రీకి అవకాశం:** మేజర్ డిగ్రీగా క్వాంటం కంప్యూటింగ్ చదువుతున్న విద్యార్థులకు మైనర్ డిగ్రీగా కంప్యూటర్ సైన్స్, ఈసీఈ అందజేయాలని భావిస్తున్నారు. ఇంజినీరింగ్‌లో ఇతర విభాగాల్లో నాలుగో ఏడాది చదువుతున్న విద్యార్థులకు (2022-23 బ్యాచ్) క్వాంటం కంప్యూటింగ్‌లో మైనర్ డిగ్రీ ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. తొలిసారిగా కోర్సు ప్రారంభించనున్న నేపథ్యంలో బోధన అవసరాలకు ప్రొఫెసర్లను తీర్చిదిద్దాల్సి ఉంది. నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్), స్వయం పోర్టల్స్‌లో ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులోని సబ్జెక్టులకు సంబంధించి ఐఐటీ ఆచార్యులు బోధించిన వీడియోలు వెబ్‌సైట్లలో పొందుపరిచారు.

**ఏయూలో తొలిసారిగా:** దేశవ్యాప్తంగా అతితక్కువ విద్యా సంస్థల్లో




మాత్రమే ఈ కోర్సును బోధిస్తున్నారు. ఐఐటీ మద్రాస్‌లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు, దిల్లీ, ముంబయి ఐఐటీల్లో, బెంగళూరులోని ఐఐఎస్సీ తదితర విద్యా సంస్థల్లో పోస్టు గ్రాడ్యుయేట్/పీహెచ్‌డీ స్థాయిలో అమలు చేస్తున్నారు. వివిధ సంస్థలు ఆన్‌లైన్ కోర్సులు అందిస్తున్నాయి. వివిధ విశ్వవిద్యాలయాల్లో సీఎస్ఈలో ఒక సబ్జెక్టుగా దీన్ని బోధిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రత్యేకంగా బీటెక్‌లో క్వాంటం కంప్యూటింగ్ కోర్సు లేదని, ఏయూలో తొలిసారిగా ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

తొలి ఏడాది 30 సీట్లు: ఏయూలో కోర్సు ప్రారంభించడానికి ఈ ఏడాది జనవరిలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ)కి ప్రతిపాదనలు పంపారు. బీటెక్‌లో 60 సీట్లకు ఆమోదం లభించగా.. తొలి ఏడాది 30 సీట్లు అందుబాటులోకి తేనున్నారు. దీనికి సంబంధించిన పాఠ్య ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేశారు. ఈఏపీసెట్ ద్వారా ప్రవేశాలు చేపట్టనున్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కింద చేపట్టనున్న ఈ కోర్సుకు ఏడాదికి రూ.79 వేలు ఫీజు చెల్లించాలి. జులై నెలాఖరు లేదా ఆగస్టులో తరగతులు ప్రారంభమవుతాయి.

మెరుగైన అవకాశాలు: ప్రస్తుతం టెక్నాలజీలో ఉన్నత స్థాయిలో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మించిన అవకాశాలు ఇందులో ఉన్నాయి. పోటీ ప్రపంచంలో ఈ సాంకేతికతను అభివృద్ధి చేయడానికి దిగ్గజ టెక్ సంస్థలు ప్రధానంగా కృషి చేస్తున్నాయి. మెడికల్, సైన్స్ అండ్ టెక్నాలజీ, రక్షణ రంగాల్లో ఈ టెక్నాలజీ ఎక్కువగా ఉపయోగపడుతుంది. భవిష్యత్తులో ఈ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. దీనిపై పరిశోధనలకు గాను కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టీ) నుంచి నిధులు పొందొచ్చు.
ఆచార్య జి.శశిభూషణరావు, ప్రిన్సిపాల్, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల

# నాలుగేళ్లుగా నాన్చుతూ..!

చిత్తూరు: నగర, పురపాలికల్లోని ప్రజలకు సమీపంలోనే వైద్యసేవ లు అందించాలనే ఉద్దేశంతో మంజూరైన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ)కు గ్రహణం పట్టుకుంది. వైకాపా హయాంలో పనులు ప్రారంభించగా బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో అవి దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. కూటమి హయాంలోనైనా నిధులు విడుదల చేస్తే పట్టణవాసులకు అవస్థలు తప్పుతాయి. పట్టణాల్లో నివసిస్తోన్న ప్రతి 25 వేల మంది జనాభాకు ఒక యూపీహెచ్‌సీ నిర్మించాలనే ఉద్దేశంతో జిల్లాలో 12, తిరుపతి జిల్లాలో 15 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయి. ఒక్కో



కేంద్రం నిర్మాణానికి రూ.80 లక్షల వ్యయమవుతుందని అంచనా వేశారు.

**త్వరగా బిల్లులు చెల్లిస్తేనే..**

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పూర్తి కాకపోవడానికి ప్రధాన కారణం బిల్లులు చెల్లించకపోవడమే. పుంగనూరు, నగరిలో రెండు చొప్పున, పలమనేరులో ఒకటి నిర్మించినా కొన్ని చోట్ల పరికరాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. చిత్తూరులో రెండు, పలమనేరులో ఒకటి అసంపూర్తిగా ఉన్నాయి. కుప్పానికి రెండు మంజూరు కాగా.. కమతమూరు భవనం పనులు మొదలే కాలేదు. చిత్తూరునగరానికి 4 కేటాయించగా.. రెండు భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. మంజూరు: 12 నిర్మాణం పూర్తి: 8 అసంపూర్తిగా: 4

# ముఖ హాజరులో మతలబు



అనంతపురం : స్త్రీ,శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్)లో లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలన్న సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుకు శ్రీకారం చుట్టిన ముఖ ఆధారిత హాజరు(ఎఫ్ఆర్ఎస్) నమోదు వ్యవహారానికి సిబ్బందే తూట్లు పొడుస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్ ఆధారంగా కోడిగుడ్లు, పాలు, కిట్లు, బాలామృతం.. వంటి పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలని భావించారు. దీనివల్ల పక్కా సమాచారం, పంపిణీ పనితీరు ఎప్పటికపుడు తెలుస్తుందన్న ఉద్దేశంతోనే అమల్లోకి తెచ్చారు. ఏడాది క్రితమే కార్యరూపం దాల్చింది. ఈక్రమంలో కొత్త విధానంలో నమోదు చేయడానికి కొందరు సిబ్బంది కుంటిసాకులతో ముందుకు కదలకుండా చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. సెల్‌ఫోన్ల పనితీరు, ఇంటర్నెట్ సిగ్నెల్, సర్వర్ మొరాయించడం.. వంటి సమస్యలు ఉన్నాయి. వాటిని అధిగమిస్తూ వంద శాతానికి చేరువలో ఉన్న ప్రాజెక్టులు, జిల్లాలు చాలా ఉన్నాయి. అనంత జిల్లాలోనే సమస్య ఎందుకు తలెత్తుతుందో అర్థం కావడం లేదని అధికారులే అంటున్నారు.

**నిధులపై ప్రభావం**

జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్-ఈకేవైసీ, ఆధార్ అనుబంధనం చేసిన లబ్ధిదారుల ప్రకారమే నిర్దేశిత బడ్జెట్ను విడుదల చేస్తుంది. కేంద్రాల్లో నమోదైన సంఖ్య, ఎఫ్ఆర్ఎస్‌లో నమోదైన సంఖ్యకు భారీ వ్యత్యాసం ఉంది. దీన్ని తేల్చడానికి ఎఫ్ఆర్ఎస్‌ను వంద శాతం నమోదు చేయాల్సిందేనని కేంద్రం ఇప్పటికే తేల్చిచెప్పింది. జులై నుంచి 3-6ఏళ్లలోపు వారికి ఎఫ్ఆర్ఎస్ అమలు చేస్తామంటూ ప్రకటించింది.

**గుత్తిలో అధ్వానం**

జిల్లా వ్యాప్తంగా సగటున 64.7 శాతమే నమోదు చేశారు. తాడిపత్రి ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలవగా.. గుత్తి చివరన ఉంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, నార్పల కొంతమేర పర్వాలేదు. కంబదూరు, అనంత గ్రామీణం, అనంత అర్బన్, ఉరవకొండ... ప్రాజెక్టుల పనితీరు ఆశించిన మేర లేదు. ఈ ప్రాజెక్టుల్లో 45 నుంచి 60 శాతం మధ్యలోనే ఎఫ్ఆర్ఎస్ నమోదు చేయడం విశేషం. మొత్తం లబ్ధిదారుల్లో 60,361 మంది ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసినా.. ఆధార్‌లో వెనుకపడ్డారు. ఈ-కేవైసీలోనూ అదే పరిస్థితి నెలకొంది. అనంత అర్బన్ ప్రాజెక్టు పరిధిలో విలీనమైన రెండు కేంద్రాల పరిధిలో 92 మంది లబ్ధిదారులు ఉంటే.. ఇప్పటి దాకా 40 మందికి మించి ముఖ ఆధారిత హాజరు(ఎఫ్ఆర్ఎస్) నమోదు పూర్తి చేశారు. మిగతా లబ్ధిదారులు ఉన్నారా.. లేదా, బోగస్సా అన్నది తేలాలి. అధికారులు ఒత్తిడి పెంచినా అక్కడి సిబ్బందిలో ఉలుకూపలుకూ లేదు. బీకే సముద్రం మండలంలోని ఓ కేంద్రంలో 60 మందికిపైగా లబ్ధిదారులు ఉన్నట్లు హాజరువేస్తూ వచ్చారు. మొబైల్ పని చేయకపోవడంతోనే ఎఫ్ఆర్ఎస్ చేయలేదన్న సాకుతో కాలం గడిపేస్తున్నారు. ఏడాదిగా ఇదే వ్యూహాన్ని అనుసరిస్తూ తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది.

# లుక్‌తో ఘరానా మోసం!




అనంతపురం: సైబర్ నేరాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత అప్రమత్తం చేస్తున్నా.. సామాన్యుల అత్యాశ ఆసరాగా చేసుకుని కొత్త మార్గాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా 'లుక్' యాప్ పేరుతో వేలాది మందిని మోసం చేసిన ఘటన అనంతపురం జిల్లాలో వెలుగుచూసింది. మా యాప్‌లో రూ.2,250 డిపాజిట్ చేస్తే తిరిగి రోజుకు రూ.150 చెల్లిస్తాం. వారానికి ఒకసారి విత్‌డ్రా చేసుకోవచ్చు. మీ పేరుతో వేరే వాళ్లను చేర్పిస్తే అదనంగా బోనస్ ఇస్తామంటూ నమ్మించడంతో వేలాది మంది సదరు యాప్‌లో పెద్దమొత్తంలో డబ్బులు పెట్టారు. ఒకటి, రెండు వారాలు బాగానే చెల్లింపులు చేయడంతో చాలామంది రూ.లక్షల్లో డిపాజిట్ చేశారు. తీరా సాంకేతిక కారణాలు చూపి కొన్ని వారాలుగా చెల్లింపులు నిలిపివేయడంతో మోసపోయామని గ్రహించారు. ఎక్కడ పరువుపోతుందోనని పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ముందకు రావడం లేదు. అనంతపురం నగరంలోని పాతూరు, బళ్లారి రోడ్డుకు చెందిన వందలాది మంది గృహిణులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు కలెక్టరేట్‌లో పనిచేసే కొందరు ప్రభుత్వ ఉద్యోగులు సైతం డబ్బులు పెట్టి మోసపోయినట్లు తెలుస్తోంది.

**17 వేల మంది సభ్యులు**

యాప్ నిర్వాహకులు గొలుసుకట్టు విధానంలో మోసానికి పాల్పడుతున్నారు. లుక్ పేరుతో యాప్ రూపొందించి వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రచారం కల్పించారు. డబ్బు డిపాజిట్ చేస్తే ప్రతివారం ఆదాయం పొందవచ్చని కొంతమంది యూట్యూబర్లు, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా చెప్పించడంతో చాలామంది ఆకర్షితులయ్యారు. యాప్‌లో చేరే వారిని 9 రకాలుగా విభజించారు. కొన్ని రకాల స్కీంలు రూపొందించి కనిష్ఠంగా రూ.2,250 నుంచి మొదలై గరిష్ఠంగా రూ.75.6 లక్షల వరకు డిపాజిట్ చేసేలా ప్రణాళిక రూపొందించారు. డిపాజిట్ మొత్తాన్ని బట్టి రోజుకు కొంత చొప్పున ఖాతాలో జమ చేస్తారు. జమైన సొమ్మును వారానికి ఒకసారి మాత్రమే విత్‌డ్రా చేసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. యాప్‌లో చేరిన వారందరినీ ఒక వాట్సప్ గ్రూపులో చేర్చి ఎప్పటికప్పుడు స్కీంలకు సంబంధించిన సమాచారాన్ని పోస్ట్ చేస్తూ వచ్చారు. ఇలా తెలుగుకు సంబంధించిన గ్రూపులోనే 17 వేల మంది సభ్యులు ఉన్నారు. యాప్‌లో చేరిన వారికి అనుమానం రాకుండా మొదట్లో పక్కాగా చెల్లింపులు చేయడంతో పాటు బోనస్, బహుమతులు ఎరగా వేశారు. దీంతో నమ్మిన చాలామంది డిపాజిట్ చేశారు. వారి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు రాగానే విత్‌డ్రాలు నిలిపివేశారు.

**సేవా కార్యక్రమాలతో ప్రచారం**

యాప్‌కు ప్రచారం కల్పించడం కోసం సరికొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. సభ్యులుగా చేరిన వారి ప్రాంతంలోని పేదల వద్దకు వెళ్లి నిత్యావసర సరకులు అందించేలా ప్రోత్సహించారు. ఇలా చేస్తే గ్రూపులోని సభ్యులందరికీ బోనస్ ఇస్తామని ప్రకటించారు. యాప్ లోగోతో పోస్టర్లు, టీ-షర్టులు కొరియర్ ద్వారా పంపించారు. అనంతపురంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ సభ్యుల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేపట్టారు. ఇలా చేయడం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు యాప్‌పై నమ్మకం పెరిగేలా చేశారు. వీరి సేవా కార్యక్రమాలు చేసి వేలాది మంది యాప్‌లో చేరి డబ్బులు డిపాజిట్ చేసి మోసపోయారు. ఈ అంశంపై అనంతపురం సైబర్ విభాగం పోలీసులను వివరణ కోరగా యాప్‌పై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని.. ఎవరైనా చేస్తే విచారణ చేస్తామన్నారు.

# మెప్మాకు జవసత్వాలు



అనంతపురం : పట్టణ పేదరిక నిర్మూలన (మెప్మా) మిషన్ సరికొత్త జవసత్వాలు తీసుకొస్తున్నారు. నగర, పట్టణాల్లోని పేదలకు పలు రకాల సంక్షేమ పథకాలతోపాటు సరికొత్త విధానాలను తెరపైకి తీసుకొచ్చి మహిళలకు ఆర్థిక దన్నుగా ఉండేందుకు పలు కార్యక్రమాలు అమలు అవుతున్నాయి. వాటిని క్షేత్రస్థాయిలో మహిళల చెంతకు తీసుకెళ్లడానికి సరైన అధికారులు, సిబ్బంది ఉండాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం సచివాలయాల్లో మిగులు సిబ్బంది ఉండి మెప్మాకు వచ్చి విధులు నిర్వహిస్తామని అంగీకారం ఇస్తే వారికి అవకాశం కల్పించారు. పథకాలు, చైతన్యం కల్పించడంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు అత్యంత కీలకం. గత వైకాపా హయాంలో మెప్మాను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఏడేళ్ల నుంచి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయక పోగా పదవీ విరమణ చేసిన స్థానాలు అలాగే ఉండి పోయాయి. దీంతో మహిళా సంఘాలు నామమాత్రం అయ్యాయి. తాజాగా డిజి లక్ష్మి, ర్యాపిడ్ ఆటోలు, ద్విచక్ర వాహనాలు, లైవ్‌లీహుడ్, ఈ-కామర్స్, బ్యాంకు లింకేజీ స్కీంలు, ఓఎన్‌డీసీ, గిగ్ మొత్తం 14 ప్రాజెక్టులు అమలు చేయాలని నిర్ణయించగా అందుకు అనువైన సిబ్బందిని నియమించారు.

**అదనపు సిబ్బంది బదలాయింపు**

సచివాలయాల్లో సంక్షేమ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వారు మెప్మాలో పని చేయడానికి అంగీకారం తెలిపితే వారు ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న నగర, పురపాలికల్లోనే అవకాశం కల్పించారు. అంగీకారం తెలిపిన వారికి మెప్మాలో అవకాశం కల్పించడంతో ఆయా ప్రాంతాల్లో అవసరాలకు అనుగుణంగా వారిని ఉపయోగించుకోనున్నారు. కొన్ని సచివాలయాల్లో ఎక్కువ మంది సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రజలు ఉండగా సంక్షేమ కార్యదర్శి మెప్మాకు వెళ్లడంతో ఆ విధులు ఎవరు నిర్వహిస్తున్నారన్నది ప్రస్తుతానికి ప్రశ్నార్థకంగా ఉంది. హేతుబద్ధీకరణ చేపట్టి మిగులు సిబ్బందిని ఉపయోగించుకుంటే ఉపయుక్తంగా ఉంటుందన్న వాదన విన్పిస్తోంది.

# స్కాన్ చెయ్.. సమస్య పంపేయ్

పుంగనూరు : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు అందుతున్న సేవలు బస్టాండ్లలో మౌలిక సదుపాయాలు సమగ్రంగా తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. సురక్షిత ప్రయాణానికి గుర్తుచ్చేది ఆర్టీసీ బస్సులే. సామాన్య ప్రజల నుంచి వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు నిత్యం ఈ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తుంటారు. ఆర్టీసీలో అందుతున్న సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా రివ్యూ ఇవ్వొచ్చు. దూరప్రాంత సర్వీసులైన లగ్జరీ, సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో డ్రైవర్ సీటు వెనుక కోడ్‌లు ఏర్పాటు చేశారు. ఈ విధానం పల్లె వెలుగు బస్సులకు మినహాయించారు. ప్రయాణికులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆ బస్సులో అందుతున్న సేవలను చూసుకోవచ్చు. అలాగే ఆయా బస్టాండ్లలో గల సదుపాయాలపై తన అభిప్రాయాన్ని చెప్పవచ్చు.




డ్రైవరు, కండక్టరు ప్రవర్తన, బస్సు వేగం, రాకపోకల వేళలు సక్రమంగా పాటిస్తున్నారా, సురక్షితమైన డ్రైవింగ్ ఉందా, బస్సులో శుభ్రత పాటిస్తున్నారా, ప్రయాణ అనుభూతి ఎలా ఉంది అనే ప్రశ్నలకు జవాబు ఇవ్వాల్సి ఉంటుంది.

జిల్లాలో చిత్తూరు 1, చిత్తూరు 2, పలమనేరు, కుప్పం, పుంగనూరులో గల ఆర్టీసీ డిపోల పరిధిలో గల 171 ఇంద్ర, సూపర్ లగ్జరీ, సప్తగిరి, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ క్యూఆర్ కోడ్ విధానం అమలవుతోంది.

**సేవల మెరుగుకే**

ఆర్టీసీ బస్సుల్లో, బస్టాండ్లలో ప్రయాణికులకు కల్పించాల్సిన సేవలను మెరుగు పరచడానికే ఈ క్యూఆర్ కోడ్ విధానం అమలవుతోంది. కండక్టరు, డ్రైవరు విధుల నిర్వహణ, ప్రయాణికులతో వ్యవహరించే తీరు, తదితర అంశాలను నేరుగా రీజియన్ స్థాయి అధికారులకు చేరుతోంది. ప్రయాణికులు వినియోగించుకుంటే ఆర్టీసీ సేవలు మరింత మెరుగుపడతాయి. సుధాకరయ్య, డీఎం, ఆర్టీసీ డిపో, పుంగనూరు

# కొనే ర్యాంపులు తక్కువే!

తిరుపతి: ఈ ఏడాది ఒకవైపు మామిడి గుజ్జు పరిశ్రమలు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ధరలు తగ్గిస్తుంటే.. మరోవైపు అంతకన్నా ఎక్కువ దోపిడీ ర్యాంపుల్లో జరుగుతోంది. అన్నదాతలు ఏడాదంతా కష్టపడి పంట తీసుకొస్తే కిలోకు రూ.2-3 మాత్రమే ఇస్తామని నిర్వాహకులు తెగేసి చెబుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో మామిడిని ఇచ్చేసి ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. గతంతో పోలిస్తే తక్కువ ర్యాంపులు తెరుచుకోవడంతోనే యజమానులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్టు తయారైంది. మిగిలిన వారితోనూ సంప్రదింపులు జరిపి తెరిపిస్తేనే కొంతవరకైనా సమస్య తగ్గుముఖం పడుతుంది. ధరలు సైతం కాస్త పెరిగే అవకాశముంది.

గతంతో పోలిస్తే ఈ ఏడాది చిత్తూరు, తిరుపతి జిల్లాలతో కలిపి దాదాపు లక్ష టన్నుల మామిడి దిగుబడి అధికంగా వచ్చింది. 43 గుజ్జు పరిశ్రమల్లో రోజూ 10 వేల టన్నుల తోతాపురి ఆడిస్తున్నారు. రెండు జిల్లాల్లో 57 ర్యాంపులున్నాయి. గతంలో రోజూ 3-4 వేల టన్నులు ఇక్కడ కొనుగోలు చేసేవారు. ఇప్పుడు 34 పనిచేస్తున్నాయి. అవి కూడా అరకొరగా కొంటున్నాయి. నిత్యం కార్యకలాపాలు జరుగుతున్న వాటి సంఖ్య 15 మాత్రమే. ఫలితంగానే గుజ్జు పరిశ్రమల వద్ద వందలాది ట్రాక్టర్లు బారులు తీరుతున్నాయి.

**దామలచెరువులో ఒత్తిడి తెస్తున్నా..**

పాకాల మండలం దామలచెరువు, పరిసర ప్రాంతాల్లో 15 ర్యాంపులున్నాయి. ప్రస్తుతం ఒక్కరు మాత్రమే కిలోకు రూ.3 చొప్పున చెల్లిస్తున్నారు. మిగతావారు రూ.2- 2.50 ఇస్తున్నారు. పోలీసులు, వీఆర్వోలను అక్కడే మోహరించి ఒత్తిడి తెచ్చినా ధరలు పెంచేందుకు ససేమిరా అంటున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం భన్సల్ హెచ్చరించినా ఎలాంటి మార్పు లేదు. అందులోనూ ముగ్గురు, నలుగురు నిర్వాహకులే కాయలు కొంటున్నారు. గతంలో అప్పులు తీసుకున్న రైతుల నుంచి కొందరు



కొనుగోలు చేస్తున్నారు. వీరిని ఎలాగోలా ఒప్పించి తోతాపురి కొనేలా చేస్తే అన్నదాతలకు ఉపశమనం లభిస్తుంది. అన్నీ అందుబాటులోకి వస్తే కిలోకు రూ.1 పెరిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

**పులిచెర్లలోనూ తక్కువగా**

పులిచెర్ల మండలంలో తొమ్మిది ర్యాంపులున్నాయి. నలుగురు అంతంతమాత్రంగానే కొనుగోలు చేస్తున్నారు. అదీ కిలోకు రూ.2-2.50 చెల్లిస్తున్నారు. వైకాపా నాయకుల ప్రలోభాలకు తలొగ్గి మిగతావారు ర్యాంపులు ప్రారంభించలేదనే ఆరోపణలున్నాయి. ఈ ప్రాంతంలో కొనుగోళ్లు నిలిచిపోవడంతో సోమల, సదుం, రొంపిచెర్ల మండలాల రైతులు దాదాపు 50-60 కిలోమీటర్ల దూరంలోని చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాలకు కాయలు తెస్తున్నారు. పరిశ్రమల వద్ద రెండు- మూడు రోజులు వేచిచూస్తున్నారు. రవాణా, కోత కూలీలు, పెట్టుబడులతో కలుపుకొంటే అన్నదాతలకు మిగిలేది శూన్యం.

# ఆరోగ్యానికి మురిపాలు

కర్నూలు : కర్నూలు జిల్లాలో పాల ఉత్పత్తులు పెంచేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వివిధ రాయితీ పథకాలు అందజేస్తోంది. పేద కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చే ప్రణాళికలు రూపొందించింది. మరోవైపు విపణిని కల్తీ పాలు ముంచెత్తుతున్నాయి. చిక్కగా ఉండేందుకు.. వెన్న శాతం పెరిగేందుకు కొందరు అక్రమ పద్ధతులు అవలంబిస్తున్నారు. జనం ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తున్నారు. నేడు ప్రపంచ పాల దినోత్సవం నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై కథనం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13.60 లక్షల కుటుంబాలున్నాయి. 20వ పశు గణనలో భాగంగా కర్నూలు జిల్లాలో 3,62,370, నంద్యాల జిల్లాలో 4,13,607 పశువులు ఉన్నట్లు అధికారులు లెక్క తేల్చారు. 35 శాతం కుటుంబాలు లూజు పాలు, 65 శాతం కుటుంబాలు ప్యాకెట్ పాలను వినియోగిస్తున్నట్లు అంచనా. పాల ఉత్పత్తి తక్కువగా ఉన్న నేపథ్యంలో ఇతర ప్రదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

**పలువురికి తోడ్పాటు**

పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అధికారులు ఇటీవల పీ4, ర్యాపిడో సర్వేలు నిర్వహించారు. మొదటి దఫాగా కర్నూలు జిల్లాలో 2,961, నంద్యాల జిల్లాలో 3,477 కలిపి మొత్తం 6,438 కుటుంబాలను గుర్తించారు. దాతల సహకారంతో వారిని పాడి పరిశ్రమ రంగం వైపు తీసుకెళ్లాలని.. పాడి గేదెలు ఇప్పించాలని నిర్ణయించారు. ఫలితంగా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించారు.



**వినియోగం పెంచేలా..**

ఒక వ్యక్తికి సగటున రోజుకు 600 మిల్లీలీటర్ల పాలు తీసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పరిశీలిస్తే రోజుకు 100 ఎంఎల్ కూడా తీసుకోవడం లేదు. పట్టణ ప్రాంతాల్లోనివారు.. ఆర్థికంగా ఉన్నవారు మాత్రమే తమ పిల్లలకు పౌష్టికాహారంగా పాలు ఇస్తున్నారు. కర్నూలు జిల్లాలో పత్తికొండ, మంత్రాలయం, ఎమ్మిగనూరు, హోళ్వి ప్రాంతాల్లో మాత్రమే పాల సేకరణ కేంద్రాలున్నాయి. నంద్యాల జిల్లాలో ప్రతి మండలంలో కనీసం నాలుగైదు పాల సేకరణ కేంద్రాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రజల ఆరోగ్యం పెంపొందించేలా.. పాల వినియోగం పెంచేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోంది.

**6.50 లక్షల లీటర్ల కొరత**

ఉమ్మడి జిల్లాలో రోజుకు 13 లక్షల లీటర్ల పాలు అవసరం కాగా.. ప్రస్తుతం 6.50 లక్షల లీటర్లు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. సగానికి సగం కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేటు డెయిరీ పాలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఇదే అవకాశంగా కొందరు కృత్రిమ పాలను తయారుచేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

**పశు పోషకులకు ప్రోత్సాహం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పశు పోషకులకు రాయితీపై మినీ గోకులం షెడ్లను మంజూరు చేసింది. ఉపాధి హామీ పథకం కింద వంద శాతం రాయితీపై పశుగ్రాసం పెంపకానికి సాయం అందిస్తోంది. తాజాగా 50 శాతం రాయితీతో సమీకృత పశుదాణా పంపిణీ చేస్తున్నారు. అవసరమైన రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాల్సి ఉంది. భారత్ పశుధన్ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవడంతోపాటు పశువులకు టీకాలు వేయించి ఉండాలి. తెల్లరేషన్‌కార్డు కలిగినవారు అర్హులు. సమీకృత దాణాతో పశువుల్లో పోషకాలు పెరిగి పాల దిగుబడులు మెరుగవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

**ఇష్టానుసారంగా కల్తీ**

పాల కొరత నేపథ్యంలో ప్రైవేటు పాల వ్యాపారం పెద్దఎత్తున సాగుతోంది. పాలు ఎక్కువగా ఉన్న సమయంలో కొన్ని డెయిరీలు పొడిగా తయారు చేసుకుంటాయి. కొరత సమయంలో పొడిని పాలుగా మార్చి అమ్ముతున్నాయి. పాల ఉత్పత్తి చేసే రైతులకు లీటరుకు రూ.2, రూ.3 ఆదాయం మాత్రమే వస్తుంది. కొందరు పాల వ్యాపారులు కల్తీ చేయడం ద్వారా లీటరుకు రూ.10కు పైగా లాభం పొందుతున్నారు. కల్తీ పాలతో జనం అనారోగ్యం పాలవుతున్నారు.

# బంగారు భవితకు కిశోరి వికాసం..!

శ్రీకాకుళం : జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కిశోరి వికాసం అవగాహన తరగతులు జరుగుతున్నాయి. మే 2న ప్రారంభమైన కార్యక్రమాలు ఈ నెల 10 వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిశోరి బాలికలకు 10 అంశాలు వివరిస్తున్నారు. 11 నుంచి 18 ఏళ్లలోపు వయసు గల అమ్మాయిలు, 11 నుంచి 14 ఏళ్ల లోపు బడి బయట ఉన్న బాలికలను సమావేశపరుస్తున్నారు. కౌమార వయసులో బాలికలు ఎలా నడుచుకోవాలి.. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఏం చేయాలనేది సూచిస్తున్నారు.

జిల్లాలో ఇప్పటి వరకు 11 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు ఉన్న బాలికలకు విద్య, లక్ష్యం, నైపుణ్యాలు, ఆహారం, లింగ సమానత్వం, రుతుక్రమం వంటి 14 అంశాల గురించి వివరిస్తున్నారు. ఈ నెల 3న ఆడపిల్లల్లో నాయకత్వం లక్షణాలు పెంపొందించే తరగతులు, స్వయం సమృద్ధి సాధించేందుకు దోహదపడే అంశాలు, 6న క్రీడల ఆవశ్యకత, వ్యాయామం, వారిలో ఉండే ప్రతిభను గుర్తించేందుకు తరగతులు జరగనున్నాయి. శిబిరం ముగింపు రోజున బాల్య వివాహాల విషయంలో చైతన్య పరుస్తారు.

**చాలా విషయాలు తెలుసుకున్నాను..**

ఈ శిబిరం ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నాను. వేసవి సెలవుల్లో జరగడంతో సద్వినియోగం చేసుకోగలిగాను. ఆరోగ్యం, విద్య, సమాజంలో బాలికలు నడవడిక, అప్రమత్తంగా వ్యవహరించడం అర్థమైంది. భవిష్యత్తులో ఎలాంటి లక్ష్యం నిర్ణయించుకోవాలి.. దాన్ని అధిగమించేందుకు ఎలా ముందుకు సాగాలనే దానిపై స్పష్టత వచ్చింది.– పి.శైలజ, 10వ తరగతి, రణస్థలం

**ప్రత్యేక కమిటీల ఏర్పాటు..**వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి బాలికలకు అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. అందులో అంగన్‌వాడీ కార్యకర్త, బహుళార్థ సార్థక ఆరోగ్య కార్యకర్త, గ్రామ, వార్డు సచివాలయ సహాయకులు, గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఉంటారు. సంరక్షణ అధికారులుగా సచివాలయం సిబ్బంది కొనసాగుతారు. కార్యక్రమాన్ని జిల్లాలో పక్కాగా ప్రణాళికతో అమలు చేస్తున్నాం.– బి.శాంతిశ్రీ, పీడీ, శ్రీకాకుళం

# భద్రత ఇక బలోపేతం..



సింధియా : ఆపరేషన్ సింధూర్ తర్వాత భద్రతపై కేంద్ర ప్రభుత్వం ఎక్కువ దృష్టిపెట్టింది. కీలకమైన నగరాలు, అక్కడి ప్రజలు, సంస్థల భద్రతకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. ముఖ్యంగా తూర్పు తీరం వెంట ఉన్న జాతి సంపద కాపాడటమే ధ్యేయంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. పోలీసు వెరిఫికేషన్ సర్టిఫికేట్ (పీవీసీ) సరిగా అమలు జరగడం లేదని గుర్తించారు. దాన్ని కచ్చితంగా అమలయ్యేలా చూస్తున్నారు.

తూర్పు కనుమల్లో పేరొందిన విశాఖ–డాల్ఫిన్‌హిల్స్ పరిసరాల్లోనే అత్యంత విలువైన, ముఖ్యమైన సంస్థలు ఉన్నాయి. భూగర్భ ప్రాజెక్టులైన 'దక్షిణాసియా ద్రవీకృత పెట్రోలియం వాయువు' (ఎస్‌ఏఎల్‌పీజీ), 'భారత వ్యూహాత్మక పెట్రోలియం నిల్వ సంస్థ' (ఐఎస్‌పీఆర్‌ఎల్) ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. అత్యవసర సమయాల్లో దేశ చమురు అవసరాలను ఈ సంస్థలు తీరుస్తుంటాయి. వీటికి సమీపంలోనే రక్షణ నౌకల స్థావరం, సరకు రవాణాకు సంబంధించిన పోర్టు, ఈస్టర్న్ నేవల్ కమాండ్, నేవల్ బేస్, హెచ్‌పీసీఎల్ చమురు శుద్ధి కర్మాగారం, ఐఓసీ, బీపీసీఎల్‌కు చెందిన ఇంధన నిల్వ భారీ ట్యాంకుల వంటివి ముఖ్య సంస్థలు, పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో పెద్దసంఖ్యలో కార్మికులు పనిచేస్తుంటారు.

**పీవీసీ లోపాలపై నిఘా..:** అయితే ప్రముఖ సంస్థల్లో పనిచేసే కార్మికులకు పోలీసు వెరిఫికేషన్ సర్టిఫికెట్ (పీవీసీ) సరిగా అమలు జరగని విషయాన్ని నిఘా సంస్థలు గుర్తించాయి. ఇతర రాష్ట్రాల నుంచి గుత్తేదారులు పెద్దఎత్తున ఒప్పంద కార్మికులను తీసుకొచ్చి ఇక్కడ పనులను నిర్వహిస్తుంటారు. వీరికి సీఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో అనుమతి పాసులను జారీ చేస్తుంటారు. అయితే ఇలా పాసులు పొందిన వారిలో ఎవరైనా నేర స్వభావం కలిగి ఉన్నారా? నేర చరిత్ర ఉందా అనే విషయాలు తెలుసుకోకుండా పాసులు జారిచేస్తుండటాన్ని నిఘా సంస్థలు ప్రశ్నిస్తున్నాయి. దీంతో ప్రధాన కంపెనీలకు పోలీసులు లేఖలు పంపి పీవీసీ పక్కాగా జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**లేఖలు జారీచేశాం.**

ఇటీవల పహల్గాం ఉగ్రదాడి అనంతరం చోటుచేసుకున్న పరిణామాల దృష్ట్యా నగర పౌరులతో పాటు ప్రముఖ సంస్థల భద్రతకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చే వారికి పాసుల జారీలో పారదర్శకత పాటిస్తున్నాం. పీవీసీ కచ్చితంగా అమలు చేస్తాం. ఇప్పటికే కంపెనీలకు లేఖలు జారీచేశాం. గొలగాని అప్పారావు, సీఐ–మల్కాపురం

# కలవారికి కాదు.. కలలుగనే మధ్యతరగతికి!!



విశాఖపట్నం: విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మధ్యతరగతి ప్రజలకు అపార్ట్‌మెంట్లు నిర్మించడానికి ప్రణాళిక చేస్తోంది. వాటిని నగరం నడిబొడ్డున నిర్మించాలనుకుంటోంది. ఇందుకు డిమాండు సర్వే చేస్తోంది. ప్రజాభిప్రాయం ఆధారంగా ముందుకు వెళ్లనున్నారు. మిథిలాపురి కాలనీ, మారికవలస, మధురవాడ శ్రీకన్య, వేపగుంటలో నిర్మించాలన్నది ప్రణాళిక. ప్రస్తుతం విశాఖ నగరం మధ్యలో మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో ఫ్లాట్లు కొనుగోలు చేయడం కలగా మిగిలింది. డిమాండున్నప్పటికీ దొరకని పరిస్థితి. ఈ నేపథ్యంలో వీఎంఆర్‌డీఏకు నగరంలో ఖాళీగా ఉన్న స్థలాలను ఆదాయ వనరుగా మార్చాలనుకున్నారు. ఆయా ప్రాంతాల్లో బహుళ అంతస్తులు నిర్మిస్తే అటు ప్రజలకు ఉపయోగపడడంతో పాటు వీఎంఆర్‌డీఏకు రెవెన్యూ వస్తుందని భావిస్తున్నారు. సర్వేలో వ్యక్తిగత, కుటుంబ సభ్యుల వివరాలను పేర్కొనాలి. అలాగే ఆదాయం, విశాఖలో ఉంటున్నారా, స్థానికేతరులా, స్థానికేతరులైతే ఎక్కడ అనేవీ నమోదు చేయాలి. కొత్త ఫ్లాటు కొనాలనుకుంటుంటే సూచించిన పేర్లలో నచ్చింది ఎంపిక చేయాలి. కొత్త ఫ్లాట్ ఆరు నెలల్లో కొంటారా, ఏడాదిలో కొంటారా అనేది తెలపాలి. రెండు పడకలా, మూడు పడకలా, ఏ అంతస్తులో కొనాలనుకుంటున్నారో కూడా పొందుపరచాలి.

887, 945 చదరపు అడుగులతో రెండు పడక గదుల ఫ్లాట్లు, 1,238, 1,294 చ.అడుగుల ఫ్లాట్లు, 1,458 చ.అడుగుల ఫ్లాట్లు నిర్మించాలనుకుంటున్నారు.

ధర ఎంతలో ఉండాలనేదీ సర్వేలో పేర్కొన్నారు. రూ.45 లక్షల వరకు, రూ.45 లక్షల నుంచి రూ.55 లక్షల వరకు, రూ.56 లక్షల నుంచి రూ.65 లక్షల వరకు, రూ.65 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు, రూ.75 లక్షల పైన ఉండాలా అనే వివరాలు ఆరా తీస్తున్నారు.

క్లబ్‌హౌస్, పార్కులు, లిఫ్టులు, నడక మార్గం, గ్యాస్ లైన్, సీసీటీవీ ఇతర సౌకర్యాలలో ఏవేవి కల్పించాలో సర్వేలో అడిగారు. ఇప్పటికే ఇందులో వేలమంది పాల్గొని వారి అభిప్రాయాలు తెలియజేస్తున్నారు. అధికారులు వాటన్నింటినీ క్రోడీకరిస్తున్నారు. వాటి ఆధారంగా ఎక్కడ ఏవిధంగా నిర్మించాలో అంచనాలు తయారు చేస్తున్నారు.

డిమాండు సర్వే: నగరంలో ప్రజలు ఎక్కడ కొనుగోలు చేస్తారు, ఎన్ని చదరపు అడుగుల్లోని ఫ్లాట్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు వంటి వివరాలు తెలుసుకునేందుకు డిమాండు సర్వే సాగిస్తున్నారు. ఈ వివరాలు పొందుపరిచిన వివరాల క్యూఆర్ కోడ్‌ను నగరంలో అనేక చోట్ల ఏర్పాటు చేశారు. స్కాన్ చేసి ప్రజలు వారి అభిప్రాయం తెలిపేలా వాటిని ఉంచారు. అందులో సలహాలు, మెరుగైన నిర్మాణాల గురించి తెలిపేందుకు కూడా అవకాశం కల్పించారు.

రెండు చోట్ల: ఎంపిక చేసిన అన్ని చోట్ల అపార్ట్‌మెంట్లు నిర్మించాలని మొదట భావించినప్పటికీ అవి పూర్తయ్యేసరికి ఆలస్యమవుతుందని రెండు చోట్ల తొలుత చేపట్టాలనుకుంటున్నారు. నాలుగు చోట్ల ప్రారంభించి నెమ్మదిగా పూర్తిచేయడం కన్నా రెండు చోట్ల గడువులోగా పూర్తయ్యేలా చేస్తే బాగుంటుందనేది ఆలోచన. ఈ నేపథ్యంలో వేపగుంట, మధురవాడలో ఒక్కొక్కటి నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు కమిషనర్ విశ్వనాథన్ పేర్కొన్నారు.

# జైకా.. పనులు సాగక!



చిత్తూరు: వైకాపా హయాంలో సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారు. ఆ పార్టీ నేతల జేబులు నింపుకొనే పనులు ప్రాధాన్య జాబితాలో చేర్చడం తప్ప సాధించిన పురోగతి శూన్యం. జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) నుంచి నిధులు వచ్చే అవకాశం ఉన్నా నిర్లక్ష్యం చూపారు. దీంతో కీలకమైన జలాశయాలు, చెరువుల మరమ్మతులకు గ్రహణం పట్టుకుంది. నెల రోజుల్లో జైకా ప్రాజెక్టు గడువు ముగుస్తుంది. 2014–19లో తెదేపా అధికారంలో ఉన్న సమయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 65 చెరువులు, పిచ్చాటూరు మండలం అరణియార్, కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్ల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. తద్వారా 24,034.56 ఎకరాలకు సాగునీరందుతుందని భావించారు. తెదేపా పాలన చివర్లో జైకా నిధులు మంజూరయ్యాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా వీటిని పట్టించుకోలేదు. అరణియార్, కృష్ణాపురం జలాశయాలకు తొలుత ఒప్పందం చేసుకున్న గుత్తేదారు చురుగ్గా పనులు చేశారు. బిల్లులు రాకపోవడంతో అర్ధాంతరంగా నిలిపేశారు. ఇలా అరణియార్‌కు రూ.35 కోట్లు, కృష్ణాపురానికి రూ.28 కోట్లు మంజూరైనా ఫలితం లేకుండా పోయింది.

**ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటేనే..**కూటమి ప్రభుత్వం వచ్చాక జైకా పనుల పురోగతిపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో అసలు ప్రారంభించని 17 చెరువుల పనులు రద్దు చేశారు. 38 పనులు పురోగతిలో ఉండగా పూర్తి చేసేందుకు నెలాఖరు వరకు గడువు ఉంది. చిత్తూరు, గంగాధరనెల్లూరు, పెనుమూరు, ఐరాల మండలాల్లోనే కొంతవరకు పూర్తయ్యాయి. ఈ క్రమంలోనే ఓ కొలిక్కి వచ్చిన చెరువులకు సంబంధించిన నిర్మాణాలు మాత్రం వేగవంతం చేయాలని జలవనరుల శాఖ అధికారులు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కనీసం మరో రెండేళ్లు గడువు పెంచితేనే పనులు పూర్తవుతాయి.

**సీఎఫ్‌ఎంఎస్‌లో రూ.3 కోట్లు పెండింగ్**

మరోవైపు కృష్ణాపురం, అరణియార్ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులు విడుదలవ్వాలి. దాదాపు రూ.3 కోట్ల బకాయిలు ఉన్నాయని జలవనరుల శాఖ అధికారులు నివేదించారు. ఇవి విడుదల చేస్తే గుత్తేదారులకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు.

జైకా నిధులతో ఆధునికీకరించే చెరువులు: 65

ఆయకట్టు: 24,034.56

ఎకరాలురద్దు చేసిన పనులు: 17

పూర్తయినవి: 10ప్రభుత్వ ఆదేశాల కోసం వేచి చూస్తున్నాం

జైకా నిధులతో చేపట్టిన చెరువులు, రిజర్వాయర్ల పనులు పూర్తి చేసేందుకు మరికొంత సమయం అవసరం. గడువు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాం. వచ్చే ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.వెంకటేశ్వరరాజు, ఎస్‌ఈ, జలవనరుల శాఖ

# దున్నేద్దాం.. విత్తు వేసేద్దాం

విజయనగరం : ఈ ఏడాది ముందస్తుగా కురుస్తున్న వానలు ఖరీఫ్‌కు శుభారంభం పలికాయి. రైతులు వ్యవసాయ పనులకు సిద్ధం అవుతున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరగనుంది. దీనికి అనుగుణంగా వ్యవసాయ శాఖాధికారులు విత్తనాలు సిద్ధం చేశారు.

విజయనగరం జిల్లాలో లక్ష హెక్టార్లు, మన్యం జిల్లాలో 72 వేల హెక్టార్లలో వరి సాగు అవుతుందని అంచనా వేశారు. విజయనగరానికి 50 వేల క్వింటాళ్లు, మన్యానికి 35 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం. విజయనగరంలో 16,952 క్వింటాళ్ల విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధం చేశారు. క్వింటా రూ.300 రాయితీపై రూ.వెయ్యికి రైతులకు అందజేస్తారు. ఎకరానికి 20 కిలోల చొప్పున గరిష్ఠంగా ఒక్కొక్కరికీ క్వింటా ఇస్తారు. మన్యం జిల్లాలో 26,470 క్వింటాళ్ల వరి విత్తనాలు రాయితీపై సరఫరా చేస్తారు. ఇందులో గిరిజనులకు 9,092 క్వింటాళు 90 శాతం, మిగిలిన 17,378 క్వింటాళ్లు రూ.300 రాయితీపై పంపిణీ చేస్తారు.

**తొలి వారంలో నారు పోత**

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులు, ఇతర జల వనరుల్లోకి నీరు చేరుతోంది. వీటి ఆధారంగా జూన్ తొలి వారంలో వరి నారుమళ్లలో విత్తనాలు చల్లుతారు. 25–30 రోజుల్లో వరి నారు సిద్ధమైన తర్వాత జులై తొలి వారం నుంచి నాట్లు ప్రారంభిస్తారు.



విజయనగరం జిల్లాలో 1121 రకం విత్తనాలు, మన్యం జిల్లాలో ఎంటీయూ 1064, ఆర్‌జీఎల్ 2537 రకాల విత్తనాలు అత్యధికంగా వినియోగిస్తారు. ఈ రకాలన్నీ 135 నుంచి 140 రోజుల్లో పండుతుంది. వాతావరణం కలిసొచ్చి, ప్రకృతి కరుణిస్తే ఈ ఏడాది అక్టోబరు తొలి పక్షానికి పంట రైతుల చేతికి అందుతుంది.

**వెద సాగుకు ప్రాధాన్యం**

విజయనగరం జిల్లాలో సుమారు 5 వేల హెక్టార్లు, మన్యం జిల్లాలో సుమారు 12 వేల హెక్టార్ల వరకు వెద విధానంలో వరి పండిస్తారు. సకాలంలో కలుపు తొలగించకపోతే పంట ఉత్పత్తి పడిపోతుంది. రైతులకు తీవ్ర నష్టం కలుగుతుంది. ఈ కారణంగా అత్యధిక విస్తీర్ణంలో రైతులు వరి నాట్లు వేస్తారు.

**ప్రణాళిక ప్రకారం ముందుకు**

సాధారణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ఖరీఫ్ సాగు ప్రణాళిక అమలుకు యంత్రాంగం సిద్ధంగా ఉంది. విత్తనాలతో పాటు ఎరువులు సిద్ధం చేశాం. విత్తనాల కొనుగోళ్లు పూర్తయిన తర్వాత రైతు సేవా కేంద్రాల్లోని గిడ్డంగులకు ఎరువులు పంపిస్తాం. ప్రస్తుతం వసతి ఉన్న ఆర్‌ఎస్‌కేలకు విత్తనాలతో పాటు ఎరువులు చేరవేస్తున్నాం. ఖరీఫ్‌లో మన్యం జిల్లాలో కాస్త భిన్నంగా పంటల సాగు ఉంటుంది. వరి సహా రాగులు, కొర్రలు, సామ, పెసర, మినుము, కందులు, వేరుసెనగ, పొద్దుతిరుగుడు వంటి మెట్ట పంటలు పండిస్తారు. 15 వేల ఎకరాల్లో చిరుధాన్యాల సాగుకు ప్రణాళిక రూపొందించారు. 30 వేల ఎకరాల్లో వరి పండించే పొలాల గట్లపై కంది సాగు చేయాలని నిర్ణయించారు. గత నెలలో రైతులకు విత్తనాలు సరఫరా చేశారు. చిరుధాన్యాల విత్తనాలు రాయితీపై త్వరలో పంపిణీ చేస్తాం.

వి.టి.రామారావు, రాబర్ట్‌పాల్, జిల్లాల వ్యవసాయాధికారులు

# ధైర్యమే.. పునర్జన్మ

విజయనగరం :పార్వతీపురానికి చెందిన నాలుగేళ్ల చిన్నారికి క్యాన్సర్ ఉందని వైద్యులు తేల్చారు. దీంతో తల్లిదండ్రులు కొన్నాళ్లపాటు కాకినాడ మకాం మార్చి.. బిడ్డకు చికిత్స అందించగా క్యాన్సర్‌ను జయించింది. నాలుగేళ్లుగా ఇబ్బంది లేకుండా చక్కగా చదువుకుంటోంది. భయపడకుండా క్రమం తప్పకుండా మందులు వాడితే నయం అవుతుందని ఆ తల్లిదండ్రులు అంటున్నారు.

బెలగాం ప్రాంతానికి చెందిన ఓ గృహిణి 25 ఏళ్ల క్రితం క్యాన్సర్ బారినపడ్డారు. మనోధైర్యంతో వైద్యుల సూచన మేరకు మందులు వాడుతూ.. మంచి ఆహారం తీసుకోవడంతో పూర్తిగా నయం చేసుకోగలిగారు.క్యాన్సర్ అనే పదం చెవిలో పడగానే వణుకు మొదలవుతుంది. ఈ మహమ్మారి బారిన పడితే ప్రాణాంతకమని భయం. కానీ ఆరోగ్యంపై కాస్త శ్రద్ధ, కొంచెం అవగాహన ఉంటే ప్రాథమిక దశలోనే గుర్తించొచ్చు. సరైన చికిత్సతో జయించి.. ఆత్మీయులతో ఆనందంగా జీవించొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. నేడు 'క్యాన్సర్ సర్వైవర్స్ డే' సందర్భంగా ప్రత్యేక కథనం.

శరీరంలోని మార్పుల్ని గమనిస్తూ.. ఆరంభ దశలోనే గుర్తిస్తే మందులు మరింత ప్రభావంతంగా పనిచేసి, వ్యాధి నయం అవుతుందని వైద్యులు చెబుతున్నారు. క్యాన్సర్‌ను జయించి, బయట పడిన రోగులు చాలా మందే ఉన్నారు. కేవలం సీబీసీ రక్త పరీక్ష ద్వారా చాలా వరకు క్యాన్సర్ లక్షణాలను పట్టేయొచ్చు. విజయనగరం మహారాజా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇందుకు సంబంధించిన విభాగం 2024 అక్టోబరులో ఏర్పాటైంది. ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తించి, అవసరమైన చికిత్స అందేలా చూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో నెలకు 20 నుంచి 25 మంది వరకు మహిళలు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ బారినపడుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. పార్వతీపురం జిల్లాలో ఎన్‌సీడీ సర్వేలో 5,34,057 మందిని పరీక్షించగా అనుమానిత క్యాన్సర్ కేసులు 4,237, నిర్ధారణ అయినవి 335 ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.

**అమ్మాయిలూ.. టీకా వేసుకున్నారా?**

గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఇది ఇన్‌ఫెక్షన్ల వల్ల సోకుతుంది. ఇందులో హెచ్‌పీవీ వైరస్ వల్ల సోకే వ్యాధికి టీకా ఉంది. 9–24 ఏళ్లలోపు పెళ్లి కాని అమ్మాయిలు వేసుకోవడం వల్ల క్యాన్సర్ బారిన పడే అవకాశం చాలా తక్కువ. విజయనగరం సర్వజన ఆసుపత్రికి చేరుకుని, వైద్యుల్ని సంప్రదిస్తే వ్యాక్సిన్ వేస్తారు.

**లక్షణాలు**అతిగా బరువు తగ్గిపోవడం, బాగా జుట్టు ఊడటం, జ్వరం, అలసట, శరీరం ఎర్రగా, నల్లగా మారి, దురద రావడం, కళ్లు పసుపుగా మారడం, మూత్రాశయ తీరులో మార్పులు, గాయాలు మానకపోవడం, మలం నుంచి రక్తస్రావం, మింగడం కష్టమవ్వడం, విపరీతమైన దగ్గు.**వీటికి దూరంగా..**మద్యపానం, ధూమపానం, కృత్రిమ రంగులు, నిల్వ పదార్థాలు, ప్లాస్టిక్ పాత్రలు, కలుషితమైన వాతావరణం.

ఎన్టీఆర్ వైద్య సేవలో ఉచితం: ఎన్టీఆర్ వైద్య సేవలో ఉచితంగా చికిత్స అందుతుంది. విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో మొదటి, రెండో దశల్లో క్యాన్సర్ ఉంటే శస్త్రచికిత్సతో నియంత్రిస్తాం. మూడు, నాలుగు దశల్లో ఉంటే రేడియో థెరపీ, కీమోథెరపీ అవసరం.

# కదిరి మల్లెల గుబాళింపు

కదిరి : పరిమళాలు గుబాళించే మల్లెలంటే మహిళలకు మక్కువ. అందులో కదిరి మల్లెలంటే మరింతగా ఇష్టపడతారు. సువాసన, అలంకరణలో ప్రత్యేక ఆకర్షణ కదిరి మల్లెల సొంతం. అందుకే అతివలు ధర ఎంతైనా వెనుకాడకుండా కొనుగోలు చేస్తారు. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా వందల ఎకరాల్లో కదిరి మల్లెలు సాగులో ఉన్నాయి. ప్రధానంగా బుక్కపట్నం మండలం అగ్రహారం, పాముదుర్తిల్లో 49 ఎకరాలు, కదిరి ప్రాంతంలో 20 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సుమారు 200 మంది రైతులు మల్లెతోటల సాగు చేపట్టారు.



రోజుకు రెండున్నర టన్నుల దిగుబడి సాధిస్తున్నారు. ధర్మవరం, అనంతపురం, మదనపల్లి తదితర పట్టణాల్లోని మార్కెట్లకు తరలిస్తున్నారు.కిలో రూ.200 పలుకుతోంది. మాలలుగా అల్లితే ఒక్కోటి రూ.500కు పైగా అమ్ముతున్నారు. వివాహాలు, పండగల సీజన్‌లో కిలో రూ.1000కి తగ్గదు. గతంలో చెన్నై, బెంగళూరు నగరాలకు ఎగుమతి అయ్యేవి.

**మగువలకు పండగే..**

వేసవిలో మగువలకు మల్లెపూల పండగే. పెళ్లిళ్లు, పండుగలు, ఇతర శుభకార్యాల్లో మహిళలు పూల అలంకరణ చేసుకుంటారు. పూలజడ, కొప్పుల జడ వంటివి అల్లుతారు. ఇక పెళ్లిళ్లలో పూల వాలుజడ తప్పనిసరి. అట్టముక్కపై పూలు కుట్టి వాలుజడకు అమర్చుతారు. కురుల మధ్య పూలను పెట్టి అల్లటంతో వాలుజడను అలంకరిస్తారు.

# జలవనరుల శాఖలో ఖాళీల వెక్కిరింత!

రాజమహేంద్రవరం: ఉభయ గోదావరి జిల్లాలకు అత్యంత కీలకమైన జలవనరుల శాఖలో కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. అదనపు బాధ్యతలతో అధికారులు రెండేసి చోట్ల విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో గత అయిదేళ్లలో ఈ రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవగా.. కూటమి ప్రభుత్వమైనా చక్కదిద్దాలని రైతులంతా కోరుతున్నారు. అనేకమంది అధికారులు క్షేత్రస్థాయి బాధ్యతల కంటే పైరవీలు చేసి నాణ్యతా పరిశీలన విభాగంలో పనిచేసేందుకే ఆసక్తి చూపుతున్న పరిస్థితి. వచ్చేది వరదల కాలం. కీలకమైన ధవళేశ్వరం



బ్యారేజీ నిర్వహణ, పర్యవేక్షణకు 261 మంది అధికారులు, సిబ్బంది అవసరం కాగా కేవల్ల 20 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో నలుగురు ఆగస్టులోగా ఉద్యోగ విరమణ చేస్తారు. వరదల సమయంలో కనీసం 50 శాతం మంది విశ్రాంత ఉద్యోగుల నియామకానికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

**ఈఈలు ఇద్దరే..** ఉమ్మడి జిల్లాలో తూర్పు, మధ్య డెల్టాతోపాటు హెడ్‌వర్క్స్, డ్రెయినేజీ, ఏలేరు ప్రాజెక్టు, ఏలేరు డివిజన్, ఎవిఎంఎల్ ప్రాజెక్టులున్నాయి. కార్యనిర్వాహక ఇంజినీర్ల (ఈఈ) మెజార్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏడుగురు ఈఈలకు ఇద్దరు ఉండగా, అయిదుగురు అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) నిర్వర్తిస్తున్నారు. 25 మంది డిప్యూటీ ఇంజినీర్లకు 19 మంది ఉన్నారు. రెండు డివిజన్లలో ఎఫ్ఏసీలు బాధ్యతల్లో ఉన్నారు. ఏఈఈ స్థాయి పోస్టుల్లోనూ ఖాళీలు వెక్కిరిస్తున్నాయి.

# పచ్చి కొబ్బరికాయకు డిమాండ్

అంబాజీపేట: తమిళనాడు, కేరళ, కర్ణాటకలో కొబ్బరి కాయల దిగుబడి తగ్గడంతో కోనసీమ మార్కెట్ పుంజుకుంది. టన్నుకు ఎక్కువ కాయలు తూగుతుండటంతో కోనసీమ పచ్చికొబ్బరి కాయలకు డిమాండ్ ఏర్పడింది. ఇక్కడ కాయలు లెక్కన టోకున కొని ఇతర రాష్ట్రాల్లో టన్నుల లెక్కన విక్రయిస్తున్నారు. టన్నుకు సుమారు 3000 కాయలు వరకు తూగుతాయి. అక్కడ చిల్లర వ్యాపారులు కిలోల లెక్కన తూకం చేసి అమ్ముతుంటారు. ఇతర రాష్ట్రాల్లో కాయలు పెద్ద పరిమాణంలో ఉండటంతో కిలోకు రెండు, మూడు వస్తుండగా



ఆంధ్రప్రదేశ్ నుంచి కొనుగోలు చేసిన కాయలు నాలుగు వరకు తూగుతున్నాయి. ప్రస్తుతం సీజన్ కాకపోయినప్పటికీ ఇక్కడ వెయ్యి పచ్చి కొబ్బరి కాయల ధర రూ. 17 వేల నుంచి రూ. 17,500 వరకు పలుకుతోందని కొబ్బరి మార్కెట్ విశ్లేషకుడు పరసా సత్తిబాబు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. నిన్న మొన్నటి వరకూ వెయ్యి కొబ్బరికాయలు రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు ధర ఉంది. చిన్నకాయలకు డిమాండు ఉండటంతో కొరత ఏర్పడిందని అంటున్నారు. రైతుల నుంచి కాయలు కొనుగోలు చేసి తరలించేందుకు ట్రాక్టర్ల సమస్య కూడా ఉందంటున్నారు.

# కుటీర పరిశ్రమల ఏర్పాటు.. ఉపాధికి తోడ్పాటు



మడకశిర : కరోనా అనంతరం చాలా రంగాలు కుదేలయ్యాయి. వివిధ రంగాల్లో ఉపాధి కోల్పోయిన వారు ఇతర ఆదాయ మార్గాలను ఎంచుకుంటూ కొంతమంది యువత, మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. విభిన్నమైన కుటీర పరిశ్రమలు నెలకొల్పి స్వయంగా తయారీ, మార్కెటింగ్ వంటివి చేస్తున్నారు. మడకశిర నియోజకవర్గంలో పలువురు స్థానికంగానే కాకుండా బెంగళూరు, తుమకూరులోనూ చిన్నచిన్న పరిశ్రమలు స్థాపించుకుని నెలనెలా మంచి ఆదాయాన్ని పొందుతున్నారు.

**రోజుకు 4 గంటలు.. నెలకు రూ.35 వేల ఆదాయం**

చంద్రకళ భర్త కోదండరామిరెడ్డితో కలిసి గతంలో పాలు కొనుగోలు ప్యాకెట్లు తయారు చేసే పరిశ్రమలను స్థాపించారు. మార్కెట్లో పోటీ ఎక్కువ కావడంతో గిట్టుబాటు కాక నష్టపోయారు. కుంగిపోకుండా పాల డెయిరీని ఏర్పాటు చేసుకున్నారు. అలుపనపల్లి గ్రామ చుట్టు పక్కల గ్రామాల నుంచి పాడి రైతులు రోజూ రెండు పూటలా పాలను తీసుకొచ్చి ఈ డెయిరీలో పోస్తుంటారు. రోజూ దాదాపుగా 1200 లీటర్ల పాలను సేకరించి మడకశిరలోని విజయ డెయిరీకి సరఫరా చేస్తున్నారు. కమీషన్ ద్వారా రూ.1200 వచ్చేలా ప్రణాళిక చేసుకున్నారు. నెలకు రూ.35వేల వరకు ఎలాంటి ఖర్చులు లేకుండా నికర ఆదాయాన్ని సంపాదిస్తున్నారు.

**పనికిరాని వక్క పట్టలతో ..**

అమరాపురం మండలం గౌడనకుంట గ్రామంలో ఆనంద్‌కుమార్ రోజూ కూలీగా వక్కను కోసేందుకు వెళ్లేవాడు. తోటలో నేలరాలి వృథాగా పడి ఉన్న ఆకులతో ప్లేట్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు సంకల్పించుకున్నాడు. దీంతో పలువురితో విచారించుకుని రూ.5లక్షలు పెట్టుబడిగా పెట్టి 2019లో తమిళనాడు నుంచి యంత్రాలు తీసుకొచ్చి చిన్న పరిశ్రమ ఏర్పాటు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులతో పాటు మరో 5మంది ఇందులో పనిచేస్తుంటారు. వక్క ఆకులను నిల్వ చేసుకుని రోజూ వెయ్యి ప్లేట్లు తయారు చేస్తాడు. సగటున ఒక ప్లేటును రూ.3కు విక్రయించి ప్రతి నెలా దాదాపు రూ.లక్ష వరకు వస్తుండగా కూలీ ఖర్చులు పోనూ రూ.60వేలు, ఏడాదికి రూ.7లక్షల వరకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు. తయారు చేసిన వక్క ప్లేట్లు స్థానికంగానే కాకుండా బెంగళూరు, తుమకూరు, విజయవాడ, గుంటూరు, తమిళనాడుకు ఎగుమతి చేస్తారు.

**పది మందికి ఉపాధి..**

స్వయం సహాయక సభ్యురాలిగా చేరి సంఘంలో రుణం తీసుకుని చిరుతిళ్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసుకుంది. బ్యాంకు ద్వారా రూ.2లక్షలు రుణం తీసుకుని పదేళ్లుగా చిరుతిళ్ల తయారీ, స్వయంగా మార్కెటింగ్ చేసుకుంటోంది. నెలకు రూ.70వేలు ఆదాయం సంపాదిస్తూ మరో 10మందికి ఉపాధి కల్పిస్తోంది. సంఘంలో తీసుకున్న రుణాన్ని వృథా చేయకుండా ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ఈ పరిశ్రమ స్థాపించి బాగా స్థిరపడ్డారు.రాజమ్మ, స్వయం సహాయక సభ్యురాలు, మడకశిర

# పోలీసుకు తోడుగా కృత్రిమ మేధ




అనంతపురం: కేసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వాటికి సంబంధించిన నివేదికలు రూపొందించడం పోలీసులకు భారంగా మారుతోంది. ఛార్జిషీటు దాఖలు, కోర్టులకు నివేదికల సమర్పణ.. కత్తిమీద సాములా మారాయి. పని ఒత్తిడితో నేర విచారణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లా పోలీసులు సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకెళ్తున్నారు. ఫిర్యాదుల నమోదు, నేర విచారణకు సంబంధించిన నివేదికల తయారీలో కృత్రిమ మేధ (ఏఐ)ను సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏఐ టూల్స్‌ను తమకు కావాల్సిన రీతిలో ఉపయోగించుకుంటూ నేర విచారణలో వేగం పెంచుతున్నారు. గతంతో పోలిస్తే కేసుల డ్రాఫ్టింగ్‌లో తప్పులు 90 శాతానికి పైగా తగ్గడంతో పాటు కచ్చితత్వం పెరిగినట్లు చెబుతున్నారు. సమయం ఆదాతో పాటు మంచి ఫలితాలు వస్తుండటంతో కిందిస్థాయి సిబ్బందికి ఏఐపై అవగాహన కల్పిస్తున్నారు.

**సెక్షన్లు చెప్పేస్తోంది**

ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ఆధారంగా ఏయే సెక్షన్లను పొందుపరచాలో ఏఐ సూచిస్తోంది. విచారణ తీరు, ఆధారాల సేకరణ వివరాలను ఒక క్రమపద్ధతిలో సూచిస్తుంది. తద్వారా విచారణ వేగవంతంగా చేసేందుకు వీలవుతుందని పోలీసులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన నిందితుల విచారణ సమయంలో భాషానువాదం సమస్య లేకుండా పూర్తి కచ్చితత్వంతో అవగాహన కలిగేలా పోలీసులకు సహకారం అందిస్తుంది.

**తప్పులను ఎత్తి చూపుతూ..**

ఎఫ్ఐఆర్ నమోదు తర్వాత ఏ కోణంలో విచారించాలో ఏఐ సూచిస్తోంది. విచారణ అనంతరం పోలీసులు దాఖలు చేసే ఛార్జిషీటు ఏఐ పరిశీలించి తగిన సూచనలు చేస్తుంది. ఛార్జిషీటులో దొర్లిన తప్పులను ఎత్తి చూపడంతో పాటు అదనపు సమాచారం అవసరమైతే.. పొందుపరచాలని చెబుతుంది. కోర్టులో వాదనల సమయంలో ఎలాంటి అంశాలు ప్రస్తావించాలి? డిఫెన్స్ లాయర్ నుంచి ఎలాంటి ప్రశ్నలు ఎదురుకావచ్చు? తదితర అంశాలను ముందుగానే అంచనా వేస్తుంది. సమర్థవంతంగా వాదనలు వినిపించేందుకు ఎలా సిద్ధం కావాలో సూచిస్తుంది. కోర్టులో ఏ సందర్భాల్లో ఎలా నడుచుకోవాలో చెబుతుంది.

**చెబితే రాసేస్తుంది..**

ఫిర్యాదుల నమోదుకు సంబంధించి బాధితులు చెప్పే విషయాలను రాసుకోవడం.. కంప్యూటర్‌లో నమోదు ప్రక్రియ కొన్ని సందర్భాల్లో కష్టంగా మారుతోంది. దీన్ని సులభతరం చేయడానికి ఏఐ విధానంలో బాధితులు సమస్యలు చెబుతుంటే అక్కడికక్కడే రికార్డ్ చేసి.. ఫిర్యాదును సిద్ధం చేస్తుంది. అక్షర జ్ఞానం లేనివారు, వృద్ధులు, ఫిర్యాదులు రాయలేని వారికి ఎక్కువగా ఉపయోగపడుతుంది. ఈ విధానంలో ప్రయోగాత్మకంగా ఇప్పటివరకు 54 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

**సమయం ఆదాతోపాటు కచ్చితత్వం**

జగదీశ్, జిల్లా ఎస్పీ, అనంతపురం

నేర విచారణలో ఏఐను వినియోగించడంతో సమయం ఆదా అవుతోంది. నివేదికల తయారీలో వేగంతో పాటు కచ్చితత్వం పెరుగుతుంది. తద్వారా శిక్షల శాతం పెంచేందుకు ఏఐ ఉపయోగపడుతోంది. ప్రస్తుతం జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లో నూతన సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. త్వరలోనే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు నమోదు చేసేందుకు ఏఐను వినియోగిస్తాం.

# పంచాయతీలో అవినీతి రాజ్

ఒంగోలు : పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి(పీఆర్ ఆర్డీ) శాఖ.. గత ప్రభుత్వంలో వైకాపా నేతల జేబు సంస్థగా మారింది. అప్పట్లో కొన్ని గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలను ఇష్టారీతిన నిర్మించినా అడ్డుకోలేదు. నిబంధనలకు నీళ్లొదిలినా కిమ్మనలేదు. ఇసుకను అమ్మేసుకున్నా పట్టించుకోలేదు. తీరా విచారించి చర్యలు చేపట్టాలని ఇప్పుడు ఆదేశిస్తున్నా.. ఇంకా కదలడం లేదు.

**వై.పాలెంలో**

గత ప్రభుత్వంలో వైకాపా నేతలు రెచ్చిపోయారు. వై.పాలెం సబ్ డివిజన్ పరిధిలో ప్రభుత్వ పనులకు కేటాయించిన ఇసుకను ఇష్టారాజ్యంగా దారి మళ్లించి అమ్మేసుకున్నారు. రూ.65 లక్షల విలువైన 17,333 మెట్రిక్ టన్నుల ఇసుకను దుర్వినియోగం చేసినట్లు విజిలెన్స్ అధికారులు రెండేళ్ల క్రితమే తేల్చారు. దీంతో కూటమి ప్రభుత్వం స్పందించింది. అప్పటి డీఈఈ జి.రతన్‌బాబు(ప్రస్తుత ఒంగోలు పీఐయూ ఈఈ), త్రిపురాంతకం మండల సైట్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వర్లు, వై.పాలెం ఏఈ పి.మహంకాళయ్య, పుల్లలచెరువు ఏఈ టి.నాగప్పలపై విచారణకు ఆదేశిస్తూ గత నెల 20న ఉత్తర్వులు జారీ చేసింది.

**కొండపిలో కొల్లగొట్టారు** కొండపి నియోజకవర్గంలోని గుండ్లసముద్రం నుంచి చిలంకూరు మధ్య ఐదు వంతెనలు నిర్మించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. నిర్మాణ పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు నిర్ధారించి 2024 జులై 22న నివేదిక సమర్పించారు. బాధ్యులైన అప్పటి సింగరాయకొండ ఏఈఈ సి.శ్రీధర్‌రెడ్డితో పాటు డీఈఈ(పీఐయూ ఎస్డీ) జి.గంగయ్య, ఈఈ(పీఐయూ ఒంగోలు) వి.మారుతీరాంపై చర్యలు తీసుకోవాలని, మూడు గుత్తేదారుల సంస్థల నుంచి రూ.2.96 లక్షలు రికవరీ చేయాలని సిఫార్సు చేశారు. ఆ మేరకు గత నెలలో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

**ఫ్చ్.. ఆదేశించినా కదలిక లేదు**

రోడ్లు, భవనాల శాఖ కార్యాలయ ఖర్చుల నిమిత్తం సర్కారు విడుదల చేసిన రూ.21.29 లక్షలకు లెక్కలు సరిగా లేవని అకౌంటెంట్ జనరల్ ఆఫీస్(ఏజీ) ఆడిట్ అధికారులు గుర్తించారు. మెమోలు జారీ చేసినా లెక్కలు సమర్పించని సంబంధిత సీనియర్ అసిస్టెంట్‌పై క్రిమినల్ చర్యలకు ఆదేశించారు. అయినా పంచాయతీ రాజ్ శాఖలో మాత్రం ఎలాంటి కదలిక లేదు. అక్రమాలు గుర్తించిన వెంటనే ఉన్నతాధికారులు విచారణ పేరిట చర్యలు తీసుకోకుండా జాప్యం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్కారు సొమ్ము దుర్వినియోగం చేసిన వారిపై పక్కా చర్యలు తీసుకుంటేనే అక్రమాలకు అడ్డకట్ట పడుతుందని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ఆర్డీ ఎస్ఈ నిశాంత్ హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కొక్కటిగా విచారణ చేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మామిడి.. మిగలని దమ్మిడి

పాకాల : మామిడి రైతుల బతుకులు వీధిన పడుతున్నాయి. కాయలను అడిగేవారు లేక, గిట్టుబాటు ధరలు దక్కక, ఆదాయం రాక, అప్పులు తీర్చలేని దుస్థితి వారిని మరింత కష్టాల్లోకి నెడుతోంది. సీజన్ సగం ముగుస్తున్నా గుజ్జు పరిశ్రమలు దాష్టీకాన్ని ప్రదర్శిస్తున్నాయి. మండీల్లో ఎటుచూసినా కాయలతో నిండిపోవడంతో ఇక వద్దంటూ పంటను తీసుకోవడం లేదు. దీంతో ఇప్పటికీ తోటల్లో ఉన్న పంటను కోసి అమ్ముకోలేని దారుణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. మామిడిని నమ్ముకున్న చిరు వ్యాపారులు సైతం ఏళ్లుగా కూడబెట్టుకున్న సొమ్ము పోయి రోడ్డున పడుతున్నారు.

**పదిహేను ఎకరాల తోట.. పెట్టుబడీ రాక**

దామలచెరువు పంచాయతీ నల్లానివారిపల్లికి చెందిన రైతు నారా బాబునాయుడు కుటుంబానికి సుమారు 15 ఎకరాల మామిడి తోట ఉంది. గతేడాది రూ.8 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది రూ.3 లక్షలు ఖర్చు పెట్టారు. పంట చేతికొచ్చింది. పక్వానికి వచ్చిన కాయలు మాగి రాలుతున్నాయి. ఏదో ఒక ధరకైనా కాయలను కోసి అమ్మేద్దామంటే అడిగేవారు లేరు. పెట్టుబడి ఖర్చులైనా వస్తాయనే



నమ్మకం పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కమ్మిన దైన్యం**

పులిచెర్ల మండలం మంగళంపేటకు చెందిన షేక్ ఇస్మాయిల్‌కు 5 ఎకరాల మామిడి తోటతోనే జీవనం. నీటి కొరత రావడంతో రూ.3 లక్షలు అప్పుచేసి బోరు తవ్వాడు. విద్యుత్ సర్వీసుకు రూ.60 వేలు ఖర్చు పెట్టాడు. కనీసం 15 టన్నుల దిగుబడి వస్తుందని, కష్టాలు గట్టెక్కవచ్చని ఆశపడ్డాడు. ధరలు పడిపోవడంతో అప్పులెలా తీర్చాలో తెలియక సతమతమౌతున్నాడు.

**పదేళ్ల సంపాదన ఆవిరి**

దామలచెరువుకు చెందిన కోవూరు చిన్నబ్బసాహెబ్ పదేళ్లుగా చిన్న చిన్న తోటల్లో పంట కొంటూ వ్యాపారం చేస్తున్నారు. ఈ సారి రూ.15 లక్షలు పెట్టి పాతిక మంది రైతుల తోటలను లీజుకు తీసుకున్నారు. ఇప్పటి వరకు రూ.3 లక్షల రాబడి వచ్చింది. ఇంకా తోటల్లో మిగిలిన పంటను పూర్తిగా కోసి అమ్ముకున్నా మరో రూ.2 లక్షలకు మించి వచ్చేలా లేదు. ఈ మొత్తం కోత కూలీలు, రవాణా ఖర్చులకు సరిపోతోంది. రైతుల వద్దకు వెళ్లి తగ్గించుకోమని ప్రాధేయపడినా స్పందన కరవైంది. పదేళ్ల సంపాదన పూర్తిగా పోయిందని కుంగిపోతున్నాడు.

# కన్నీటి గాయం.. ఆపదలో సాయం

కర్నూలు : రహదారి ప్రమాదాల్లో గాయపడిన, ప్రాణాలు కోల్పోయిన బాధితులకు కేంద్రం చేయూతనిస్తోంది. ఆయా కుటుంబాలకు అండగా ఉండేందుకు సాయమందిస్తోంది. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన సందర్భంలో సదరు వాహనాన్ని పోలీసులు గుర్తించే వరకు ప్రమాద బీమా వర్తించదు. ఇలాంటి ఘటనల్లో క్షతగాత్రులు లేదా చనిపోయినవారి కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హిట్ అండ్ రన్ పథకం కింద ఆర్థిక సాయం అందిస్తూ కొండంత అండగా నిలుస్తోంది. ఈ పథకం కింద మృతి చెందిన వారికి సంబంధించి బాధిత కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు, గాయపడినవారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతుంది. కానీ చాలామంది బాధితులకు దీనిపై అవగాహన లేదు. ఫలితంగా పథకాన్ని సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి.

**అక్కడే ఆలస్యం**

హిట్ అండ్ రన్ పథకానికి సంబంధించి ఆర్డీవో నోడల్ అధికారిగా ఉంటారు. ప్రమాదానికి సంబంధించి బాధితులు ఎఫ్ఐఆర్‌తో పాటు ఆధార్ పత్రాలు, సమగ్ర సమాచారాన్ని నివేదిక రూపంలో అందించాలి.



ఆర్డీవో దీనిని పరిశీలించి కలెక్టర్‌కు సిఫారసు చేస్తారు. పోలీసు శాఖ నుంచి నివేదిక అందిన తర్వాత 15 రోజుల్లో పరిహారాన్ని బాధితుల ఖాతాలో జమ చేస్తారు. కాగా పోలీసులు, ఆర్డీవో ఇచ్చే నివేదికలపైనే పరిహారం ఆధారపడి ఉంటుంది.

**జిల్లా న్యాయసేవాధికార సంస్థ చొరవ**

హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రత్యేక దృష్టి సారించి నిత్యం సమీక్షిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న నగరంలోని న్యాయసేవాసదన్‌లో రెవెన్యూ, పోలీసు అధికారులతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి పలు కేసులపై చర్చించారు. కర్నూలు జిల్లాలో 76, నంద్యాల జిల్లాలో 38 హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి నివేదికలు సిద్ధమవుతున్నట్లు తెలుసుకున్నారు. బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

**దరఖాస్తు ఇలా..** రహదారి ప్రమాదాల్లో గాయపడినవారు, మృతి చెందిన వారికి సంబం ధించి బాధితుల కుటుంబసభ్యులు హిట్ అండ్ రన్ కింద పరిహారం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. క్షతగాత్రులు ఫారం-1లో వ్యక్తిగత వివరాలతోపాటు ప్రమాద స్థలం, జరిగిన సమయం, గాయాల వివరాలు, ఎఫ్ఐఆర్ కాపీ, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు జత చేయాల్సి ఉంటుంది. మృతి చెందితే వారి తల్లిదండ్రులు గానీ.. భార్య ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, చనిపోయిన వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రాన్ని జత చేసి అందించాలి. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది పరిహారం పొందాలనుకుంటే ఫారం-4 దరఖాస్తు పూరించి ఆసుపత్రి బిల్లులు జత చేయాల్సి ఉంటుంది. అధికారులు దరఖాస్తును పరిశీలించి ఫారం-2, ఫారం-3 నమోదు చేసి కలెక్టరేట్ లోని సి.సెక్షన్‌కు పంపుతారు. అక్కడినుంచి కలెక్టర్‌కు దరఖాస్తు చేరుతుంది.

చురకలు



# ప్రకృతి మధ్య అనసూయ న్యాచురల్ లుక్స్.. సో బ్యూటీఫుల్

ప్రముఖ యాంకర్ గా, నటిగా తెలుగు ప్రేక్షకులలో మంచి క్రేజ్ అందుకున్న అనసూయ భరద్వాజ తాను పోస్ట్ చేసిన లేటెస్ట్ ఫోటోషూట్‌తో మళ్లీ సోషల్ మీడియాను కదిలించింది. సింపుల్‌గా, ఉన్న ఓ సాంప్రదాయ సారీలో ప్రకృతిలో నిలబడి ఆమె ఇచ్చిన సందేశం ఎంతో భావోద్వేగాన్ని కలిగించింది. "భూమి మనకు చెందదు, మనమే భూమికి చెందాము" అనే మాటలతో ఆత్మీయతను వ్యక్తం చేశారు. ఈ ప్రకృతి ప్రేరణతో కూడిన లుక్స్ ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఆరెంజ్ అండ్ బ్రౌన్ షేడ్స్ కలిగిన ట్రెడిషనల్ కాటన్ సారీలో కనిపించిన అనసూయ... చీరకట్టులోనూ ఎలా ఉంటుందో చాటిచెప్పింది. చేతిలో టోటీ బ్యాగ్, చెవిపోగులు, చేతికట్లు,



ఆహ్లాదకరమైన చిరునవ్వుతో ఆమె ఫోటోలు చూస్తే, సహజంగా ఆకర్షితులయ్యేలా ఉంటాయి. ఆడపిల్లలందరికీ ఇది ఓ అందమైన ఇన్స్పిరేషన్ లా నిలుస్తుంది. కనీసమైన మేకప్‌తో మెరిసిపోతూ, ఫోటోలో ప్రకృతి కంటే ప్రకృతిరమ్యంగా కనిపించడంలో అనసూయ ప్రత్యేకత కనిపిస్తోంది. అనసూయ కెరీర్ విషయానికి వస్తే... యాంకరింగ్‌లోనే కాదు, నటనలోనూ తనదైన ముద్ర వేసింది.

'జబర్దస్త్' షోతో స్టార్ యాంకర్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఆమె, తర్వాత 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప' వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి విమర్శకుల ప్రశంసలు పొందారు. గ్లామర్ పాత్రలతో పాటు డిఫరెంట్ పాత్రలకు కూడా ఆమె ఆసక్తి చూపుతూ, తన పరిధిని విస్తరిస్తున్నారు. నటిగా తనను నిరూపించుకోవడంలో ఆమె ఎంత శ్రమ పెడతారో ప్రతి సినిమాతో తెలిసిపోతోంది.

# స్లిమ్ సీక్రెట్ చెప్పేసిన నయా నటి!

తమ్ముడు చిత్రంతో లయ కంబ్యాక్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఒకప్పుడు హీరోయిన్ గా రాణించిన లయ కెరీర్ పీక్స్ లో ఉండగానే హీరోయిన్ అవకాశాలు వదులుకుని పెళ్లి చేసుకుని స్థిరపడింది. అప్పటి నుంచి ఇంతవరకూ మళ్లీ సినిమాల వైపు చూడలేదు. తమ్ముడుతోనే రీఎంట్రీ ఇస్తుంది. కానీ అప్పటి లయకు- ఇప్పటి లయకు పెద్దగా వ్యత్యాసం లేదన్నది కాదనలేని వాస్తవం. లయ ఇప్పటికీ హీరోయిన్ మెటీరియల్. వయసు జస్ట్ నెంబర్ మాత్రమే అనిపిస్తుంది. లయ వయసిప్పుడు నాలుగు పదులు దాటాయి. 43



రన్నింగ్ లో ఉంది. ఇద్దరు పిల్లల తల్లి. కానీ 30 ఏళ్ల భామలాగే వైరల్ అవుతుంది. మరి ఈ బ్యూటీ సీక్రెట్ ఏంటి? మంచి ఫిట్ నెస్ ప్రియురాలా? యోగా, జిమ్ లాంటివి లైఫ్ లో భాగం చేసుకుందా? అంటే అలాంటిందేమి లేదు. కేవలం మితంగా తినడం ద్వారానే ఇలా ఉన్నట్లు తెలిపింది. పెళ్లికి ముందు నుంచి కూడా మితంగా తినడం అలవాటు అని ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నానని తెలిపింది. కడపు నిండుగా తినడం అన్నది ఇంతవరకూ ఎప్పుడూ జరగలేదని..అందుకే సన్నగా ఉన్నానంది. అలాగే పూర్తి శాఖాహారి అట. కానీ వంటకాలన్ని మాత్రం స్పైసీ గా ఉంటాయట. పప్పు, కూర, పచ్చడి ఏదైనా సరే అన్నంలో పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకుంటుందిట. వాటన్నింటిని తానే స్వయంగా తయారు చేసుకుంటుందిట. బయట ఫుడ్ తినదట.

అమెరికాలో ఉన్న పుడు పిల్లల కోసం, భర్త కోసం లంచ్ బాక్సులు తయారు చేయడం లాంటివి ఏవీ ఉండవని...అన్ని వాళు న్న ప్రదేశాల్లోనే అందుబాటులో ఉంటాయంది. సాయంత్రం మాత్రమే వంట చేస్తుందిట. తాను తినేది కూడా తక్కువ కావడంతో మరుసటి రోజు వాటినే తీసుకుంటాని తెలిపింది.




# మొన్న రామ.. నిన్న కర్ణ.. నేడు రుద్ర



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న విషయం తెలిసిందే. అయితే జూన్ నెలతో డార్లింగ్ కు స్పెషల్ బాండ్ ఉన్నట్టు క్లియర్ గా కనిపిస్తుంది. ఆ మంత్ లో మూడేళ్లుగా తన సినిమాలతో థియేటర్ లో సందడి చేస్తున్నారు ప్రభాస్. 2023లో ఆది పురుష్ తో, 2024లో కల్కి 2898 ఏడీతో, 2025లో కన్నప్పతో వచ్చారు. అక్కడ ఇంకో విషయమేమిటంటే.. మూడు సినిమాలు కూడా మైథలాజికల్ జోనర్ లో వచ్చినవే. ప్రభాస్ పోషించిన రోల్స్.. పురాణ నేపథ్యంతో ఉండటం విశేషం. ఆదిపురుష్ రాముడిగా కనిపించిన ప్రభాస్.. కల్కి 2898 ఏడీలో కర్ణుడిగా సందడి చేశారు. ఇప్పుడు కన్నప్పలో రుద్ర క్యారెక్టర్ లో మెప్పించారు. క్యామియో రోల్ పోషించినా అదరగొట్టారు. దీంతో ఇప్పుడు ఆ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నెట్టింట తెగ సందడి చేసున్నారు ప్రభాస్ అభిమానులు. మూడు రోల్స్ కు సంబంధించిన లుక్స్ ను వైరల్ చేస్తున్నారు. అయితే మూడు చిత్రాల్లో ఆది పురుష్ డిజాస్టర్ గా మారినా.. కల్కి 2898 ఏడీతో పాటు కన్నప్ప చిత్రాలు మంచి విజయాలు సాధించాయి. కాగా ఆ సినిమాల విషయానికొస్తే.. ప్రభాస్ రాముడి రోల్ లో తెరకెక్కిన ఆదిపురుష్ కు బాలీవుడ్ దర్శకుడు ఓం రౌత్ దర్శకత్వం వహించారు. సీతగా కృతి సనన్, రావణుడిగా సైఫ్ అలీ ఖాన్ నటించిన ఆ సినిమా 2023 జూన్ 16వ తేదీన రిలీజైంది. భారీ అంచనాల మధ్య విడుదలైన మూవీ.. బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా మారింది. ట్రోల్స్ కూడా ఎదుర్కొంది. ఆ తర్వాత గత ఏడాది జూన్ 27వ తేదీన కల్కి 2898 ఏడీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఆ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ తదితర ముఖ్య పాత్రలు పోషించారు. క్లైమాక్స్ లో కర్ణుడిగా ప్రభాస్ కనిపించి ఆకట్టుకున్నారు. సీక్వెల్ లో ఆయన రోల్ కీలకంగా ఉండనుందని ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. ఇప్పుడు తాజాగా కన్నప్పలో రుద్ర క్యారెక్టర్ లో ప్రభాస్ ఆద్యంతం మెప్పించారు. భక్త కన్నప్ప చరిత్ర ఆధారంగా రూపొందిన ఆ సినిమాకు మెయిన్ పాజిటివ్ ఎలిమెంట్ గా నిలిచారు. ఆయన తప్ప ఎవరూ ఆ రోల్ కు సెట్ అవ్వరనేలా నటించారు. శుక్రవారం రిలీజ్ అయిన కన్నప్ప.. అన్ని సెంటర్స్ లో దూసుకుపోతోంది. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతోంది.

# తెలుగు ప్రేక్షకులకు బిగ్‌బాస్ రిటర్న్ గిఫ్ట్



తెలుగు బుల్లి తెర ప్రేక్షకుల ముందుకు బిగ్‌బాస్ మరోసారి రాబోతున్నాడు. ఇప్పటి వరకు ఎనిమిది సీజన్‌లు పూర్తి చేసుకున్న తెలుగు బిగ్‌బాస్ ఈ ఏడాది 9వ సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటన వచ్చింది. బిగ్‌బాస్ తెలుగు హోస్ట్ మారుతాడు అంటూ పుకార్లు పెద్ద ఎత్తున షికార్లు చేశాయి, విజయ్ దేవరకొండ మొదలుకుని పదుల సంఖ్యల హీరోల పేర్లు బిగ్‌బాస్ హోస్ట్‌గా వినిపించాయి. చివరకు నాగార్జున హోస్ట్ అంటూ అధికారిక ప్రకటన వచ్చింది. రెండు రోజుల క్రితం బిగ్‌బాస్ సీజన్ 9 ను అధికారికంగా ప్రకటించారు. ప్రోమోను విడుదల చేయడం ద్వారా అధికారికంగా ప్రకటన చేసిన షో నిర్వాహకులు మరో ఆసక్తికర ప్రకటన చేశారు. బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 హోస్ట్‌గా నాగార్జున కన్ఫర్మ్ కాగా, కంటెస్టెంట్స్ విషయమై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలతో షో నిర్వాహకులు ఒప్పందం చేసుకున్నారనే వార్తలు వస్తున్నాయి.

త్వరలోనే ఈ సీజన్ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో తాజాగా వచ్చిన ప్రోమోతో ఆసక్తికర విషయాన్ని ప్రకటించారు. ఈసారి బిగ్ బాస్ హౌస్‌లోకి సెలబ్రిటీలు మాత్రమే కాకుండా సామాన్యులకు కూడా ఎంట్రీ దక్కబోతోంది. గతంలోనూ సామాన్యులకు చోటు దక్కింది. ఆ సమయంలో కొన్ని విమర్శలు వచ్చాయి. పైరవీలు నడిపించిన వారికి మాత్రమే చోటు దక్కిందని, ఆ సమయంలో ఎంపిక సరిగ్గా జరగలేదు అంటూ చాలా మంది విమర్శించారు. ఈసారి అలాంటి తప్పు జరగకుండా ఉండేందుకు గాను జాగ్రత్తలు జడుతున్నారు. బిగ్‌బాస్ షో నిర్వాహకులు ఆడిషన్స్ నిర్వహించబోతున్నారు. బిగ్‌బాస్ హౌస్‌కి ఎందుకు వెళ్లాలి అనుకుంటున్నారు, మీ యొక్క ప్రతిభ ఏంటి అనేది తెలియజేస్తూ ఒక వీడియోను పంపించాలని ఒక లింక్‌ను నిర్వాహకులు ఇచ్చారు. బిగ్‌బాస్ సీజన్ 9 ఆగస్టులో ప్రారంభం అయ్యే అవకాశం ఉందని, అప్పటి వరకు ఈ ఎంపిక జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రతి సీజన్ కంటే ఈ సీజన్ కాస్త ముందుగానే ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అందుకే కంటెస్టెంట్స్ ఎంపిక విషయంలో స్పీడ్‌గా ఉన్నారు. ఇదే సమయంలో సామాన్యులకు ఛాన్స్ ఇవ్వనున్నారు. తాజా ప్రోమోలో తెలుగు బిగ్ బాస్‌ను ఇంతటి ఘన విజయాన్ని చేసినందుకు గాను ప్రేక్షకులకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని భావిస్తున్నాం అని, ఆ గిఫ్ట్ ఏంటంటే ప్రేక్షకులను బిగ్‌బాస్ హౌస్‌లోకి పంపడం అంటూ నాగార్జున ప్రోమోలో చెప్పుకొచ్చాడు. మొత్తానికి బిగ్ బాస్ సీజన్ 9 మరోసారి అందరి దృష్టిని ఆకర్షించే అవకాశాలు ఉన్నాయి. సెలబ్రిటీలతో పాటు సామాన్యులు హౌస్‌లో ఉంటే కచ్చితంగా కంటెంట్ బాగుంటుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. గత సీజన్ ప్రేక్షకులను మెప్పించడంలో విఫలం అయింది. అందుకే సామాన్యులు ఉంటే కాస్త కంటెంట్ కొత్తగా ఉంటుందని, హిట్ దక్కడం ఖాయం అని అనుకుంటున్నారు. అందుకే బిగ్‌బాస్ లో సామాన్యులకు ఛాన్స్ ఇవ్వబోతున్నారు.

# మృణాల్ రెండు పడవల ప్రయాణం!

రాజమౌళి, కన్నడ రాకింగ్ స్టార్ యష్‌ల తరహాలో టీవీ సీరియల్ నుంచి వెండితెరపై ప్రత్యక్షమైన మరాఠీ బ్యూటీ మృణాల్ ఠాకూర్. 'సీతారామం'తో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించిన మృణాల్ విభిన్నమైన పాత్రలని ఎంచుకుంటూ కథానాయికగా హిందీ, తెలుగు భాషల్లో మంచి గుర్తింపుని సొంతం చేసుకుంది. మాతృభాష మరాఠీలో సినిమాలు తగ్గించి కేవలం హిందీ, తెలుగు భాషలపైనే ప్రత్యేక దృష్టిపెట్టింది. తెలుగులో నటించిన తొలి చిత్రం 'సీతారామం'తో మంచి మార్కులు కొట్టేసిన మృణాల్ ప్రస్తుతం ఆరు క్రేజీ ప్రాజెక్ట్‌లలో నటిస్తోంది. అందులో రెండు తెలుగు సినిమాలు, నాలుగు హిందీ మూవీస్. ఇందులో ముందుగా అజయ్‌దేవగన్ నటిస్తూ నిర్మిస్తున్న 'సన్నాఫ్ సర్దార్ 2' ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దీన్ని 'సన్నాఫ్ సర్దార్'కు సీక్వెల్‌గా రూపొందించారు. తెలుగు హిట్ ఫిల్మ్ 'మర్యాద రామన్న' ఆధారంగా 'సన్నాఫ్ సర్దార్' రూపొందిన విషయం తెలిసిందే. అయితే తెలుగులో సీక్వెల్ చేయకుండానే కొత్త కథతో అజయ్‌దేవ్‌గన్



'సన్నాఫ్ సర్దార్'కు సీక్వెల్‌ని చేస్తున్నాడు. ఇందులో అజయ్‌కి జోడీగా మృణాల్ కనిపించనుంది. యాక్షన్ కామెడీగా రూపొందుతున్న ఈ మూవీని జూలై 25న భారీగా రిలీజ్ చేస్తున్నారు. ఇందులో మృణాల్ పంజాబీ అమ్మాయిగా కనిపించనుంది. దీనితో పాటు హిందీలో మరో మూడు సినిమాలు చేస్తోంది. హై జవానీతో ఇష్క్ హెూనా హై, తుమ్ హెూతో, పూజా మేరీ జాన్ వంటి సినిమాల్లో నటిస్తోంది. ఇక తెలుగులో అడివి శేష్ నటిస్తున్న 'డెకాయిట్' చేస్తోంది. శృతిహాసన్ తప్పుకోవడంతో ఆ అవకాశాన్ని మృణాల్ దక్కించుకుంది. ఇక ఈ సినిమాతో పాటు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తున్న పాన్ వరల్డ్ మూవీలోనూ మృణాల్ ఠాకూర్ నటిస్తోంది. దీపికా పదుకునే మెయిన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో మృణాల్ ఠాకూర్ కూడా మరో హీరోయిన్‌గా కనిపించనుంది.

సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ మృణాల్ ఠాకూర్ కెరీర్‌కు ఓ మైలురాయిలా నిలిచే అవకాశం ఉందని, ఈ సినిమాతో స్టార్ హీరోయిన్‌ల జాబితాలో మృణాల్ చేరుతుందని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. హిందీతో పాటు తెలుగులోనూ క్రేజీ సినిమాల్లో నటిస్తూ రెండు పడవల ప్రయాణాన్ని సాఫీగా సాగిస్తున్న మృణాల్ రానున్న రోజుల్లో భారీ విజయాల్ని దక్కించుకుని స్టార్ హీరోయిన్‌ల జాబితాలో చేరడం ఖాయం.

# ఇది తేడా కొడితే చోప్రా నెక్స్ట్ ప్లాన్ ఏంటి?

సిటాడెల్ సిరీస్ డిజాస్టర్ అయిన తర్వాత ప్రియాంక చోప్రా చూపులు పూర్తిగా భారతీయ సినిమా వైపు ప్రసరించిన సంగతి తెలిసిందే. క్వాంటికోతో హాలీవుడ్ లో అడుగు పెట్టి ఘనంగా భారీ ప్రాజెక్టులతో బిజీ అయిపోయిన ప్రియాంక చోప్రా ఉన్నట్టుండి భారతీయ సినిమా వైపు చూడటం, నేరుగా పాన్ ఇండియాలో దూసుకెళుతున్న టాలీవుడ్ లో అడుగుపెడుతుండడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పీసీ ప్రస్తుతం రాజమౌళి- మహేష్ కాంబినేషన్ లోని భారీ పాన్ ఇండియన్ సినిమా ఎస్.ఎస్.ఎం.బి 29లో నటిస్తూ బిజీగా ఉంది. ఈ సమయంలోనే హాలీవుడ్ లో నటించిన పెండింగ్ సినిమా హెడ్స్ ఆఫ్ స్టేట్ విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమాలో ఇడ్రిస్ ఎల్బా ,జాన్ సెనా వంటి అద్భుతమైన తారాగణం నటించినా అందరి దృష్టి ప్రియాంక చోప్రా వైపే ఉంది. ఈ భామ సినిమా ప్రచార కార్యక్రమాలలోను ప్రధాన ఆకర్షణగా మారింది. అయితే భారతదేశంలో ఈ సినిమాకి ఆశించిన ప్రచారం లేకపోవడంతో, అంతగా హైప్ క్రియేట్ చేయడంలో విఫలమైంది. అలాగే ప్రమోషనల్ మెటీరియల్ కి కూడా ఇక్కడ ఆశించిన గుర్తింపు దక్కలేదు. దీంతో



జూలైలో రిలీజ్ ముంగిట ఈ సినిమా ఎలాంటి అంచనాలు హైప్ లేకుండానే వస్తోంది. నిజానికి సిటాడెల్ డిజాస్టరయ్యాక, అన్ని హెూప్స్ ఈ సినిమాపైనే పెట్టుకుంది పీసీ. కానీ ఇది ఆశించిన ఫలితాన్ని ఇస్తుందా లేదా? అన్న సందేహాలు ఇప్పుడు అలుముకున్నాయి. ఒకవేళ హెడ్స్ ఆఫ్ స్టేట్ ఫలితం తారుమారు అయితే ప్రియాంక చోప్రా తదుపరి ప్రణాళికలు ఎలా ఉంటాయి? అంటే కచ్చితంగా పీసీ మరో తెలుగు సినిమా లేదా తమిళ సినిమాలో నటించేందుకు ఆస్కారం ఉ ంది. సౌత్ లోని పాన్ ఇండియన్ డైరెక్టర్లకు ప్రియాంక చోప్రా టచ్ లోకి వెళ్లే అవకాశం ఉంది. దీనికి కారణం ఇటీవల బాలీవుడ్ సినిమాలో నటించేందుకు ఆసక్తిని కనబరచకపోవడమే. హిందీ చిత్రసీమలో కొందరు తనపై కుట్ర చేసారని ఆరోపించిన ప్రియాంక చోప్రా, తన ఎగ్జిస్టెన్సీ కోసం సౌత్ సినిమాని ఆశ్రయించడమే ఉత్తమ మార్గమని భావిస్తున్నట్టు అర్థం చేసుకోవాలి. హాలీవుడ్ వర్కవుట్ కాకపోయినా, టాలీవుడ్ లో పనవుతుంది. ఇక్కడ పారితోషికం పరంగా కొంత పట్టు విడుపు ఉంటే తనను మరిన్ని అవకాశాలు వరించేందుకు అవకాశం ఉంది. సౌత్ లో ఒక ఊపు ఊపితే, బాలీవుడ్ లో మళ్లీ అవకాశాలు పుంజుకునే ఛాన్సుంటుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536